

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 338

మంగళవారం 28-2-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

రైతులకు భరోసా కల్పించాలన్న ఏకైక లక్ష్యంతో నాలుగేళ్లుగా ఎన్ని కష్టాలు ఎదురైనా.. చెప్పిన సమయానికి చెప్పినట్లుగా, ఠంచనుగా రైతు భరోసా -PM KISAN అందిస్తూ వస్తున్నాం..
దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతన్నలకు ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తున్నాం..
దేవుడి దయతో మీ అందరికీ మంచి చేసే పరిస్థితులు, ఇంకా మంచిచేసే రోజులు రావాలని కోరుకుంటున్నా..

- మీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

ఇప్పటికే వరుసగా నాలుగో ఏడాది.. ఈ ఏడాదికి మూడో విడతగా..

వైఎస్సార్ రైతు భరోసా -PM KISAN

రైతన్నలకు ఒక్కొక్కరికి ఏటా రూ. 13,500 చొప్పున వరుసగా 3 ఏళ్లు, రైతు భరోసా -PM KISAN సాయం అందించడంతోపాటు నాలుగో ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ. 11,500 చొప్పున సాయం అందించిన జగనన్న ప్రభుత్వం..

మూడో విడతగా ఒక్కొక్కరికి మరో రూ. 2,000 చొప్పున 51.12 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ. 1,090.76 కోట్లను గుంటూరు జిల్లా తెనాలిలో నేడు బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్న గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..



నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఒక్కో రైతన్నకు జగనన్న ప్రభుత్వం కేవలం ఒక్క రైతు భరోసా -PM KISAN పథకం ద్వారా మాత్రమే ఇప్పటి వరకు అందించిన మొత్తం సాయం రూ. 54,000

దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతన్నలతో పాటు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ కౌలు రైతులు, RoFR (అటవీ), దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతన్నలకు కూడా "వైఎస్సార్ రైతు భరోసా" క్రింద ఏటా రూ. 13,500 రైతు భరోసా సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే..

ఇప్పుడు అందిస్తున్న సాయం రూ. 1,090.76 కోట్లతో కలిపి ఈ మూడేళ్ళ తొమ్మిది నెలల్లో జగనన్న ప్రభుత్వం రైతన్నలకు అందించిన మొత్తంలో కేవలం "వైఎస్సార్ రైతు భరోసా - PM KISAN" సాయం మాత్రమే రూ. 27,062 కోట్లు..

చెప్పిన దాని కన్నా ముందుగా.. మాట ఇచ్చిన దానికన్నా మిన్నగా రైతన్నలకు సాయం..

మ్యానిఫెస్టోలో చెప్పింది - ఏటా రూ. 12,500 X 4సం॥ = రూ. 50,000
జగనన్న ప్రభుత్వం ఇస్తున్నది - ఏటా రూ. 13,500 X 5సం॥ = రూ. 67,500
మ్యానిఫెస్టోలో చెప్పినదానికన్నా రైతన్నకు అదనంగా అందిస్తున్న మొత్తం రూ.17,500

"రైతు భరోసా - PM KISAN" క్రింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి అందిస్తున్న సాయం రూ.13,500...

మొదటి విడత	రెండవ విడత	మూడవ విడత
ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ. 7,500	అక్టోబర్ నెల ముగిసేలోపే ఖరీఫ్ పంట కోత సమయం, రబీ అవసరాల కోసం రూ. 4,000	పంట ఇంటికి వచ్చే సమయాన, జనవరి-ఫిబ్రవరి నెలలో రూ. 2,000

ఇది జగనన్న ప్రభుత్వం..
ఈ మూడేళ్ళ తొమ్మిది నెలల్లో రైతన్నలకు అందించిన సాయం..

పథకం	రైతుల సంఖ్య (లక్షల్లో)	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా - PM KISAN	52.38	27,062.09
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	44.28	6,684.84
ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం	22.22	1,911.78
ధాన్యం కొనుగోలు (నేటి వరకు)		55,401.58
ఇతర పంటల కొనుగోలు (నేటి వరకు)		7,156.00
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ		27,800.00
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ		2,647.00
పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంపుకు..		1,700.00
శనగ రైతులకు బోనస్		300.00
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	13.58	1,264.24
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.32	85.47
వైఎస్సార్ యంత్ర సేవా పథకం		690.87
విత్తన సబ్సిడీ	60.76	1,023.52
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (మనం చెల్లించిన గత ప్రభుత్వ బకాయిలతో సహా)	73.88	1,834.55
మనం చెల్లించిన గత ప్రభుత్వ ధాన్యం సేకరణ బకాయిలు		960.00
గత ప్రభుత్వ కరెంటు బకాయిలు (మనం మన మీద వేసుకున్నది)		8,845.00
గత ప్రభుత్వం చెల్లించాల్సిన విత్తన బకాయిలు (మనం చెల్లించింది)		384.00
మొత్తం సాయం		1,45,750.94

జగనన్న ప్రభుత్వం ఇప్పటివరకు రైతన్నలకు అందించిన సాయం అక్షరాలా రూ. 1,45,751 కోట్లు..

రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ..



ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తామన్న మాట మరోసారి నిలబెట్టుకుంటూ..

2022 డిసెంబర్ లో మాండోస్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాలు, వరదల వల్ల జరిగిన పంట నష్టాలు, ఇసుక మేట, నేల కోత వల్ల నష్టపోయిన 91,237 మంది వ్యవసాయ, ఉద్యానవన రైతన్నలకు రూ. 76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని రబీ 2022 ముగియక ముందే నేడు బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్న గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

నేడు జమ చేస్తున్న రూ. 76.99 కోట్లతో కలిపి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన 22.22 లక్షల మంది రైతన్నలకు అందించిన మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీ అక్షరాల రూ. 1,911.78 కోట్లు..

ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతన్నలకు సత్వర ఉపశమనం కల్పిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం పంపిణీ..

విపత్తుల సమయంలో జరిగిన నష్టానికి ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం రైతులకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ...

పంట నష్ట కాలం	పరిహారం అందించిన తేది	రైతుల సంఖ్య	పెట్టుబడి సాయం (రూ. కోట్లలో)
2019-20 (భారీ వర్షాలు)	26 ఏప్రిల్, 2020	1.57 లక్షలు	123.70
ఏప్రిల్ - సెప్టెంబర్, 2020 (భారీ వర్షాలు)	27 అక్టోబర్, 2020	1.74 లక్షలు	146.24
అక్టోబర్, 2020 (భారీ వర్షాలు)	17 నవంబర్, 2020	1.97 లక్షలు	132.63
నవంబర్, 2020 (నివర్ తుఫాన్)	29 డిసెంబర్, 2020	8.34 లక్షలు	645.99
సెప్టెంబర్, 2021 (గులాబ్ తుఫాన్)	16 నవంబర్, 2021	0.35 లక్షలు	22.10
నవంబర్, 2021 (భారీ వర్షాలు)	15 ఫిబ్రవరి, 2022	5.97 లక్షలు	542.10
2018 (గత ప్రభుత్వం) లో తిత్లీ తుఫాన్ వల్ల నష్టపోయిన ఉద్యానవన పంటలకు అదనపు పరిహారం	22 జూన్, 2022	0.91 లక్షలు	182.63
జులై - అక్టోబర్, 2022 (భారీ వర్షాలు)	28 నవంబర్, 2022	0.46 లక్షలు	39.40
డిసెంబర్, 2022 (మాండోస్ తుఫాన్)	28 ఫిబ్రవరి, 2023	0.91 లక్షలు	76.99
మొత్తం సాయం		22.22 లక్షలు	1,911.78

గత ప్రభుత్వం

- అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా.. రైతన్నలు మధ్యదళారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల చుట్టూ ఏళ్ళ తరబడి తిరిగినా పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి..
- కొన్ని సందర్భాల్లో పరిహారం పూర్తిగా ఎగ్గొట్టి, మరికొన్ని సందర్భాల్లో రెండు మూడు సీజన్ల తరువాతే సాయం అందించిన పరిస్థితి.. అదీ అరకొరగానే..
- 2015 నవంబరు, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు, 2018 ఖరీఫ్, రబీలో వచ్చిన కరువుకు జరిగిన రూ. 2,449.16 కోట్ల పంట నష్టానికి అందించిన సాయం "సున్నా"..

మన ప్రభుత్వం

- ఈ-క్రాప్ డేటా ఆధారంగా శాస్త్రీయంగా పంట నష్టాలు అంచనా వేసి వాస్తవ సాగుదార్లందరికీ పరిహారం.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సోషల్ ఆడిట్ కొరకు ఆ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన.. గ్రామ స్థాయిలోనే రైతులు తమ వివరాలు చూసుకొని, పేర్లు లేకపోతే ఫిర్యాదు చేసుకొనే వెసులుబాటు.. వెరిఫై చేసి పొరపాటు జరిగితే సరిదిద్దే కార్యక్రమం..
- ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగా పరిహారం నేరుగా రైతన్నల ఖాతాల్లోనే జమ చేస్తున్న జగనన్న ప్రభుత్వం..
- మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడేళ్ల తొమ్మిది నెలల్లో 22.22 లక్షల మంది రైతన్నలకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1,911.78 కోట్లు..

శ్రీ కాకాణి గోవర్ధన రెడ్డి, వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు 28 ఫిబ్రవరి, 2023 నాడు ఉదయం 11 గంటలకు వైఎస్సార్ రైతు భరోసా - PM KISAN, రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల ద్వారా లబ్ధి జమ చేసే కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా, తెనాలిలో బటన్ నొక్కి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

● జంగిల్ రాణి

పద్మిని మారీు



అడవిని చేరాలంటే ఆమెను దాటాలి

చేత గొడ్డలి కళ్లల్లో తీక్షణత
'అడవికి నేను కాపలా' అనే ప్రకటన.
65 ఏళ్ల పద్మిని మారీు
ఒరిస్సాలో తన పల్లె చుట్టూ ఉన్న
100 హెక్టార్ల అడవిలో పుల్ల కూడా పోకుండా
ఒక్క కొమ్మా తెగి పడకుండా కాపలా కాస్తోంది.
కలప మాఫియా ఆమె దెబ్బకు తోక ముడిచింది.
అందుకే ఆమెను ఆ ప్రాంతంలో
జంగిల్ రాణి అని పిలుస్తుంటారు.

ఉదయం ఆరూ ఆరున్నరకంతా పద్మిని మారీు ఇంటి పనులన్నీ అయిపోతాయి. ఆ తర్వాత ఆమె తన అసలైన ఇంటికి బయలుదేరుతుంది. అంటే దాపున ఉన్న అడవికి. అదే ఆమె రోజంతా గడిపే ఇల్లు.

ఒరిస్సాలోని నొపడా జిల్లాలో బిర్సింగ్‌పూర్ అని చిన్న పల్లె ఆమెది. ఆ పల్లెకు ఆనుకునే చిన్న కొండ. దాని చుట్టుపక్కల విస్తారమైన అడవి. అందులో చాలా విలువైన కలప చెట్లు, మందు మొక్కలు, అడవి పళ్లు అన్నీ దొరుకుతాయి.

'మేము అడవి మీద ఆధారపడి బతుకుతాము. అడవిని నరికి, అడవిలో ఉండే జంతువులను చంపి కాదు'.. అంటుంది పద్మిని.

కిరాసాగర్ మారీు అనే వ్యక్తిని పెళ్లి చేసుకుని ముప్పై ఏళ్ల క్రితం ఆ అడవి పక్క ఊరికి కోడలిగా వచ్చింది పద్మిని. అడవికి వెళ్లి వంట చెరుకు, తేనె, దుంపలు... ఇవన్నీ తెచ్చుకుని బతకడం తొందరగా నేర్చుకుంది.

'కాని అడవిలో ఆ రోజుల్లో కలప దొంగలు విచ్చలవిడిగా తిరిగేవారు. వేటగాళ్లు ఉండేవారు. వారి వల్ల అడవి నాశనమవుతోందని నాకు అర్థమైంది. అడవి పచ్చగా ఉంటే మేము పచ్చగా ఉంటాము. అడవి ఉంటేనే వానలు పడతాయని మా నాన్న నా చిన్నప్పుడు చెప్పేవాడు. అందుకే అడవిని కాపాడాలనుకున్నా' అంటుందామె.

తనకు తానుగా వేసుకున్న ఈ డ్యూటీని పాతికేళ్లు గడిచినా ఆమె వదల్లేదు. రోజూ ఉదయం ఆరున్నరకంతా భుజాన గొడ్డలి వేసుకొని అడవిలోకి బయలుదేరుతుందామె. పుట్టి బుద్ధెరిగాక ఆమె చెప్పులు వేసుకోలేదు. ఇన్నాళ్లుగా ఆమె అడవిలో ఉత్త పాదాలతోనే తిరుగుతుంది. అడవిలోని

> నన్ను చూడగానే చాలామంది పారిపోతారు. అడ్డం తిరిగితే పెద్దగా అరిచి ఊరివాళ్లు సాయం వచ్చేలా చేస్తాను. ఊర్లోకి తీసుకెళ్లి వాణ్ణి కట్టేస్తాం. వాడు క్షమాపణలు చెప్పి మళ్లీ అడవి ముఖం చూడను అని ప్రమాణం చేస్తే వదిలేస్తాం.

ప్రతి అడుగు తెలిసినవారే ఉత్త పాదాలతో తిరగ్గలరు. అడవిని ఆమె ఐదారు భాగాలుగా చేసుకుంది. ఒకోరోజు ఒకో భాగంలో తిరుగుతుంది. దారిలో తనకు కనపడిన ఎండుపుల్లల్ని ఒకచోటకు చేరుస్తుంది. అడ్డంగా ఉన్న కొమ్మలను, తీగలను కొట్టి దారి చేస్తుంది. నిన్న ఉన్న అడవే ఇవాళా ఉందా అని చెక్ చేస్తుంది. ఇక పరాయి వ్యక్తి ఎవరైనా కనిపించాడో గొడ్డలి చేతికందుకుంటుంది.

'మొదట వాణ్ణి భయపెడతాను. నన్ను చూడగానే చాలామంది పారిపోతారు. అడ్డం తిరిగితే పెద్దగా అరిచి సాయం వచ్చేలా చేస్తాను. ఊరి వాళ్లు ఎవరో ఒకరు అడవిలో తిరుగుతూనే ఉంటారు. వారొచ్చి పట్టుకుంటారు. ఊర్లోకి తీసుకెళ్లి వాణ్ణి కట్టేస్తాం. వాడు క్షమాపణలు చెప్పి మళ్లీ అడవి ముఖం చూడను అని ప్రమాణం చేస్తే వదిలేస్తాం. అడవిలో రోజూ నేను తిరుగుతానని ఎదురు పడతానని కలప దొంగలకు, వేటగాళ్లకు తెలిసిపోయింది. అందుకే రావడం మానేశారు. మా అడవి మాకు మిగిలింది' అంటుంది పద్మిని.

ఇన్నేళ్లుగా ఆమె ఒక పైసా ఎవరి నుంచి ఆశించకుండా, ఏ జీతం తీసుకోకుండా ఈ పని చేస్తున్నందు వల్ల ఊళ్లో పద్మిని అంటే చాలా గౌరవం. ఆమెను జంగిల్ రాణి అని పిలుస్తారు. ఫారెస్ట్ రేంజర్లు, గార్డులు ఆమె కనిపిస్తే గౌరవంగా మాట్లాడతారు. 'నాకు జీతం ఎందుకు? ఇది ప్రతి మనిషి బాధ్యత' అంటుంది మారీు.

ఈ అడవి పచ్చగా ఉండటం వల్ల వీకెండ్స్‌లో విహారానికి వచ్చేవారి సంఖ్య ఎక్కువ. వారి ఆనందానికి కారణం ఒక బక్కపలుచని ఆదివాసి మహిళ అని వారికి తెలియకపోవచ్చు. ఇలాంటి తెలియని మహానుభావుల వల్లే మన దేశంలో ప్రకృతి ఈ మాత్రమైనా మిగిలి ఉంది.



బ్యూటిప్

చర్మానికి చెరకు రసం

చెరకు రసంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతుంటాం. దీన్ని దాహం తీర్చుకోవడం కోసం మాత్రమే కాదు.. చర్మ ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరచుకోవడానికి ఉపయోగించుకోవచ్చు. దీనిలో గ్లైకోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మాన్ని ఎప్పుడూ యవ్వనంగా ఉండేలా చేస్తుంది. ఇందుకోసం ఏం చేయాలంటే...

మూడు టేబుల్ స్పూన్ల చెరకు రసంలో.. చెంచా పసుపు కలిపి ముఖానికి అప్లై చేసుకోవాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకొంటే చర్మం కాంతిమంతంగా తయారవుతుంది.

ఇంటిప్స్

రుచికే కాదు.. శుభ్రతకు కూడా

టేబుల్ సాల్ట్ అంటే వంటల్లో ఉపయోగించే ఉప్పుతో రకరకాల ఉపయోగాలున్నాయి. అవేంటో చూద్దాం..

ఉల్లిపాయలు కట్ చేసిన తర్వాత, వెల్లుల్లి పొట్టును తీసిన తర్వాత చేతులు ఘాటైన వాసన కలిగి ఉంటాయి. కాబట్టి, చేతులను కొద్దిగా తడి చేసి, ఉప్పు వేసుకుని, రుద్ది , ట్యాప్ వాటర్‌తో కడిగితే సరి! వాసన పోతుంది.



పావు కప్పు నీళ్లలో స్పూన్ టేబుల్ సాల్ట్ వేసి బాగా కలపాలి. ఈ నీటితో మొటిమలను కడగాలి. అలా చేయడం వల్ల మొటిమలు ముడుచుకుపోతాయి. అంతేకాదు, ఉప్పు నీటితో పుక్కిలించడం వల్ల చిన్న చిన్న నోటి పుండ్లు నయం అవుతాయి.

కొందరికి అరికాళ్లలో చెమట పట్టి షూస్ నుంచి దుర్వాసన వస్తుంది. అలా వాసన రాకుండా ఉండాలంటే ఒక క్లాత్‌లో సాల్ట్ నింపి, షూలో చిలకరించాలి. రెండు మూడు గంటలు అలాగే ఉంచి తర్వాత తీసేస్తే షూస్ వాసన రాకుండా ఉంటాయి.



స్మరణ: నేషనల్ సైన్స్ డే

'ఆడపిల్లకు చదువులెందుకు!' అని అనుకునే రోజులవి.
ఆడపిల్ల ఇల్లు దాటి బడికి వెళితే అమితాశ్చర్యంగా చూసే రోజులవి.
అలాంటి రోజుల్లో జానకీ అమ్మాళ్ చదువుల్లో 'రాణి'ంచింది.
శాస్త్రరంగంలో విలువైన పరిశోధనలు చేసింది. నిరంతర స్ఫూర్తిగా నిలిచింది...

కాలాతీత స్ఫూర్తి



జానకీ అమ్మాళ్

కేరళలోని తలచ్చేరీలో 1897లో జన్మించింది జానకీ అమ్మాళ్. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మకమైన 'యూనివర్శిటీ ఆఫ్ మిషిగాన్' స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. 'బొటానికల్ సైన్స్'లో డాక్టరేట్ చేసిన తొలి భారతీయ మహిళగా జానకి చరిత్ర సృష్టించింది.

అమెరికాకు వెళ్లడానికి ముందు మద్రాస్, త్రివేండ్రమ్‌లలో బాటనీ ప్రొఫెసర్‌గా పని చేసింది.

అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరువాత జన్యుశాస్త్ర విభాగంలో ఎన్నో పరిశోధనలు చేసింది.

చెరుకు మొక్కల జీవపరిణామ క్రమంపై ఆమె రాసిన 'క్రోమోజోమ్ అట్లాస్ ఆఫ్ కల్టివేటెడ్ ప్లాంట్స్' ఒక ప్రామాణిక పుస్తకం అయింది. అంతర్జాతీయ స్థాయిలో ఎందరో శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా నిలిచింది.

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (కోల్‌కతా)కు ప్రత్యేక అధికారిగా సేవలు అందించింది జానకి. రీజినల్ రీసెర్చి లేబొరేటరి (జమ్ము), బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బొంబాయి), సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (బొంబాయి) గౌరవ శాస్త్రవేత్తగా సేవలు అందించింది. బొటానికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్‌ఐ) కార్యదర్శి, గౌరవ అధ్యక్షురాలిగా, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఉపాధ్యక్షురాలిగా పనిచేసింది.

జానకి వృత్తి జీవితం ఎంత స్ఫూర్తిదాయకంగా ఉండేదో వ్యక్తిగత జీవితం కూడా అంతే స్ఫూర్తిదాయకంగా ఉండేది. పిల్లలతో చాలా సరదాగా గడిపేది. వారికోసం ఎన్నో పుస్తకాలు తెచ్చేది. పిక్‌నిక్‌కు తీసుకెళ్లి సరదా కథలు, శాస్త్రీయ విషయాలు చెప్పేది. క్రమశిక్షణ విషయంలో మాత్రం స్ట్రిక్ట్‌గా ఉండేది.

భారతీయ శాస్త్ర దిగ్గజాలలో ఒకరైన జానకీ అమ్మాళ్ ప్రయాణం నల్లేరు మీద నడక కాదు.

పురుషాధిపత్య భావజాలం ఆమెను ఇబ్బంది పెట్టేది. తన సూచనలు, సలహాలను సాటి ఉద్యోగులు పట్టించుకునేవారు కాదు. 'బొటానికల్ సొసైటీ ఆఫ్ ఇండియా'ను కొత్త కాంతితో పునర్వ్యవస్థీకరించాలనే జానకి కలను నెరవేరకుండా చేయలని కొందరు అడ్డుపడ్డారు. ఈ విషయం జానకిని చాలా బాధ పెట్టింది.

ఎనభై ఏళ్ల వయసులో ఆమెకు పద్మశ్రీ వచ్చింది. తన ప్రతిభకు తగిన గౌరవం దక్కలేదని విమర్శ ఉంది.

అయితే పురస్కారాలపై ఆమె ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. తన తపనంతా శాస్త్ర పరిశోధనపైనే!

'చేసిన కష్టం ఎప్పుడూ వృథా పోదు. మనం చేసిన పని నిలబడుతుంది' అనేది జానకీ అమ్మాళ్. ఆ మాట అమ్మాళ్ విషయంలో అక్షరాలా నిజమైంది.

గత సంవత్సరం నవంబర్‌లో 'క్రోమోజోమ్ ఉమెన్-నొమాడ్ సైంటిస్ట్: ఇకే జానకీ అమ్మాళ్' అనే పుస్తకం విడుదలైంది. అనేక సంవత్సరాల పరిశోధన తరువాత సావిత్రి ప్రీత నాయర్ ఈ పుస్తకం రాసింది. 650 పేజీల ఈ పుస్తకం జానకీ అమ్మాళ్ జీవితంపై వచ్చిన సమగ్ర పుస్తకంగా పేరు తెచ్చుకోవడమే కాదు శాస్త్రరంగంలో అడుగు పెట్టాలని, అపూర్వ విజయాలు సాధించాలనుకునేవారికి ఎంతో స్ఫూర్తి ఇస్తోంది.

సాగుబడి
శతభిష కార్తె: మార్చి 4 వరకు
పూర్వాభాద్ర కార్తె: మార్చి 5 నుంచి

డ్రాగన్ ఫ్రూట్‌తో పసందైన పానీయం



- బెంగళూరులోని ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తల రూపకల్పన
- సింథటిక్ పదార్థాలు కలపని ఈ పానీయం 6 నెలలు నిల్వ ఉంటుంది.
- డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో విలువ జోడింపుతో రైతులకు మేలు

డ్రాగన్ ఫ్రూట్‌ను పండుగా, పండ్ల నుంచి అప్పటికప్పుడు తీసిన తాజా రసం తీసుకోవటమే ఇప్పటి వరకు మనకు తెలుసు. అయితే, నెలల పాటు నిల్వ ఉంచి ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగడానికి సిద్ధంగా ఉండే డ్రాగన్ ఫ్రూట్ పానీయం మార్కెట్‌లో అందుబాటులో లేదు. ఈ కొరత తీర్చే కొత్త సాంకేతికతను బెంగళూరులోని ఐసిఏఆర్ అనుబంధ సంస్థ భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) శాస్త్రవేత్తలు ఇటీవల రూపొందించారు. డ్రాగన్ ఫ్రూట్స్‌లో ఎరుపు-గుజ్జు (హైలోసెరియస్ పాలీరైజస్), తెల్ల గుజ్జు (హైలోసెరియస్ ఉండటస్) రకాలు ఉంటాయి. ఈ రెండు రకాలతోనూ రెడీ-టు-సర్వ్ (ఆర్.టి.ఎస్.) పానీయాల తయారీ సాంకేతికతను ఐఐహెచ్ఆర్ అభివృద్ధి చేసింది. గుజ్జు రంగును బట్టి పానీయం రంగు వేరుగా ఉంటుంది.

డ్రాగన్ ఫ్రూట్‌ను పిటయ/కమలం అని కూడా పిలుస్తారు. ఇది కాక్టేసి కుటుంబానికి చెందినది. మలేసియా, వియత్నాం, థాయిలాండ్, ఇండోనేసియా, చైనా దేశాల్లో విస్తారంగా పండించే డ్రాగన్ ఫ్రూట్ సాగు ఇటీవల సంవత్సరాల్లో మన దేశంలోనూ విస్తరిస్తోంది. దేశంలో దాదాపు 3 వేల హెక్టార్లలో సాగవుతోందని అంచనా. ఈ పండ్లకు నానాటికీ పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, వచ్చే ఐదేళ్లలో దాని సాగును 50 వేల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రస్తుతం, మార్కెట్‌లో పండ్లను రూ. 150–200/కేజీకి విక్రయిస్తున్నారు. ప్రధానంగా దీన్ని టేబుల్ ఫ్రూట్‌గా, సలాడ్‌గా వాడుతున్నారు. జ్యూస్ దుకాణాలు, రెస్టారెంట్లలో తాజా రసాన్ని వినియోగిస్తున్నారు. మన దేశంలో ప్రస్తుతం ఇ-ప్లాట్‌ఫారమ్‌లలో కూడా వాణిజ్య పరంగా ప్యాక్ చేసిన రూపంలో డ్రాగన్ ఫ్రూట్‌తో తయారైన తాగడానికి సిద్ధంగా ఉన్న పానీయం అందుబాటులో లేదు. డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో విలువ జోడింపుతో రైతులకు మేలు కలుగుతుందని నిపుణులు భావిస్తున్నారు.

సహజ రంగు, రుచి యథాతథం

ఈ పండ్లలో పాలీఫెనాల్స్, బీటాలైన్లు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి.

బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి జీవన శైలి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రసిద్ధి చెందాయి. ఇందులో చిన్న విత్తనాలు, జిగట స్వభావం ఉండే దాని గుజ్జు ప్రత్యేకమైనవి. ఏ ఇతర పండ్లలోనూ ఈ విధంగా ఉండవు. అందు వల్ల ఈ ఫ్రూట్‌తో నిల్వ ఉంచి తాగే వీలున్న పానీయాన్ని తయారు చేయడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు డ్రాగన్ ఫ్రూట్ పానీయాన్ని తీసే సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో విత్తనాలు, జిగట పదార్థాన్ని తొలగిస్తారు. కానీ దాని విలక్షణమైన రంగు, రుచి దెబ్బతినకుండా చూశారు. ఈ సహజ పానీయం విటమిన్ సి, పాలీఫెనాల్స్, బీటాలైన్స్‌తో కూడిన ఎరుపు రంగు సహజ ద్రవ్యంతో నిండి ఉంటుంది. ప్రకాశవంతమైన గులాబీ రంగు డ్రాగన్ ఫ్రూట్ పానీయం వినియోగదారులకు చక్కటి తేలిక పాటి రుచిని, పోషకాలను అందిస్తుంది. ఈ పానీయం ఆరు నెలల పాటు నిల్వ ఉంటుంది. రుచి లేదా రంగుల కోసం సింథటిక్ పదార్థాలను కలపలేదు. ఈ పండు ప్రత్యేకమైన సహజ రుచిని ఇప్పుడు పానీయాల రూపంలో ఎవరైనా, ఎప్పుడైనా ఆస్వాదించవచ్చు. సాగు విస్తీర్ణం పెరిగే కొద్దీ మార్కెట్‌లో డ్రాగన్ పండ్ల ధర తగ్గిపోకుండా చూడటానికి, పండ్ల రూపంలోనే కాకుండా పానీయం రూపంలో కూడా స్థానికంగా ఏడాది పొడవునా అందుబాటులో తేవడానికి, ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు రూపొందించిన సాంకేతికత ఉపయోగపడుతుంది. తద్వారా డ్రాగన్ ఫ్రూట్ రైతులు స్థిరంగా మంచి ఆదాయాన్ని అందుకోవటానికి వీలవుతుందని చెప్పొచ్చు.

> డ్రాగన్ పానీయాన్ని రూపొందించే సాంకేతికతను నామమాత్రపు ఫీజు చెల్లించి పండ్ల రసాల ఉత్పత్తిదారులు, సంస్థలు ఐఐహెచ్ఆర్ నుంచి పొందవచ్చు.

డ్రాగన్ పానీయాన్ని రూపొందించే సాంకేతికతను నామమాత్రపు ఫీజు చెల్లించి పండ్ల రసాల ఉత్పత్తిదారులు, సంస్థలు ఐఐహెచ్ఆర్ నుంచి పొందవచ్చు. ఇతర వివరాలకు.. ఐఐహెచ్ఆర్ (బెంగళూరు) ప్రధాన శాస్త్రవేత్త డా. కరుణాకరన్ (94832 33804), సీనియర్ శాస్త్రవేత్త డా. పుష్ప చేతన్ కుమార్ (83106 08595)లను కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చు.

నల్ల తామర తీవ్రత రసాయన సాగుతో పోల్చితే ప్రకృతి సాగులో 10 శాతమే!



> నల్ల తామర.. మిర్చి రైతులకు నిద్ర లేకుండా చేస్తున్న పురుగు ఇది. నల్లతామర తదితర చీడపీడల తీవ్రత ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తున్న రైతు సాధికార సంస్థ (ఆర్.వై.ఎస్.ఎస్.) క్షేత్ర స్థాయి సిబ్బంది గుంటూరు జిల్లాలోని 20 గ్రామాల్లో ఎంపిక చేసిన రైతుల మిరప తోటలను అనుదినం గమనిస్తున్నారు. అయితే, అన్ని పొలాల్లోనూ ఈ పురుగు దాడి ఒకేలా లేదు. సాగు పద్ధతిని బట్టి ఈ పురుగు తీవ్రతలో ఒకటికి పది రెట్లు వ్యత్యాసం కనిపిస్తోంది. రసాయనాలు వాడే మిరప తోటల్లో కనిపించే నల్ల తామర పురుగుల సంఖ్యలో కేవలం 10% మాత్రమే ప్రకృతి సాగులో ఉన్న మిరప తోటల్లో కనిపిస్తున్నాయని లాం గ్రామంలో ఇటీవల జరిగిన క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడైంది.

రసాయనాలు వాడుతున్న మిరప తోటల్లో పువ్వుకు 20–30 నల్లతామర పురుగులు కనిపిస్తే.. పక్కనే ప్రకృతి సేద్యపు మిరప తోటలో పువ్వుకు 3 పురుగులు కనిపించాయి.

ప్రకృతి సేద్యం ఇలా..

మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న లాం గ్రామం రైతు జి. శేషు రెడ్డి తన పొలంలో మిర్చి పంటకు ముందు (పీఎండీఎస్) 14 రకాల విత్తనాలు చల్లారు. 45 రోజులకు ఆ పంటను కోసిన తర్వాత మిర్చి మొక్కలు నాటారు. మిర్చిలో కొత్తిమీర, బీట్‌రూట్, టమాటా, బీన్స్‌ను అంతర పంటలుగా వేశారు. బంతిని ఎరపంటగా వేశారు. దుక్కిలో ఘనజీవామృతంతోపాటు 12 సార్లు ద్రవ జీవామృతం పిచికారీ చేశారు. 2 సార్లు నీటి తడితో పాటు పారించారు. దశపర్ణి కషాయం 2 సార్లు, ఉల్లి కషాయం 2 సార్లు పిచికారీ చేశారు. 6 రకాల బయో పెస్టిసైడ్స్(బివేరియా బాసియానా, వెర్టిసిలియం లెకానియం, బిడి 500, మెటారైజియం, ట్రైకోడెర్మా విరిడే)ను 6 సార్లు పిచికారీ చేశారు. లాక్టిక్ ఆసిడ్ బాక్టీరియా ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ పొలంలో లేడీ బర్డ్ బీటిల్స్, తేనెటీగలు, జంపింగ్ స్పైడర్స్, డామ్‌సెల్ ఫ్లై వంటి మిత్రపురుగులు కనిపించాయి. మిరప పువ్వులలో సగటున 3 నల్ల తామర పురుగులు ఉన్నాయి. వచ్చే వారం పండు మిర్చి కోతలు ప్రారంభమవుతాయి.

ఖర్చు రూ. 18 వేలు.. దిగుబడి 20 క్వింటాళ్లు..

లాం గ్రామానికి చెందిన రైతులు జి.శేషురెడ్డి, కె.రామిరెడ్డి గత మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మిరప సాగులో వీరు ఎకరానికి ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కషాయాలు, సొంతంగా తయారు చేసుకున్న జీవన పురుగుమందులను సైతం వాడుతున్నారు. ఇందుకుగాను వీరికి ఎకరానికి రూ. 18 వేల వరకు ఖర్చు అయ్యింది. తొలికోత త్వరలో కోయబోతున్నారు. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల ఎండు మిర్చి దిగుబడి వచ్చే పరిస్థితి ఉందని సిఆర్‌పి గురవయ్య తెలిపారు.

రసాయన సేద్యం ఇలా..

లాం గ్రామంలో రసాయన వ్యవసాయం చేసే రైతు ఆర్.జోజప్ప మిరప పొలంలో అంతర పంటలు, ఎర పంట లేవు. రసాయనిక ఎరువులతో పాటు తరచుగా పురుగుమందులు చల్లుతున్నారు. ప్రతి మిరప పువ్వులో 20 నుంచి 30 వరకు నల్ల తామర పురుగులను ఆర్.వై.ఎస్.ఎస్. సిబ్బంది గమనించారు. మిరప తోట అంతటా కింది ముడత, పైముడతతో ఆకులు ముడుచుకు పోయాయి. మొజాయిక్ వైరస్ సోకిన మిరప మొక్కలు కూడా రెండు కనిపించాయి.

ఖర్చు రూ. 60 వేలు.. దిగుబడి 10 క్వింటాళ్లు..

జోజప్ప ఎకరానికి ఎరువులు, పురుగుమందులకే రూ. 60 వేల నుంచి 80 వేల వరకు ఖర్చుపెట్టారు. ఈ తోటలో నల్లతామర తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. పైముడత, కింది ముడత వల్ల పంట దిగుబడి ఎకరానికి 10 క్వింటాళ్లకు పడిపోయే పరిస్థితి నెలకొందని సిఆర్‌పి గురవయ్య(99484 557 28) తెలిపారు.



డా.ఖాదర్, ఉష దంపతులు

అసలు పని ఇప్పుడే మొదలైంది!

> పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డా. ఖాదర్ వలితో 'సాక్షి' ముఖాముఖి

స్వతంత్ర శాస్త్రవేత్త, సిరిధాన్యాల ప్రచారకర్త డా. ఖాదర్ వలి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డా. ఖాదర్, ఉషా ఖాదర్ దంపతులతో 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు ఇటీవల ముచ్చటించారు. దాదాపు గంట సేపు జరిగిన ముఖాముఖిలో కొన్ని ముఖ్యాంశాలు.. మీ కోసం..

'ప్రపంచ ఆహార సంస్కృతి తల్లకిందులైంది. ఆహారం ప్రజల చేతుల్లోంచి కేంద్రీకృత కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. వాణిజ్యప్రయోజనాల కోసం పారిశ్రామికంగా ఉత్పత్తి చేసిన ఆహారోత్పత్తుల వల్ల మన పొట్టలో మేలు చేసే సూక్ష్మజీవ రాశి నశించిపోయింది. ఆహారంలో రసాయనాలకు తోడు రసాయనాలతో కూడిన ఔషధాల వినియోగం పెరిగిపోవటం వల్ల ఈ ఉపద్రవం జరిగింది. ఆహారోత్పత్తి పద్ధతులు, ఆహార పదార్థాలు మారిపోయి అనారోగ్యకరమైన అంశాలను సంతరించుకున్నాయి.

కార్పొరేట్ సంస్థలు 70 ఏళ్లగా నడిపిన ఆహార రాజకీయాల వల్ల ఆహార, ఆరోగ్య, పర్యావరణ పరంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రీకృత కార్పొరేట్ ఆహార రాజకీయాల్లో శాస్త్రవేత్తలు సైతం భాగస్వాములుగా మారిపోయిన ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎరుకతో ఆలోచించాలి. వరి, గోధుమలు, పాలు, చక్కెర వంటి ఈ కాలపు ఆహార పదార్థాలలో అనారోగ్యం కలిగించే అంశాలు ఇమిడి ఉన్నాయని గ్రహించాలి. తమకు మేలు చేసే సిరిధాన్యాలను తిరిగి ఆహారంలోకి తెచ్చుకోవాలి. ఇది చాలా నెమ్మదిగా జరిగే ప్రక్రియ.


భూతాపం పెచ్చుమీరుతున్న విపత్కర పరిస్థితుల్లో మెట్ట భూముల్లో గాలిలో తేమను పీల్చుకొని పెరిగే సి4 పంటలైన సిరిధాన్యాలే మానవాళికి దిక్కు. 8 బిలియన్ల జనాభాకే కాదు భవిష్యత్తులో 700 బిలియన్ల జనాభాకు కూడా ఆరోగ్యదాకమైన ఆహారాన్ని అందించే సత్తా సిరిధాన్యాలకు ఉంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించినందుకు కృతజ్ఞతలు. స్వదేశంలోనే ఉంటూ ప్రజ్ఞాపూర్వకంగా గ్రహించిన ఈ విషయాలను గత పాతికేళ్లుగా ప్రచారం చేస్తున్న నాకు ఈ పురస్కారం రావటం అధికారికంగా ఊతాన్నిచ్చిందని భావిస్తున్నాను. ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా



డా.ఖాదర్, ఉషతో ముచ్చటిస్తున్న పంతంగి రాంబాబు

జరుపుకుంటున్న ప్రపంచ దేశాలు కలసికట్టుగా ఈ దిశగా కదిలితే వచ్చే రెండేళ్లలోనే పరిస్థితుల్లో గుణాత్మక మార్పు తేవటం సాధ్యమవుతుంది. సిరిధాన్యాలను జనబాహుళ్యం ప్రధాన ఆహారంగా మార్చే కృషిలో అసలు పని ఇప్పుడే మొదలైంది. యువతలో ఆహార-ఆరోగ్య సంబంధమైన ఎరుకను పెంపొందించేందుకు ఈ ఏడాది అధిక ప్రాధాన్యం ఇస్తాను..' అన్నారు డా. ఖాదర్.

(డా. ఖాదర్ వలి, ఉష దంపతులతో 53 నిమిషాల ఇంటర్వ్యూ వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చెయ్యండి)



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 338

మంగళవారం 28-2-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




నంబర్‌వన్ రికార్డు

టెన్నిస్‌లో అత్యధిక వారాలు టాప్ ర్యాంక్‌లో నిలిచిన జొకోవిచ్ - 12లో



ఏడో రోజూ నష్టాలే

నెల కనిష్టానికి సెన్సెక్స్.. 59,288 పాయింట్లకు చేరిక - 13లో



సీబీఐ కస్టడీకి సిసోడియా

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సిసోడియాను సీబీఐ 5 రోజులపాటు తమ కస్టడీకి తీసుకుంది.

వివరాలు 6లో ▸



నేపాల్ ప్రభుత్వంలో కుదుపు

నేపాల్‌లో సీపీఎన్-యూఎంఎల్ కూటమి.. ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది.

వివరాలు 6లో ▸



అందరికీ విమానయోగం

హవాయి చెప్పులేసుకునే సామాన్యులు కూడా విమాన ప్రయాణం చేయగలగాలన్న కల.. నిజమవుతోందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



పుతిన్‌కు శిరోభారంగా యుద్ధం

రష్యాకు తిరుగులేని నాయకుడిగా వెలిగిపోవాలనుకున్న వ్లాదిమిర్ పుతిన్ ఆశలకు ఉక్రెయిన్ పరిణామాలు గండికొట్టాయి.

వివరాలు 6లో ▸

పెట్టుబడులకు రాచబాట

విశాఖ జీఐఎస్ సదస్సులో 15 కీలక రంగాలపై ప్రధానంగా దృష్టి

హాజరు కానున్న ప్రముఖ కార్పొరేట్ దిగ్గజాలు, కేంద్ర మంత్రులు

- తొలిరోజు 9.. రెండో రోజు 6 రంగాల్లో అవకాశాలపై చర్చ
- రంగాల వారీగా రాష్ట్రంలో అవకాశాలను వివరిస్తూ వీడియోలు
- ప్యానల్ డిస్కషన్స్‌లో పాల్గొననున్న ఆయా రంగాల నిపుణులు
- మారుతున్న ఆహారపు అలవాట్లపై ప్రత్యేక చర్చా కార్యక్రమం
- రెండు రోజుల సదస్సులో పలు కీలక ఒప్పందాలకు సన్నాహాలు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: సహజ వనరులకు నిలయమైన ఆంధ్రప్రదేశ్‌లో అపార అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కీలకమైన 15 రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. తొలిరోజైన మార్చి 3వ తేదీన తొమ్మిది రంగాలపై, రెండో రోజు 6 రంగాలపై చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం ఫుడ్ ప్రాసెసింగ్, రెన్యువబుల్ ఎనర్జీ–గ్రీన్ హైడ్రోజన్, హెల్త్ కేర్–మెడికల్ ఎక్విప్‌మెంట్, ఏరోస్పేస్–డిఫెన్స్, పెట్రోలియం–పెట్రో కెమికల్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్‌ఫ్రా–లాజిస్టిక్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్–ఈవీ, స్టార్టప్స్–ఇన్నోవేషన్స్, ఉన్నత విద్య, టూరిజం, టెక్స్‌టైల్, ఫార్మాస్యూటికల్స్ రంగాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలో ఆయా రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఒనగూరే లాభాలను వివరిస్తూ ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థల అభిప్రాయాలతో వీడియో విజువల్స్ సిద్ధం చేయడమే కాకుండా ప్రత్యేక సెషన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం లాంటి అంశాలపై పారిశ్రామికవేత్తలు, నిపుణులు పాల్గొనేలా

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర ప్రగతిని చూడండి



"విశాఖలో మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరై రాష్ట్ర ప్రగతి, అందాలను ఆస్వాదించాల్సిందిగా కోరుతున్నా. మీ అందర్నీ త్వరలో విశాఖ సదస్సులో కలుస్తా."

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

వచ్చే నెల 14 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



సాక్షి, అమరావతి: వచ్చే నెల 14వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. వారం రోజులు సభ నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ, ఎన్ని రోజులు సభ నిర్వహించాలనే అంశాలపై అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత నిర్వహించే బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నాయి. ఈ సమావేశాలను ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే నెల 13న జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ఇబ్బంది కలగకుండా సమావేశాలను ఆ మరుసటి రోజు నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నాగాలాండ్, త్రిపురల్లో బీజేపీ

మేఘాలయలో హంగ్



ఈశాన్య రాష్ట్రాల్లో మళ్లీ కమల వికాసమేనని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. తాజాగా ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో నాగాలాండ్, త్రిపురల్లో మళ్లీ బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని, మేఘాలయలో హంగ్ తప్పదని జోస్యం చెప్పాయి. అక్కడ అధికార ఎన్‌పీపీ మరోసారి ఏకైక పెద్ద పార్టీగా నిలుస్తుందని అంచనా. త్రిపురలో ఎన్నో ఆశలతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలకు కొత్త పార్టీ టిప్రా మోతాతో గట్టి దెబ్బ తగలనుంది.

6లో

ఎగ్జిట్ పోల్స్ అంచనా

మేఘాలయ
అధికార ఎన్‌పీపీకి 18 నుంచి 26 సీట్లు

నాగాలాండ్
అధికారాన్ని నిలుపుకోనున్న ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమి

త్రిపుర
సీపీఎం–కాంగ్రెస్ అవకాశాలకు గండి కొట్టిన టిప్రా మోతా

న్యూస్‌రీల్

బెయిల్‌పై టీడీపీ నేత నారాయణకు చుక్కెదురు



ప్రశ్న పత్రాల లీకేజీ కేసులో టీడీపీ నేత పి.నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బెయిల్ రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఆయన ఈ పిటిషన్ వేశారు.

వివరాలు 10 ▸

అయ్యన్నపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు అనుమతి



టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడుపై నమోదైన ఫోర్జరీ కేసులో సుమారు పదేళ్ల వరకు శిక్షపడే ఐపీసీ సెక్షన్ 467 ప్రకారం దర్యాప్తు చేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను పక్కనపెట్టింది.

వివరాలు 10 ▸

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



విజయవాడలోని లయోల కాలేజీలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. పర్యావరణ పరిరక్షణ, రోడ్డు భద్రత, అంతరిక్ష విజ్ఞానం, కాలుష్య నియంత్రణ, కంప్యూటర్ పరిజ్ఞానం అంశాల్లో 260 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు.

వివరాలు 3 ▸

ఏడాది బిడ్డకు గుండె మార్పిడి



పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన ఏడాది బిడ్డకు తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం విజయవంతంగా గుండె మార్పిడి చేసి పునర్జన్మ ప్రసాదించింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేసింది.

వివరాలు 2 ▸

ఇదంజగత్



కూటమితో వెళ్తాం.. లేకుండా ఎలాగూ వెళ్లలేం కాబట్టి..!

ఆరోగ్య సిరులు


పోషకాహార లోపాన్ని నివారించే చిరుధాన్యాలు

- ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఏపీతో సహా ఏడు రాష్ట్రాల్లో మిల్లెట్ మిషన్ల ఏర్పాటు
- ప్రపంచంలో మిల్లెట్స్ ఉత్పత్తిలో భారత్‌దే అగ్రస్థానం
- దేశవ్యాప్తంగా 170.67 లక్షల టన్నులు చిరుధాన్యాల ఉత్పత్తి
- ఈ ఏడాది మిల్లెట్స్ సంవత్సరంగా ఉత్సవాలు
- ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు
- బహిరంగ ప్రదేశాల్లో మిల్లెట్ వెండింగ్ మెషీన్ల ఏర్పాటు
- ఉత్పత్తి, వినియోగం పెంచేందుకు ప్రత్యేక చర్యలు
- చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు
- జగనన్న గోరుముద్దలో చిన్నారులకు రాగి జావ



సాక్షి, అమరావతి: పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యాన్ని పెంపొందించే చిరుధాన్యాల (మిల్లెట్స్)ఉత్పత్తి పెంపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలో ఏడు రాష్ట్రాలు మిల్లెట్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఏపీ, మహారాష్ట్ర, ఒడిశా, అస్సాం, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు మిల్లెట్ మిషన్లు ఏర్పాటు చేశాయని వివరించింది. ఈ ఏడాది అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా జరుపుకుంటున్న నేపథ్యంలో కేంద్రం, రాష్ట్రాలు చిరుధాన్యాల ఉత్పత్తిని, స్థానిక వినియోగాన్ని

మిగతా 2వ పేజీలో ▶



మనసేం బాలేదు!

పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో కుదేలు

'టెలీ మానస్'కు కాల్ చేస్తున్న బాధితులు

కరోనా మహమ్మారి చాలా మందిలో మానసిక శక్తిని దెబ్బతీయగా.. వివాహ బంధాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, విద్య, అనారోగ్యం ఇతరత్రా కారణాల వల్ల మానసిక సమస్యలతో సతమతమయ్యే వారి సంఖ్య పెరుగుతోంది. ఇలా మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారు వైద్య శాఖ ఏర్పాటు చేసిన 'టెలీ మానస్' కాల్ సెంటర్‌ను సంప్రదిస్తున్నారు.

- వివరాలు 5లో

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై

హైకోర్టు స్టే

- సూక్ష్మ ఆవరణల్లో ఆర్బీకేలు, సచివాలయాల నిర్మాణం వ్యవహారం
- పిటిషన్లలో అభ్యర్థనను దాటి సింగిల్ జడ్జి విచారణ సాగుతోందన్న ఏజీ
- ఏజీ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం
- విచారణ మార్చి 28కి వాయిదా

10లో



డాక్టర్ మజారుద్దీన్ అలీఖాన్

పిస్టల్‌తో కాల్చుకున్న అసదుద్దీన్ ఒవైసీ వియ్యంకుడు

ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వియ్యంకుడు డాక్టర్ మజారుద్దీన్ అలీఖాన్ తన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో కాల్చుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన ఇంట్లోనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ఆర్థిక, కుటుంబ వివాదాలే కారణమని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మజారుద్దీన్ ఒవైసీ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగం డీన్‌గా పనిచేస్తుండగా.. ఆయన కుమారుడు అబేద్ అలీఖాన్ అదే హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సర్జన్‌గా ఉన్నారు.

- వివరాలు 11లో

పాడి రైతుకు తోడు

ఆర్బీకేల ద్వారా అన్నదాత ముంగిట్లో పశు వైద్యసేవలు

- హెల్త్ కార్డులతోపాటు గ్రామస్థాయిలో శిబిరాలు
- సర్టిఫై చేసిన పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా.. పశువులు, మేకలు, గొర్రెల పెంపకందారుల కోసం పశువిజ్ఞాన బడులు
- పాడిరైతుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్లు.. మూగ జీవాల కోసం వైఎస్సార్ సంచార పశు వైద్య సేవలు
- 108 అంబులెన్స్‌ల తరహాలో పశువులకు వైద్యసేవలు దేశంలోనే తొలిసారి



సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు పాడి రైతన్నలకు బాసటగా నిలుస్తూ పశువులకు పూర్తిస్థాయి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాయి. ఆర్బీకేల రాకతో తమ కష్టాలకు తెర పడిందని పాడి రైతులు చెబుతున్నారు. ప్రాథమిక వైద్యం కోసం మండల కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన అవస్థలు తొలగిపోయాయి. ఆర్బీకేలతో గ్రామ స్థాయిలో పశువైద్య సేవలందించడమే కాకుండా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా, మినరల్ మిక్చర్, చాఫ్ కట్టర్స్.. ఏది కావాలన్నా గుమ్మం వద్దకే తెచ్చి ఇస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 108 అంబులెన్స్‌ల తరహాలో

మిగతా 10వ పేజీలో ▶

5 ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవం

- పశ్చిమ గోదావరిలో 2, కర్నూలు, శ్రీకాకుళం స్థానాలకు బరిలో పలువురు
- 3 పట్టభద్రుల, 2 టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకూ ఎన్నికలు
- వచ్చే నెల 13న పోలింగ్.. 16న ఓట్ల లెక్కింపు



సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో జరుగుతున్న 9 స్థానాల్లో ఐదింట్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. అనంతరం అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించి, విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పాటు టీడీపీ మద్దతుదారులు, పలువురు స్వతంత్రులు నామినేషన్లు సమర్పించారు. అయితే, వారి నామినేషన్ పత్రాలు సరిగా లేకపోవడం, ప్రతిపాదితుల సంతకాలు ఫోర్జరీవి కావడం తదితర కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మాత్రమే రంగంలో మిగిలారు. పలువురు అభ్యర్థులు పోటీలో ఉండటంతో పశ్చిమ గోదావరి జిల్లాలోని 2 స్థానాలు, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లోని మరో రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, మరో ముగ్గురు పోటీలో ఉన్నారు. శ్రీకాకుళం బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు, ఓ స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు. కర్నూలు జిల్లా బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఎ.మధుసూదన్, ఇద్దరు స్వతంత్రులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ బరిలో పలువురు అభ్యర్థులు

3 పట్టభద్రుల నియోజకవర్గాలు, 2 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పలువురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో వైఎస్సార్సీపీ మద్దతిస్తున్న సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతిస్తున్న డా.వి.చిరంజీవిరావు, బీజేపీ మద్దతుతో మాధవ్ సహా 37 మంది ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు పట్టభద్రుల స్థానంలో వైఎస్సార్‌సీపీ తరఫున పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ తరఫున కంచర్ల శ్రీకాంత్ చౌదరి సహా 22 మంది పోటీలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున వెన్నపూస రవీంద్రారెడ్డి, టీడీపీ నుంచి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సహా 49 మంది రంగంలో ఉన్నారు.

ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో వైఎస్సార్‌సీపీ మద్దతిస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పీడీఎఫ్ మద్దతుతో పొక్కిరెడ్డి బాబురెడ్డి సహా 8 మంది రంగంలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతిస్తున్న ఎం.వి.రామచంద్రారెడ్డితో పాటు ఒంటేరు శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి సహా 12 మంది బరిలో ఉన్నారు. ఎన్నికలు జరిగే ఎమ్మెల్సీ స్థానాలకు వచ్చే నెల 13న పోలింగ్ జరుగుతుంది. 16న ఓట్లను లెక్కించి, విజేతలను ప్రకటిస్తారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

- అనంతపురం జిల్లా - ఎస్.మంగమ్మ
- వైఎస్సార్ జిల్లా - పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి
- చిత్తూరు జిల్లా - సిపాయి సుబ్రమణ్యం
- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా - మేరుగ మురళీధర్
- తూర్పు గోదావరి జిల్లా - కుడిపూడి సూర్యనారాయణ

ఏడాది బిడ్డకు గుండె మార్పిడి

- చిన్నారికి పునర్జన్మ ప్రసాదించిన శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం
- నెల రోజుల్లో విజయవంతంగా రెండో గుండె మార్పిడి శస్త్ర చికిత్స
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా..


డిశ్చార్జ్ అనంతరం బిడ్డతో జార్ఖండ్‌కు చెందిన పర్వీన్

తిరుపతి (తుడా): ఏడాది బిడ్డకు గుండె మార్పిడి చేసి పునర్జన్మ ప్రసాదించింది తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం (చిన్న పిల్లల గుండె ఆస్పత్రి). గత నెలలో 15 సంవత్సరాల బాలుడికి గుండె మార్పిడి చేసిన ఇక్కడి వైద్యులు నెల రోజుల వ్యవధిలోనే 13 నెలల పసిబిడ్డకు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన 13 నెలల పాప అనారోగ్యం బారిన పడగా.. తల్లిదండ్రులు విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో బిడ్డను చూపించారు. పాపకు గుండె మార్చాల్సి ఉందని, తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. మూడు నెలల క్రితం తల్లిదండ్రులు ఆ పాపను హృదయాలయంలో చేర్చగా.. పాపకు సరిపోయే గుండె కోసం వైద్యులు జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేశారు. అప్పటినుంచి ఆస్పత్రికి తీసుకుని వచ్చి అడ్మిట్ చేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు ఆ బిడ్డకు వైద్యం చేస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు. కాగా, చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో రెండేళ్ల బాలుడికి బ్రెయిన్ డెడ్ అయినట్టు సమాచారం అందటంతో ఏపీ జీవన్‌దాన్ సంస్థ, చిన్నపిల్లల గుండె చికిత్సల నిపుణులు డాక్టర్ గణపతి బృందాన్ని డాక్టర్ శ్రీనాథరెడ్డి సమన్వయం చేయించారు. టీటీడీ సహకారంతో అంబులెన్స్, మరో ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని వైద్య బృందం ఆదివారం రాత్రికే చెన్నై చేరుకుంది. గ్రీన్ చానల్ అవసరం లేకుండా 2గంటల 15 నిమిషాల్లో గుండెను తిరుపతిలోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు గుండె చేరుకోవడంతో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ గణపతి నేతృత్వంలోని బృందం గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది.

ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత శస్త్రచికిత్స

రూ.30 లక్షలు ఖర్చయ్యే గుండె మార్పిడి శస్త్ర చికిత్సను టీటీడీ ప్రాణదానం, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా పూర్తిగా ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారులకు పునర్జన్మ ప్రసాదిస్తున్న వైద్యుల బృందం కృషి అభినందనీయమని కొనియాడారు.

అవయవ దానానికి ముందుకు రావాలి



ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ ద్వారా గుండె, కాలేయం, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. పలువురి ప్రాణాలను కాపాడగలుగుతున్నాం. ప్రతి ఒక్కరూ జీవన్‌దాన్ కింద రిజిస్ట్రేషన్ చేసుకుని అవయవదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్

3 నెలల జార్ఖండ్ చిన్నారికి శస్త్ర చికిత్స

జార్ఖండ్ రాజధాని రాంచీ ప్రాంతానికి చెందిన లుక్సార్ పర్వీన్ (మూడు నెలలు)కు శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో ఇటీవల గుండె చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సోమవారం కోలుకున్న ఆ చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. కుమారుడికి అనారోగ్యంగా ఉండటంతో చిన్నారి తల్లి పర్వీన్ ఇటీవల వేలూరులోని సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఆ బిడ్డకు గుండె శస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించి వైద్యులు తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సల ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఆ పసికందును ఆస్పత్రిలో చేర్చుకున్న పద్మావతి వైద్యులు 15 రోజుల క్రితం గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేశారు. బిడ్డ కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ఉండటంతో టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి సమక్షంలో సోమవారం డిశ్చార్జ్ చేశారు. తన బిడ్డకు పునర్జన్మనిచ్చిన వైద్యులకు జీవితాంతం రుణపడి ఉంటామని పర్వీన్ సంతోషం వ్యక్తం చేశారు. లక్షలతో కూడుకున్న వైద్యాన్ని ప్రధానమంత్రి ఆరోగ్య బీమా కార్డు ద్వారా పూర్తి ఉచితంగా అందించి తన కుటుంబాన్ని నిలబెట్టారని ఆనందం వ్యక్తం చేశారు.

నేడు వైఎస్సార్ రైతు భరోసా సాయం

- తెనాలి మార్కెట్ యార్డులో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పంపిణీ
- ఈ ఏడాది రెండు విడతల్లో 50.92 లక్షల మందికి రూ.5,853.74 కోట్ల లబ్ధి
- మూడో విడత కింద ఇప్పుడు 51.12లక్షల మందికి రూ.1,090.76 కోట్లు జమచేయనున్న సీఎం
- మాండూస్ తుఫాన్ బాధితులు 91,237 మందికి రూ.76.99 కోట్ల పరిహారం కూడా అందజేత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వరుసగా నాలుగో ఏడాది కూడా వైఎస్సార్ రైతుభరోసా అమలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో 50.92 లక్షల మందికి రూ.5,853.74 కోట్ల పెట్టుబడి సాయం అందించగా, మూడో విడతగా 51.12 లక్షల మందికి రూ.1,090.76 కోట్లను సీఎం జగన్ మంగళవారం తెనాలి మార్కెట్‌యార్డులో జరిగే కార్యక్రమంలో నేరుగా వారి ఖాతాల్లోకి జమచేయనున్నారు. గతేడాది డిసెంబర్‌లో విరుచుకుపడిన మాండూస్ తుఫాన్‌తో నష్టపోయిన 91,237 మంది రైతులకు రూ.76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని కూడా జమచేస్తున్నారు.

రూ.27,062.09 కోట్ల పెట్టుబడి సాయం

రైతులకు ఏటా రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల మానిఫెస్టోలో హామీ ఇవ్వగా, అంతకంటే మిన్నగా ఏటా రూ.13,500 చొప్పున అందిస్తున్నారు. వరుసగా నాల్గో ఏడాదిలో కూడా ఇప్పటికే రెండు విడతల్లో రూ.11,500 సాయం అందించారు. మూడో విడతగా ఒక్కొక్కరికి మరో రూ.2వేల చొప్పున 51.12 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.1,090.76 కోట్లను సీఎం జగన్ నేడు జమచేయనున్నారు. ఇలా గత మూడేళ్ల 9 నెలల్లో మొత్తం రూ. 27,062.09 కోట్ల మేర రైతులకు లబ్ధిచేకూర్చారు. ఇక 2022 డిసెంబర్‌లో మాండూస్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన 91,237 మంది వ్యవసాయ, ఉద్యాన రైతన్నలకూ రూ.76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని రబీ సీజన్ ముగియక ముందే వారి ఖాతాల్లో జమచేస్తున్నారు. ఈ మొత్తంతో కలిపి ఇప్పటివరకు 22.22 లక్షల మంది రైతన్నలకు రూ.1,911.78 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. ఇలా గడిచిన మూడేళ్ల తొమ్మిది నెలల్లో రైతులకు మొత్తం మీద నేరుగా రూ.1,45,751 కోట్ల లబ్ధిని చేకూర్చారు.

నేడు తెనాలికి సీఎం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (మంగళవారం) గుంటూరు జిల్లా తెనాలిలో పర్యటించనున్నారు. నాలుగో ఏడాది మూడోవిడత వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్.. ఇటీవల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఉ.9.50 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి, 10.15 గంటలకు తెనాలి చేరుకుంటారు. 10.35కు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలోని బహిరంగసభ వేదికకు చేరుకుని రైతుభరోసాతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. అనంతరం.. సీఎం మ.12.45కు అక్కడ నుంచి బయల్దేరి మ.1.10కు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.


క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చర్చిల ఆస్తులను కాపాడుతాం

- క్రైస్తవ సంఘాలకు సీఎం హామీ

సాక్షి, అమరావతి: చర్చిలు, వాటి ఆస్తుల రక్షణకు తగిన చర్యలు తీసుకునేలా కార్యాచరణ చేపడతామని క్రైస్తవ సంఘాల ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. జిల్లా స్థాయిలో ఎస్పీలు, కలెక్టర్లు సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో సీఎం జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. బిషప్‌లు, రెవరెండ్‌లు, ఇతర క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ తరఫున హాజరైన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు చర్చిల ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్న విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తెచ్చారు. చారిటీ సంస్థలు నిర్వహించేవారికి స్థానిక పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలని క్రైస్తవ సంఘాలు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశాయి. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు విన్నవించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి జగన్ సానుకూలంగా స్పందించారు. ఇకపై క్రిస్టియన్ సమాజం, సంఘాల ప్రతినిధుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించేందుకు ఒక సలహాదారును నియమిస్తామని, తద్వారా సమస్యలను సులభంగా పరిష్కరించే వెసులుబాటు ఉంటుందన్నారు. క్రిస్టియన్లకు స్మశాన వాటికల ఏర్పాటుపై సానుకూలంగా స్పందించారు.

ఆరోగ్య సిరులు

▶ మొదటి పేజీ తరువాయి

పెంచడంపై దృష్టి సారించినట్లు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. చిరుధాన్యాల ఉత్పత్తి, డిమాండ్‌ను పెంచేందుకు రాష్ట్రాలకు సహకారం అందిస్తున్నట్లు తెలిపింది. దేశంలో 170.67 లక్షల టన్నుల చిరుధాన్యాల ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో 4.64 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచంలో అత్యధికంగా భారతదేశంలోనే 41% చిరుధాన్యాలు పండిస్తున్నారు.

దేశవ్యాప్తంగా చిరు ధాన్యాల వేడుకలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం అంతా చిరుధాన్యాల వేడుకలను నిర్వహిస్తున్నాయి. 2023–24లో దేశాన్ని చిరుధాన్యాలకు గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించాయి. మిల్లెట్స్ ఉత్పత్తి, డిమాండ్ పెంచేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఉత్పాదకతను పెంచడం, వినియోగం, ఎగుమతి, విలువను బలోపేతం చేయడం, బ్రాండింగ్, సృష్టించడం వంటి వాటిపై దృష్టి పెట్టాయి. వీటి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెలవారీ కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాయి. చిరుధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన సాంకేతికత, మెరుగైన వ్యవసాయ పనిముట్లు, వనరులు, సీడ్ హబ్‌ల ఏర్పాటు విషయంలో కేంద్రం రాష్ట్రాలకు సహకారం అందిస్తోంది. 2023–24 సంవత్సరమంతా కేంద్ర మంత్రిత్వ శాఖలు చిరుధాన్యాలతో కూడిన తినుబండారాలనే అందించనున్నాయి. విమానాలు, రైళ్లలో చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించనున్నారు. అన్ని బహిరంగ ప్రదేశాల్లో మిల్లెట్ వెండింగ్ మెషీన్లు ఏర్పాటు చేస్తారు. డిఫెన్స్ ఫుడ్ అండ్ రీసెర్చ్ ల్యాబ్, పోలీస్ ఫోర్స్ క్యాంటీన్లలోనూ చిరుధాన్యాల ఆహారాన్ని అందించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉత్పత్తిని, వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా మిల్లెట్ మిషన్ ఏర్పాటు చేసింది. చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. పోషకాహార లోపం నివారణకు చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకోవడంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తోంది. జగనన్న గోరుముద్దలో భాగంగా పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి మార్చి 2 నుంచి రాగి జావ ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాదంతా చిరుధాన్యాల వేడుకలను నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది.

పెట్టుబడులకు రాచబాట

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం 15 సెమినార్లను నిర్వహించనుంది. ఇందుకోసం ప్రధాన సమావేశ మందిరానికి అదనంగా మరో మూడు సెమినార్ హాల్స్‌ను సిద్ధం చేశారు.

విశాఖకు కార్పొరేట్ దిగ్గజాలు

వాస్తవ పెట్టుబడులే లక్ష్యంగా నిర్వహిస్తున్న జీఐఎస్ 2023లో పాల్గొనేందుకు దేశ విదేశాలకు చెందిన కార్పొరేట్ దిగ్గజ సంస్థలు విశాఖకు తరలి వస్తున్నాయి. రిలయన్స్ గ్రూపునకు చెందిన ముఖేష్ అంబానీ, అదానీ గ్రూపు గౌతమ్ అదానీ, అర్సెల్ మిట్టల్ గ్రూపు సీఈవో ఆదిత్య మిట్టల్, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా, టెస్లా కోఫౌండర్ మార్టిన్ ఎంబరహర్డ్ లాంటి 22 మందికిపైగా కార్పొరేట్ ప్రముఖులు ప్రారంభ సమావేశంలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు. మార్చి 3వ తేదీన తొలి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జీఐఎస్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి, ఆర్కే సింగ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన కేంద్ర కార్యదర్శులు ఇందులో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సెమినార్లు నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. సెమినార్లు జరుగుతున్న సమయంలోనే ప్రధాన సమావేశ మందిరంలో ఆహార వ్యవస్థలో మారుతున్న పరిణామ క్రమాలపై ప్రత్యేక చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం అతిథుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం విందు ఇవ్వనుంది.



సీఎం సమక్షంలో ఒప్పందాలు..

సమ్మిట్ రెండో రోజు మార్చి 4న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.20 వరకు సెమినార్లు జరుగుతాయి. అనంతరం ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పెట్టుబడుల ఒప్పందాల అనంతరం ముగింపు సమావేశం జరగనుంది. ముగింపు సమావేశంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, వెల్‌స్పన్ గ్రూపు ఎండీ రాజేష్ మండవేవాలా, దివీస్ ల్యాబ్ సీవోవో కిరణ్ దివీ, లారస్ ల్యాబ్ ఫౌండర్ సీఈవో చావా సత్యనారాయణతోపాటు మొత్తం 10 మంది కార్పొరేట్ ప్రముఖులు పాల్గొంటారు. కేంద్ర మంత్రులు సర్బానంద్ సోనావాలా, రాజీవ్ చంద్రశేఖరన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు హాజరవుతారు. ముగింపు సమావేశానికి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు.

విశాఖ సదస్సుపై సీఎం సమీక్ష



సాక్షి, అమరావతి: విశాఖలోని ఏయూ గ్రౌండ్స్‌లో మార్చి 3, 4వ తేదీల్లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్షించారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు పలువురు కేంద్ర మంత్రులతోపాటు ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరు కానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పారిశ్రామిక రంగంలో ఉన్న అపార అవకాశాలు, రాష్ట్రంలో ఉన్న సానుకూలతలను ఈ సదస్సు వేదికగా వివరించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. తొలి రోజు మార్చి 3న అల్పాహారం అనంతరం ఉదయం 10 గంటల సమయంలో సదస్సు ప్రారంభం కానుంది. సదస్సు సందర్భంగా పెట్టుబడులకు సంబంధించి పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు తుది షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేయనున్నారు. సీఎం సమీక్షలో పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, సమాచారశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగాల వారీగా సెమినార్లు, వక్తల వివరాలు

మార్చి 3వ తేదీ

మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.50 వరకు

- **అంశం:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
మోడరేటర్: సౌరభ్‌గౌర్, రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి
వక్తలు: డాక్టర్ సత్యనారాయణ డైరెక్టర్ ఐఐటీ తిరుపతి, రవి తంగిరాల మాస్ మ్యూచువల్ హెడ్, ప్రొఫెసర్ కోన్ ముజాకిస్ డైకిన్ యూనివర్సిటీ కోఫౌండర్, శ్రీధర్ కోసరాజు ఐటాప్ ప్రెసిడెంట్, లక్స్‌రావు చేపూరి సీఈవో టెక్నోజెన్, విజయ్ భాస్కర్ రెడ్డి టెక్‌బుల్ డైరెక్టర్

- **అంశం:** ఆటోమొబైల్– ఎలక్ట్రిక్ వాహనాలు
మోడరేటర్: పీఎస్ ప్రద్యుమ్న, రాష్ట్ర రవాణా శాఖ కార్యదర్శి
వక్తలు: మార్టిన్ ఎంబర్‌హార్డ్ టెస్లా కోఫౌండర్, కేవీ ప్రదీప్ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ, రాజేష్ మిట్టల్ ఇసుజు ఇండియా ప్రెసిడెంట్, కబ్‌దాంగ్‌లీ కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, శశాంక్ శ్రీవాత్సవ మారుతీ సుజుకీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కమల్ బాలి వోల్వో గ్రూపు ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్.

- **అంశం:** రెన్యువబుల్ ఎనర్జీ
మోడరేటర్: రమణారెడ్డి, నెడ్‌క్యాప్ ఎండీ
వక్తలు: గురుదీప్‌సింగ్ ఎన్‌టీపీసీ సీఎండీ, అనిల్ చలమలశెట్టి గ్రీన్‌కో సీఈవో, నవాల్ సైని బ్రూక్‌ఫీల్డ్ ఎండీ, సుబ్రమణ్యం పులిపాక నేషనల్ సోలార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో, డేవిడ్ ఏ కొల్లార్డ్ స్కేల్ ఫెసిలిటేషన్ మేనేజింగ్ పార్టనర్–సీఈవో, విపుల్ తులి సెంబ్‌కార్ప్ సౌత్ ఏషియా సీఈవో, విశ్వేశ్వర రెడ్డి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ ఎండీ.

సాయంత్రం 4 నుంచి 4.50 వరకు

- **అంశం:** ఇండస్ట్రియల్ లాజిస్టిక్ – ఇన్‌ఫ్రా
మోడరేటర్: రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో ఏపీ మారిటైమ్ బోర్డు
వక్తలు: సుమిత్ దావ్రా డీపీఐఐటీ ప్రత్యేక కార్యదర్శి(లాజిస్టిక్స్), జీబీఎస్ రాజు చైర్మన్ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, రవి సన్నారెడ్డి చైర్మన్ శ్రీసిటీ, రవికాంత్ యమర్తి లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, సుకుమార్ కామేశ్వరన్ సీవోవో టీవీఎస్ సప్లైచైన్ సొల్యూషన్స్, అనయ్ శుక్లా సీసీవో వెల్‌స్పన్ వన్ లాజిస్టిక్స్.

- **అంశం:** స్టార్టప్స్ అండ్ ఇన్నోవేషన్
మోడరేటర్: సౌరభ్ గౌర్, కార్యదర్శి రాష్ట్ర ఐటీ శాఖ
వక్తలు: బీవీ నాయుడు, కర్నాటక డిజిటల్ ఎకానమీ మిషన్ చైర్మన్, విజయ్ శేఖర్ శర్మ, పేటీఎం ఫౌండర్ చైర్మన్, శ్వేత రాజ్‌పాల్ కోహ్లి సీక్వోయా క్యాపిటల్ చీఫ్ పబ్లిక్ పాలసీ ఆఫీసర్, పడాల భూదేవి సవర వుమెన్ సామాజిక కార్యకర్త, రాజా శ్రీనివాస్ ఆర్ఎస్ఐటీ సొల్యూషన్స్ ఫౌండర్ సీఈవో, అంకిత్ అగర్వాల్ ఫూల్ కంపెనీ ఫౌండర్ సీఈవో, హర్షిల్ మాథూర్ రజోర్‌పే సీఈవో–కోఫౌండర్.


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం విశాఖలోని ఏయూ మైదానంలో వేదికను నిర్మిస్తున్న దృశ్యం

- **అంశం:** హెల్త్‌కేర్ అండ్ మెడికల్ ఎక్విప్‌మెంట్
మోడరేటర్: టి.కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి, వైద్యశాఖ
వక్తలు: దిలీప్ జోష్ మణిపాల్ హాస్పిటల్ గ్రూపుసీఈవో, డాక్టర్ గురునాథ్ రెడ్డి కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ అండ్ ఎండీ, డాక్టర్ ముఖేష్ త్రిపాఠి ఎయిమ్స్ మంగళగిరి డైరెక్టర్, విభవ్ గార్గ్ బోస్టన్ సైంటిఫిక్ డైరెక్టర్, ఆనంద్ కే ఎస్ఆర్ఎల్ డయాగ్నస్టిక్స్ సీఈవో, డాక్టర్ జితేంద్ర శర్మ ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ సీఈవో

సాయంత్రం 5 నుంచి 5.50 వరకు

- **అంశం:** ఎలక్ట్రానిక్స్
మోడరేటర్ : సౌరభ్ గౌర్, కార్యదర్శి ఏపీ ఐటీ ఎలక్ట్రానిక్ శాఖ
వక్తలు: జోష్ ఫల్గర్ భారత్ ఎఫ్ఐహెచ్ కంట్రీ హెడ్– ఎండీ, శశికుమార్ జి సాల్‌కామ్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా ఎండీ, దాసరి రామకృష్ణ ఎఫ్‌ట్రానిక్స్ ఎండీ, ప్రొఫెసర్ జాక్ సింగ్ చీఫ్ సైంటిస్ట్ గవర్నమెంట్ ఆఫ్ సారస్వక్, దేవిదాస్ కస్‌బేకర్ బ్లూస్టార్ క్లైమెటిక్ సీఈవో.

- **అంశం:** అగ్రి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్
మోడరేటర్: చిరంజీవి చౌదరి కార్యదర్శి ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్
వక్తలు: మనోజ్ అహుజా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, సతోషి ససకి ఐఎల్‌వో సౌత్ ఏషియా డిప్యూటీ డైరెక్టర్, జే రాజన్ అముల్ సౌత్ ఇండియా జోనల్‌హెడ్, పి.వెంకటరావు బ్లూస్టార్ ప్రెసిడెంట్ సీవోవో, హెన్రిక్ స్టమ్ క్రిస్టెన్సన్ బ్లెండ్ హబ్ కార్ప్ ఫౌండర్, బలరామ్ సింగ్ యాదవ్ గోద్రేజ్ ఆగ్రోవెట్ ఎండీ.

మార్చి 4వ తేదీ..

ఉదయం 10.30 నుంచి 11.20 వరకు

- **అంశం:** పెట్రో అండ్ పెట్రో కెమికల్స్
మోడరేటర్: ప్రకాష్ గౌర్ సీఈవో ఎన్‌హెచ్ఎల్ఎంఎల్
వక్తలు: అరుణ్ బరోకా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, జనార్ధన్ రామానుజులు ఎస్ఏబీఐసీ వైస్ ప్రెసిడెంట్, ఏవీ సహానే ఐవోసీఎల్ ఈడీ, డీవీఎస్ నారాయణ రాజు డెక్కన్ ఫైన్ కెమికల్స్

- **అంశం:** ఉన్నత విద్య
మోడరేటర్: హేమచంద్రారెడ్డి, చైర్మన్, ఏపీఎస్‌సీహెచ్ఈ.
వక్తలు: ప్రొఫెసర్ యూబీ దేశాయ్ ఐఐటీ హైదరాబాద్ ఫౌండింగ్ డైరెక్టర్, డాక్టర్ జీ విశ్వనాథన్ విట్ యూనివర్సిటీ చాన్సలర్, పద్మశ్రీ ఎన్ బాలకృష్ణన్ ఐఐఎస్‌సీ బెంగళూరు ఏరో డైనమిక్స్ ప్రొఫెసర్, డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ సీవోవో ఏఐసీటీఈ, ఎం చంద్ర శేఖర్ ఐఐఎం విశాఖ డైరెక్టర్, ప్రొఫెసర్ జంధ్యాల బీజీ తిలక్ కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్

- **అంశం:** టెక్స్‌టైల్ అండ్ అప్పరెల్
మోడరేటర్ : ఆర్‌సీఎం రెడ్డి ఎండీ సీఈవో స్కూల్‌నెట్ ఇండియా
వక్తలు: యూపీ సింగ్ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, రాజేష్ మండవేవాలా వెల్‌స్పన్ గ్రూపు ఎండీ, నారెన్ గోయంకా టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్, సుచిరా సురేంద్రనాథ్ బ్రాండిక్స్ డైరెక్టర్, ప్రశాంత్ అగర్వాల్ వైజర్ అడ్వైజర్స్ కో–ఫౌండర్, సచిన్ మాలిక్ ఏషియా పసిఫిక్ రేయాన్ గ్లోబల్ సేల్స్ హెడ్.

ఉదయం 11.30 నుంచి 12.20 వరకు

- **అంశం:** స్కిల్ డెవలప్‌మెంట్
మోడరేటర్: సౌరభ్‌గౌర్, కార్యదర్శి ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్
వక్తలు: రాజీవ్ చంద్రశేఖరన్ కేంద్ర సహాయమంత్రి, అతుల్ తివారీ కేంద్రకార్యదర్శి ఎంఎస్‌డీఈ, అనితా రాజన్ టాటా స్ట్రైవ్ సీఈవో, సంజయ్ విశ్వనాథన్ ఈడీ4ఆల్ కోఫౌండర్, సునిల్ దహియా వాద్వాని ఫౌండేషన్ ఈవీపీ, సంజయ్ అవస్థి యునెస్కో హెడ్, కీర్తి సేత్ నాస్కాం ఫ్యూచర్ స్కిల్ సీఈవో

- **అంశం:** పర్యాటకం
మోడరేటర్: రజత్ భార్గవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యాటక శాఖ
వక్తలు: సుభాష్ గోయల్ ఎస్‌టీఐసీ ట్రావెల్స్ చైర్మన్, సంజయ్ సేథి చాలెట్ గ్రూపు సీఈవో ఎండీ, అనిల్ చద్దా ఐటీసీ హోటల్స్ సీఈవో, దినేష్ చద్దా తాజ్‌గ్రూపు సీనియర్ వైస్‌ప్రెసిడెంట్, సంజయ్ రాజ్ ఎండీ,సరోవర్ గ్రూపు, పూజా రే మైఫేర్ ఎండీ, ఆర్ శ్రీనివాస్ ఎక్స్ డెలాయిట్ గ్లోబల్ హెడ్(టూరిజం)

- **అంశం:** ఫార్మా లైఫ్ సైన్సెస్
మోడరేటర్: నివాస్, కమిషనర్ వైద్య ఆరోగ్య శాఖ
వక్తలు: సతీష్‌రెడ్డి డాక్టర్ రెడ్డీస్ చైర్మన్, సత్యనారాయణ చావా లారస్ ల్యాబ్ ఫౌండర్ సీఈవో, ఎంఎస్‌రావు మైలాన్ ల్యాబ్ కంట్రీ హెడ్, విక్రం శుక్లా ఫైజర్ వైస్ ప్రెసిడెంట్, అజుమా ఫుజిమురా ఈసాయి ఫార్మాస్యూటికల్స్ అడ్మినిస్ట్రేషన్ హెడ్

క్లుప్తంగా...

స్పెషల్ పేపై ఉన్నతాధికారుల కమిటీ నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల స్పెషల్ పే అంశాన్ని పరిశీలించి అవసరమైన సిఫార్సులు చేసేందుకు ప్రభుత్వం ఉన్నతాధికారుల కమిటీని నియమించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి సోమవారం జీవో జారీ చేశారు. ఆర్థిక శాఖ (హెచ్ఆర్) ముఖ్య కార్యదర్శి కన్వీనర్‌గా, వైద్య-ఆరోగ్య, వ్యవసాయం, హోం, పాఠశాల విద్యా శాఖల ముఖ్య కార్యదర్శులు, జీఏడీ (హెచ్ఆర్, సర్వీసెస్) కార్యదర్శిని సభ్యులుగా ఈ కమిటీలో నియమించారు. స్పెషల్ పే అంశంతో పాటు దానికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న మార్గదర్శకాలను పరిశీలించి కమిటీ ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని జీవోలో పేర్కొన్నారు.

మార్చి 28న సుప్రీంకోర్టులో అమరావతి కేసు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిపై ఏపీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మార్చి 28న విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశాన్ని ఈ నెల 23న సుప్రీంకోర్టు విచారించాల్సి ఉంది. అయితే, తాజా సర్క్యులర్ ప్రకారం బుధ, గురువారాల్లో ఒకసారి నోటీసు అయిన కేసులను సుప్రీంకోర్టు విచారణ చేయడం లేదు. దీంతో ఈ నెల 23 జాబితాలో అమరావతి కేసును చేర్చలేదు. సోమవారం ఏపీ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి ఈ పిటిషన్‌ను త్వరగా విచారించాలని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించడంతో మార్చి 28వ తేదీని నిర్ణయిస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

చేనేతల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



దుబాయ్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: ఎన్నడూ లేని విధంగా చేనేత వర్గాల అభ్యున్నతి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. గ్లోబల్ పద్మశాలీయ సమ్మిట్‌లో భాగంగా దుబాయ్ వేదికగా జరిగిన గ్లోబల్ పద్మశాలీయ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశంలో సోమవారం పాల్గొని ప్రసంగించినట్లు చెప్పారు. రాజకీయ రంగంలో చేనేత వర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పించారని, ఒక్క చేనేత సామాజిక వర్గానికే నాలుగు ప్రత్యేక కార్పొరేషన్లను నియమించడం చేనేత వర్గాలపై సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

ఆరు మృతదేహాలు వెలికితీత

తోడేరులో చెరువు వద్దే పోస్టుమార్టం

పొదలకూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరులో చెరువులో షికారుకెళ్లి గల్లంతైన ఆరుగురు మృతిచెందారు. వారి మృతదేహాలను సోమవారం వెలికితీశారు. గ్రామానికి చెందిన పదిమంది యువకులు ఆదివారం సమీపంలోని కొత్త చెరువులో సరదాగా గడిపేందుకు నాటుపడవలో వెళ్లిన విషయం తెలిసిందే. పడవ తిరగబడడంతో ఆరుగురు గల్లంతుకావడం, ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ.కిరణ్ ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడడం విదితమే. గల్లంతైన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అట్లా శ్రీనాథ్ (16), మన్నూరు కల్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాటి సురేంద్ర (16)ల కోసం ఆదివారం రాత్రి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు గాలించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకశాఖల అధికారులు అక్కడే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. సోమవారం ఉదయం 11 గంటలకల్లా కల్యాణ్, శ్రీనాథ్, ప్రశాంత్‌కుమార్, బాలాజీ, రఘు మృతదేహాలను వెలికితీశారు. సాయంత్రం 5 గంటల సమయంలో సురేంద్ర మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతదేహాలకు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చైనానే లొంగదీసుకున్న బీజేపీకి వీళ్లంతా ఒక లెక్కా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



తిరుపతి గాంధీ రోడ్డు: చైనానే లొంగదీసుకున్న బీజేపీకి ఈ రాష్ట్రంలోని కుటుంబ రాజకీయాలు, బ్లాక్ మెయిల్ చేసే పార్టీలు ఒక లెక్కా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు అన్నారు. సోమవారం తిరుపతి బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన విధంగానే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి రాజకీయాలను చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికే జనసేన మద్దతు ఉందన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమకు వచ్చే నీళ్లు రాకుండా ఆగబోవన్నారు. కాగా, బీజేపీ కార్యాలయం నుంచి వెళుతున్న సోము వీర్రాజును ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. లిక్కర్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాపై అక్రమంగా కేసు పెట్టి అరెస్టు చేశారని ఆరోపిస్తూ ఆయన కారుకు అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు.

ఆడబిడ్డల ఆంధ్రప్రదేశ్



దేశంలోనే రెండో స్థానంలో రాష్ట్రం

ఏపీలో పెరుగుతున్న ఆడపిల్లల సంఖ్య		2021-22 లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక వెల్లడి
	రాష్ట్రంలో 2021-22లో ప్రతి 1,000 మంది అబ్బాయిలకు.. అమ్మాయిలు 1,046 మంది	
	దేశంలో 2021-22లో ప్రతి 1,000 మంది అబ్బాయిలకు.. అమ్మాయిలు 968 మంది	

2021-22లో దేశంలో ప్రతి 1,000 మంది అబ్బాయిలకు అమ్మాయిలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు

రాష్ట్రం	లింగ నిష్పత్తి
కేరళ	1,114
ఆంధ్రప్రదేశ్	1,046
హిమాచల్‌ప్రదేశ్	1,031
తమిళనాడు	1,026
మేఘాలయ	1,017
ఛత్తీస్‌గఢ్	1,016
జార్ఖండ్	1,001



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అబ్బాయిలను మించి ఆడపిల్లల సంఖ్య పెరిగిపోతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా అబ్బాయిలు కన్నా అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారు. 2021-22 లేబర్ ఫోర్స్ సర్వేను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. దాని ప్రకారం.. దేశంలో అత్యధికంగా అమ్మాయిలున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. కేంద్ర పాలిత ప్రాంతాల్లో పుదుచ్చేరి మొదటి స్థానంలో ఉంది. జూలై 2021 నుంచి జూన్ 2022 మధ్య సర్వే నిర్వహించినట్టు నివేదిక పేర్కొంది. దేశం మొత్తం మీద చూస్తే.. 8 రాష్ట్రాల్లోనే అబ్బాయిల కన్నా అమ్మాయిల సంఖ్య ఎక్కువగా ఉంది. మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమ్మాయిలు కన్నా అబ్బాయిల సంఖ్యే ఎక్కువ. జాతీయ స్థాయిలో కూడా అబ్బాయిల సంఖ్యే ఎక్కువగా ఉంది. 2019-20లో జాతీయ స్థాయిలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 963 మంది అమ్మాయిలుండగా, 2021-22 నాటికి ఆ సంఖ్య 968కు పెరిగింది. అలాగే రాష్ట్రంలో 2019-20లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,021 మంది అమ్మాయిలుండగా, 2021-22 నాటికి ఆ సంఖ్య 1,046కు పెరిగింది.

గ్రామాల్లోకన్నా పట్టణాల్లోనే ఎక్కువ

2021-22లో రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,038 మంది అమ్మాయిలుండగా.. పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,063 మంది అమ్మాయిలున్నారు. అలాగే 2019-20లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,007 మంది అమ్మాయిలుండగా.. పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,051 మంది అమ్మాయిలున్నారు. అంటే గ్రామీణ ప్రాంతాల కన్నా పట్టణ ప్రాంతాల్లోనే అమ్మాయిల సంఖ్య అత్యధికంగా ఉంటోందని స్పష్టమవుతోంది. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు చాలనే ధోరణి నుంచి క్రమంగా మగైనా ఆడైనా ఒకరే చాలనే వరకూ వచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆడపిల్లల సంఖ్య పెరుగుతూ వస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

అక్కడ అబ్బాయిలే అధికం



రాష్ట్రంలో మొత్తం 1,41,28,100 కుటుంబాలుండగా.. వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో 96,72,100, పట్టణ ప్రాంతాల్లో 44,56,000 కుటుంబాలున్నట్టు నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో సగటు కుటుంబ పరిమాణం 3.3గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 3.4గా ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 3.2గా ఉందని నివేదిక తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతం దాద్రా నగర్-హవేలీ-డామన్-డయ్యూలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిలు కేవలం 742 మందే ఉన్నారు. ఆ తర్వాత చండీగఢ్‌లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 879 మంది, హరియాణాలో 887 మంది, ఢిల్లీలో 891 మంది అమ్మాయిలున్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- విజయవాడలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- 26 జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు
- 5 అంశాల్లో 260 ప్రాజెక్టుల ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గుణదల(విజయవాడ తూర్పు): విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఆంధ్ర లయోల కళాశాలలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌కు తరలివచ్చారు. పర్యావరణ పరిరక్షణ, రోడ్డు భద్రత, అంతరిక్ష విజ్ఞానం, కాలుష్య నియంత్రణ, కంప్యూటర్ పరిజ్ఞానం అంశాల్లో 260 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి బొత్స సత్యనారాయణ... విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు భరోసా కల్పిస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు హుందాగా ఉండేలా జగనన్న విద్యా కానుక పథకం ద్వారా నాణ్యమైన యూనిఫాం, బూట్లు, పుస్తకాలతో కూడిన కిట్లను అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యారంగంలో దేశ రాజధాని ఢిల్లీ కంటే ఎక్కువగా మన రాష్ట్రంలో సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ మంగళవారం కూడా కొనసాగనుంది. విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆస్పత్రులపై నిరంతర పర్యవేక్షణ

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. సోమవారం మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ పథకంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో 1,059 ప్రొసీజర్లకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తిస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా 3,255 ప్రొసీజర్లకు పెంచిందని చెప్పారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 202 ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ ద్వారా ఏపీ ప్రజలకు ఉచిత వైద్యం అందజేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఆరోగ్య ఆసరా ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇప్పటివరకు 15,75,624 మంది లబ్ధిదారులకు ఆరోగ్య ఆసరా కింద రూ.978.01 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఆరోగ్య శ్రీ కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలోనే రూ.7,186 కోట్లను ఖర్చు చేసిందని.. ఈ ఏడాది మరో రూ.3 వేల కోట్ల వరకు ఖర్చు చేయబోతున్నామని తెలిపారు. ఐదేళ్లలో ప్రజలకు ఉచిత వైద్య సేవల కోసం రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పెద్ద పెద్ద బీమా కంపెనీల్లో ఎలాంటి ఆడిటింగ్ విధానాలు అమలవుతున్నాయో పరిశీలించి.. వాటిలో మంచి విధానాలను ఆరోగ్యశ్రీ పథకానికి అన్వయించాలని మంత్రి రజిని సూచించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా.. పూర్తి జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా అందుతున్న వైద్యం విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. 108 కోసం కాల్ చేసిన వారికి.. వాహనం ఎక్కడ ఉందో తెలిపే రూట్ మ్యాప్‌కు చెందిన లింక్ వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ట్రయల్ రన్ అమలవుతోందన్నారు. రోజుకు సగటున 108 వాహనాల ద్వారా 3,096 అత్యవసర కేసులకు సేవలందిస్తున్నామన్నారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ప్రత్యేకాధికారి డాక్టర్ అశోక్‌బాబు పాల్గొన్నారు.

టీబీ రోగులను నిరంతరం పర్యవేక్షించండి

వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కిందిస్థాయి ఉద్యోగులను వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన రాష్ట్రస్థాయి టీబీ ఫోరం, టీబీ ప్రివెంటివ్ థెరపీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహారం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే కాన్ఫరెన్స్‌లలో క్రెడిట్ అవర్స్ ఇచ్చేలా టీబీ గురించి కనీసం ఒక అంశాన్ని పెట్టేందుకు ఉత్తర్వులిస్తామని చెప్పారు. కృష్ణాజిల్లాకు చెందిన ముగ్గురు, గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు టీబీ విజేతలు తమ అనుభవాలను వివరిస్తూ తమకు ప్రభుత్వం అందించిన సహకారాన్ని కొనియాడారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, డీఎంఈ డాక్టర్ వినోద్, డీహెచ్ డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసమే పోక్సో కోర్టు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా
- కర్నూలులో పోక్సో కోర్టును వర్చువల్‌గా ప్రారంభించిన సీజే



జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

కర్నూలు (లీగల్): బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కర్నూలులో పోక్సో కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా చెప్పారు. కర్నూలులో ఏర్పాటుచేసిన పోక్సో కోర్టును ఆయన సోమవారం అమరావతి నుంచి జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డితో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో కోర్టు ఏర్పాటుతో కేసుల విచారణ వేగవంతమవుతుందని చెప్పారు. జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కర్నూలులో పోక్సో కోర్టు ప్రారంభం కావడం శుభపరిణామమన్నారు. జిల్లా ప్రధాన జడ్జి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు నమోదైన 265కి పైగా పోక్సో కేసులను ప్రత్యేక కోర్టులో విచారణ చేయనున్నట్లు తెలిపారు. పోక్సో కోర్టు న్యాయాధికారి జి.భూపాల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్.కృష్ణ మాట్లాడారు. అదనపు జిల్లా జడ్జీలు ఎ.శ్రీనివాసకుమార్, ప్రతిభాదేవి, పాండురంగారెడ్డి, సునీత, ఎం.వెంకటరమణ, సీనియర్ సివిల్ జడ్జీలు టి.కేశవ్, నాగశ్రీనివాసరావు, దివాకర్, జూనియర్ సివిల్ జడ్జీలు షర్మిల, జ్యోత్స్నాదేవి, కె.భార్గవి, వందన, కళ్యాణి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు, డీఎస్పీ కేవీ మహేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇసుక మేటల్లో ఖనిజాన్వేషణ!

- విశాఖలో ఎన్ఐవో బలోపేతం
- 'సాక్షి'తో ఎన్ఐవో డైరెక్టర్ సునీల్‌కుమార్‌సింగ్



సాక్షి, విశాఖపట్నం: సముద్రతీర ప్రాంతంలో కొన్నిచోట్ల ఏళ్ల తరబడి కొండలు, గుట్టలు మాదిరిగా పేరుకుపోయిన ఇసుక మేటల్లో విలువైన ఖనిజాల కోసం అన్వేషణ సాగిస్తున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషినోగ్రఫీ (ఎన్ఐవో-గోవా) డైరెక్టర్ సునీల్‌కుమార్‌సింగ్ చెప్పారు. ఇది సత్ఫలితాలు ఇస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. 'సముద్ర జలాలపై పరిశ్రమలు, మానవాళి ప్రభావం' అనే అంశంపై విశాఖలో ఎన్ఐవో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. తూర్పు తీరంలో చమురు, సహజ వాయువుల నిల్వలు, నిక్షేపాలు అధికంగా ఉన్నాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవలసిన అవసరం ఉందన్నారు. కేజీ బేసిన్‌లో సముద్రం అడుగున ఉన్న ల్యాండ్‌స్లైడ్స్‌లో కదలికలున్నట్టు గుర్తించామన్నారు. దాదాపు 20 ఏళ్లుగా దీనిపై దీర్ఘకాలిక డేటా సేకరిస్తున్నామని వెల్లడించారు.

సిబ్బందిని రెట్టింపు చేస్తాం

విశాఖలో ఎన్ఐవోను బలోపేతం చేస్తున్నామని సునీల్‌కుమార్ తెలిపారు. విశాఖ సాగర తీరంలో ఎన్ఐవోకు సొంత భవనాల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఈ బాధ్యతను బీఎస్ఎన్ఎల్ ఇన్‌ఫ్రా విభాగానికి అప్పగించామన్నారు. సకాలంలో నిర్మాణం జరగకపోవడం వల్ల అంచనా వ్యయం మూడు రెట్లు పెరిగిందని చెప్పారు. దీంతో మరో సంస్థకు నిర్మాణ బాధ్యతల్ని అప్పగిస్తున్నామన్నారు. ప్రస్తుతం విశాఖ ఎన్ఐవోలో ఏడుగురు శాస్త్రవేత్తలు, మరో 70 మందికి పైగా సిబ్బంది ఉన్నారన్నారు. కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే సిబ్బంది సంఖ్యను రెట్టింపు చేస్తామని ఆయన తెలిపారు.

- సింహాద్రి ఎన్టీపీసీలో మూడో యూనిట్‌లో సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని మరమ్మతుల అనంతరం సోమవారం తెల్లవారుజామున పునరుద్ధరించారు. ఈ నెల 24న మూడో యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం పడడంతో 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయి.



"సుఖకరమైన వివాహానికి కావాల్సింది నువ్వు ఎంత అనుకూలంగా ఉన్నావన్నది కాదు, ఆ ప్రతికూలతతో నువ్వు ఎలా వ్యవహరిస్తున్నావన్నది.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి, 28

కూడదీసుకొనే ప్రయత్నం

ఆటలో గెలవాలంటే ప్రత్యర్థి బలం తెలియాలి. అంతకన్నా ముందు మన బలహీనత తెలియాలి. ఈ తత్త్వం గ్రాండ్ ఓల్డ్ పార్టీ ఆఫ్ ఇండియాకు క్రమంగా తలకెక్కుతున్నట్టుంది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ ఫిబ్రవరి 24 నుంచి 3 రోజుల కాంగ్రెస్ 85వ ప్లీనరీని చూశాక ఈ అభిప్రాయమే కలుగుతుంది. ప్రతిపక్షంగా బలంగా నిలబడాలనీ, పాలకపక్షంతో కలబడాలనీ ప్లీనరీ సాక్షిగా కాంగ్రెస్ కసరత్తు చేయడం సంతోషమే. కానీ గతం నుంచి ఏం నేర్చుకుంది? ఎంత మారింది? ఇతర ప్రతిపక్షాల్ని కలుపుకొనిపోవడానికి ఏం చేస్తోందన్నది కీలకం. అందుకే, బీజేపీని ఢీ కొనడానికి భావసారూప్య పక్షాలతో పొత్తులకు సిద్ధమంటూనే, ప్రతిపక్షాలు చీలి మూడో కూటమి కడితే బీజేపీ సారథ్య ఎన్డీఏకే లాభిస్తుందని హస్తం పార్టీ బాహాటంగా ఒప్పుకోవడం గమనార్హం. బీజేపీ వివిధ సామాజిక వర్గాల్లో విస్తరిస్తున్న వేళ దీటుగా కొత్త సామాజిక న్యాయ అజెండాతో ముందుకొచ్చింది.

ఈ ప్లీనరీలో వ్యవస్థాపరమైన సంస్కరణలు, ఎన్నికల పొత్తులు, ఉత్తరాదిన పార్టీ భవితవ్యం మెరుగుదలకు చర్యలు వగైరా చర్చిస్తారని ఆది నుంచి అందరూ భావించారు. ఆ మాటకొస్తే, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ పునరుజ్జీవనానికి దిశానిర్దేశం జరిగేలా మేధామథనం చేయడం ఈ మూడు రోజుల ప్లీనరీ ప్రధాన ఉద్దేశం. అది పూర్తిగా నెరవేరిందా అంటే అనుమానమే. కానీ, ఆశ, నిరాశల మేళవింపుగా పార్టీ ప్రతినిధుల మహా జాతర ముగిసింది. నిరుడు ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సామర్థ్యాన్ని ప్లీనరీలో ఒకరిద్దరు ప్రస్తావించినా, అంతా గాంధీ త్రయం స్తోత్రపాఠాలకే పరిమితమవడం మారని నైజానికి ఉదాహరణ.

దీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న సంస్కరణలకు చడీచప్పుడు లేకుండా తిలోదకాలు ఇచ్చేశారు. నిరుడు మేలో ఉదయ్‌పూర్‌లో పార్టీ 'నవ సంకల్ప శిబిరం'లో చేసుకున్న బాసలు, చెప్పుకున్న ఊసులు ఎటు పోయాయో తెలీదు. 'ఒక వ్యక్తికి ఒకే పదవి' అంటూ రాహుల్ మానసపుత్రికగా వచ్చిన ప్రతిపాదన పార్టీలో అత్యవసర ప్రక్షాళన తెస్తుందని అప్పట్లో తెగ ప్రచారమైంది. తీరా ఇప్పుడు దాన్ని చాప కిందకు నెట్టేశారు. అలాగే, పార్టీ కొందరి కుటుంబ వ్యవహారం కాదని చెప్పేందుకు 'ఒక కుటుంబంలో ఒకరికే టికెట్' అన్న అప్పటి మరో సంస్కరణకు అతీగతీ లేదు. ఇక, 1998లో తొలిసారి అధ్యక్షపదవి చేపట్టి, పాతికేళ్ళలో పార్టీ ఉత్థానపతనాలకు సాక్షిగా నిలిచిన సోనియా రిటైర్మెంట్ వార్తల సంచలనం సరేసరి. పార్టీ వెంటనే నష్టనివారణకు దిగి, ఇన్నింగ్స్ ముగింపని సోనియా అన్నది అధ్యక్ష పదవికేనని వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

పార్టీ అత్యున్నత నిర్ణాయక సంఘమైన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ' (సీడబ్ల్యూసీ)కి ఎన్నికలు సైతం ప్లీనరీలో జరగాలన్నది కాంగ్రెస్ రాజ్యాంగం. 2020 ఆగస్టులో 'జీ–23' అసమ్మతి నేతలు సోనియాకు లేఖాస్త్రంలో చేసిన డిమాండ్ అదే. కానీ, ప్లీనరీ ప్రారంభం కాక ముందే ఆ ఎన్నికల కథ కంచికి చేరింది. ఎన్నికై వచ్చేవారు రేపు ఖర్గే చేసే ప్రతి పనికీ తల ఊపరేమోననే సందేహంతో, సీడబ్ల్యూసీపై పార్టీ యూ టర్న్ తీసుకోవాల్సి వచ్చింది. 18మంది ఎన్నికైన సభ్యులు, 17 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారని పార్టీ రాజ్యాంగానికి సవరణ చేసినా, మొత్తం 35 మందినీ నామినేట్ చేసి, సొంత 'టీమ్35'ను ఎంపిక చేసుకొనే సర్వాధికారాన్ని ఖర్గేకే కట్టబెట్టడం విడ్డూరం. కుర్చీలో వ్యక్తులు మారినా, కాంగ్రెస్ తీరు మారలేదన్న భావన కలుగుతున్నది అందుకే.

అలాగని ప్లీనరీలో సానుకూల అంశాలేమీ లేవని కాదు. పార్టీ రాజ్యాంగంలో పలు సవరణల్ని ఆమోదిస్తూనే, అధికారంలోకి వస్తే చేయనున్న చట్టాలను ప్లీనరీ పేర్కొంది. ఉన్నత న్యాయవ్యవస్థ, ప్రైవేట్ రంగాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు తెస్తామంటూ సామాజిక న్యాయ అజెండాను భుజానికెత్తుకుంది. బీజేపీ కాదంటున్న కులగణనకూ తాను సిద్ధమంది. విద్యార్థులపై వివక్షను నివారించే రోహిత్ వేముల చట్టం, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కన్నా తక్కువకు వ్యవసాయ ఉత్పత్తులు కొంటే శిక్షార్హమైన నేరంగా పరిగణించే చట్టం లాంటివి చెప్పుకోదగ్గవే. అలాగే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీలకు పార్టీలో 50 శాతం రిజర్వేషన్ కల్పించే సవరణా ఆహ్వానించదగ్గదే. భారత్ జోడో యాత్రతో చేపట్టిన తపస్సును కొనసాగించడానికి కొత్త ప్రణాళికతో పార్టీ ముందుకు వస్తుందన్న రాహుల్ ప్రకటన, ఈసారి దేశంలో తూర్పు నుంచి పశ్చిమానికి మరో యాత్ర ఉంటుందన్న వార్తలు ఉత్సాహజనకాలే. అయితే, స్వీయతప్పిదాలు, రానున్న సవాళ్ళపై ప్లీనరీలో జరగాల్సిన అంతర్మథనం పూర్తిగా జరిగినట్టు లేదు.

2024 జాతీయ ఎన్నికలకు ముందు ఈ ఏడాది 9 రాష్ట్రాల ఎన్నికల కర్టెన్‌రైజర్ కీలకం. సోమవారం 3 ఈశాన్య రాష్ట్రాల్లో పోలింగ్ జరగ్గా, రానున్న నెలల్లో కర్ణాటక, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్, బీజేపీలు ముఖాముఖి తలపడనున్నాయి. ఆ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి ప్రతిపక్షాల పొత్తులు, కాంగ్రెస్ బేరసారాల శక్తి ఉండనున్నాయి. ఆ ఎన్నికల్లో హస్తానిది పైచేయి కాకుంటే, ఇప్పటికే కాంగ్రెస్ వినా మూడో ఫ్రంట్‌కై సాగుతున్న యత్నాలు ఊపందుకుంటాయి. అందుకే, గతంలో యూపీఏ సారథిగా ముందున్న కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోవడానికి శ్రమించక తప్పదు. ప్లీనరీకి ఇచ్చిన ప్రకటనల్లో మౌలానా ఆజాద్ ఫోటో విస్మరించిన నేతలు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఇలాంటి పొరపాట్లు ప్లీనరీలో చిన్నవే కావచ్చు. కానీ, రేపు ఎన్నికల్లో చిన్న పొరపాట్లకూ పెద్దమూల్యం ఉంటుంది. గత రెండు ఎన్నికలుగా కాంగ్రెస్‌కు అది అనుభవైకవేద్యమే!

ఎందుకు పోటీ చేస్తున్నానంటే...

అభిప్రాయం



వివేక్ రామస్వామి

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు అప్పుడే కోలాహలం మొదలైంది. ముఖ్యంగా ఈసారి భారత సంతతీయుల సందడి ఎక్కువగా ఉండేట్టుంది. ఇప్పటికే ఆంట్రప్రెన్యూర్, రచయిత వివేక్ రామస్వామి తాను అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తానని ప్రకటించారు. దీనికిగానూ ముందు తన సొంత పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ మద్దతు కూడగట్టవలసి ఉంటుంది. ఏమైనా నిండా నలభై ఏళ్లు లేని, కేరళ మూలాలున్న వివేక్ రామస్వామి ఇంత పెద్ద పదవికి పోటీ పడాలని అనుకోవడమే విశేషం. 'ఒక నూతన అమెరికన్ స్వప్నాన్ని రూపొందించడానికి నేను రాజకీయ ప్రచారం మొదలుపెట్టడం మాత్రమే కాకుండా, ఒక సాంస్కృతిక ఉద్యమాన్ని కూడా ప్రారంభిస్తున్నాను' అని ఆయన చెబుతున్నారు.

అమెరికా ప్రస్తుతం జాతీయ అస్తిత్వ సంక్షోభంలో ఉంది. విశ్వాసం, దేశభక్తి, కఠిన శ్రమ వంటివి కుప్పగూలుతున్న క్షణంలో మనం ఒక పరమార్థం కోసం తపిస్తున్నాం. అవగాహనకు సంబంధించిన మన అవసరాలను సంతృప్తిపర్చుకునేందుకు వాతావరణతత్వం, కోవిడ్ తత్వం, జెండర్ భావజాలం వంటి లౌకిక మతాలను కౌగిలించుకుంటున్నాం. కానీ అమెరికన్ అంటే అర్థం ఏమిటనే ప్రశ్నకు మన వద్ద సమాధానం లేదు.

ఈ మేలుకొలుపు వాదాన్ని (వోక్ ఎజెండా) పలుచన చేసి దాని ప్రాసంగికతను నిర్వీర్యం చేయడం, ఆ శూన్యాన్ని ఉత్తేజకర జాతీయ అస్తిత్వంతో భర్తీ చేయడం రిపబ్లికన్ పార్టీ ప్రథమ ప్రాధాన్యం కావాలి. కానీ దీనికి బదులుగా చాలామంది అగ్రశ్రేణి రిపబ్లికన్లు 1980లలో కంఠస్థం చేసిన నినాదాలను వల్లెవేస్తున్నారు. ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించకుండానే వామపక్ష సంస్కృతిని విమర్శిస్తున్నారు. అమెరికాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు, అమెరికా అంటే ఏమిటి అని మనం కొత్తగా ఆవిష్కరించాల్సిన అవసరం ఉంది. అందుకే నేను అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నాను. ఒక నూతన అమెరికన్ స్వప్నాన్ని రూపొందించడానికి రాజకీయ ప్రచారాన్ని మాత్రమే కాకుండా, ఒక సాంస్కృతిక ఉద్యమాన్ని కూడా ప్రారంభిస్తున్నాను.

37 సంవత్సరాల ఒక రాజకీయ ఔట్‌సైడర్ భూమ్మీద అత్యున్నతమైన అధికారాన్ని సాధించాలనుకోవడం అహంకారంగానే కనిపించవచ్చు. కానీ, నేను మన జాతి కోసం, అమెరికన్ జీవితంలోని ప్రతి రంగంలోనూ ప్రతిభను పునరుద్ధరించగలిగే జాతి కోసం దార్శనికతలో భాగంగా పోటీ చేస్తున్నాను.

మనం ప్రతిభను పునరుద్ధరించాలి. నా తల్లిదండ్రులు ఈ దేశానికి చట్టబద్ధంగా వచ్చారు, కష్టపడి పనిచేశారు, వేలాది అమెరికన్ల జీవితాలను మెరుగుపర్చిన వ్యాపార సంస్థలను రూపొందించిన ఇద్దరు పిల్లలను పెంచి పెద్దచేశారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవేశిస్తున్న వారికి బదులుగా మా తల్లిదండ్రుల వంటి వలస ప్రజలు అవసరం. ఎలాంటి మొహమాటాలకూ తావులేకుండా అమెరికా సరిహద్దులకు భద్రత కల్పించడం, ప్రతిభా ప్రవేశాలకు అనుకూలంగా లాటరీ ప్రాతిపదికతో కూడిన వలస విధానాన్ని నిర్మూలించడం అవసరం.

అమెరికాకు వచ్చి విజయాలు పొందినవారి ప్రతిభను మనం తప్పక ప్రోత్సహించాలి. అమెరికా శ్రామిక శక్తిలో దాదాపు 20 శాతం మందిని నియమిస్తున్న ఫెడరల్ కాంట్రాక్టర్లు జాతి ప్రాతిపదికన నియామకాలను చేపట్టడాన్ని తప్పనిసరి చేస్తూ అమెరికా పూర్వ అధ్యక్షుడు లిండన్ బి. జాన్సన్ కార్యనిర్వాహక ఆదేశం 11246 జారీ చేశారు. దీనివల్ల నల్లజాతి, హిస్పానిక్(స్పానిష్ దేశాలు) ఉద్యోగుల పట్ల అగ్రశ్రేణి కంపెనీలు ఎక్కువ అక్కర చూపుతూ– శ్వేత జాతి లేదా ఆసియన్ అమెరికన్లుగా ఉంటున్న అర్హత కలిగిన అభ్యర్థుల పట్ల అనిష్టం ప్రదర్శిస్తున్నాయి. ఇలాంటి కార్యనిర్వాహక ఆదేశాన్ని రద్దు



చేయటమే కాకుండా, అక్రమమైన జాతి ప్రాతిపదిక ప్రాధాన్యాలపై విచారణ జరిపించాలని న్యాయ శాఖను ఆదేశిస్తాను.

ప్రభుత్వాన్ని నిర్వహించడానికి ఎంపికైనవాళ్లు వాస్తవంగా ప్రభుత్వాన్ని నిర్వహించాలి. కానీ ఎన్నికలలో పాల్గొనని ఆంథోనీ ఫాచీ (అమెరికా ముఖ్య వైద్య సలహాదారు), మెర్రిక్ గార్లండ్ (అమెరికా అటార్నీ జనరల్) వంటి బ్యూరోక్రాట్లు తమ పరిధిని మీరి ప్రవర్తించారు. ఇంకోసారి ఇలాంటి బ్యూరోక్రాట్లు తమ పరిధిని మీరినప్పుడు ఒక అధ్యక్షుడికి రాజ్యాంగం కల్పించిన సాధికారతను నేను తప్పకుండా అమలు చేయడానికి నిబద్ధత వహిస్తాను; వారిని తొలగిస్తాను. ఫెడరల్ ఉద్యోగులకు కల్పించిన సివిల్ సర్వీస్ సంరక్షణలను అవసరమైతే కార్యనిర్వాహక ఆదేశం ద్వారా రద్దు చేస్తాను. వీటికి బదులుగా నిర్దిష్టకాలం మాత్రమే రక్షణ కల్పించే మేనేజీరియల్ నిబంధనలను తీసుకొస్తాను. దేశాధ్యక్షుడు ఎనిమిదేళ్లకు మించి అధికారంలో ఉండనప్పుడు, బ్యూరోక్రాట్లకు కూడా దాన్నే వర్తింప జేయాలి. డబ్బును వృథా చేస్తున్న లేదా కాలం చెల్లిన సంస్థలకు నిధులను నిలిపివేసేలా– 1974 నాటి 'ఇంపౌండ్‌మెంట్ కంట్రోల్' చట్టాన్ని రద్దు చేయాలని లేక సవరించాలని అమెరికన్ కాంగ్రెస్‌ను కోరతాను. సంస్కరించడానికి సాధ్యం కాని సంస్థలను మూసివేస్తాను. వాటి స్థానంలో పునాదుల నుంచి కొత్త సంస్థలను నిర్మిస్తాను.

ఏ భావాలనూ సెన్సార్ చేయనప్పుడే ఉత్తమ ఆలోచనలు పుట్టుకొస్తాయి. తమకు అనుకూలంగా లేని రాజకీయ ప్రసంగాలను సెన్సార్ చేయడంపై మన ప్రభుత్వం టెక్నాలజీ కంపెనీలపై ఒత్తిడి తీసుకొస్తోంది. అవి అలా చేసేట్టుగా ప్రత్యేక భద్రతను కల్పిస్తోంది. రాజ్య శక్తులతో కలిసి పనిచేసేలా ఇంటర్నెట్ కంపెనీలు అమెరికన్ రాజ్యాంగ తొలి సవరణకు కట్టుబడి ఉండాలి. ఎలాన్ మస్క్ ట్విట్టర్ విషయంలో చేసినట్టుగా, ఫెడరల్ గవర్నమెంట్ నుంచి 'స్టేట్ యాక్షన్ ఫైల్స్'ను బహిర్గత పరుస్తాను. రాజ్యాంగం నిషేధించిన కార్యకలాపాలను చేపట్టేలా కంపెనీలను బ్యూరోక్రాట్లు తప్పుడు పద్ధతుల్లో ఒత్తిడిపెట్టినట్టు తెలిపే ప్రతి ఉదంతం దీని ద్వారా బయటికొస్తుంది.

ఇంటర్నెట్‌ని దాటి మన ఆర్థిక వ్యవస్థ మొత్తంగా అభిప్రాయాల సెన్సార్‌షిప్ విస్తరించింది. నల్లజాతి, గే లేదా ముస్లింగా ఉంటున్నందుకు మీరు ఎవరినైనా ఉద్యోగం లోంచి తొలగించలేనట్లయితే, రాజకీయ ప్రసంగం కోసం కూడా మీరు ఎవరినీ ఉద్యోగం లోంచి తొలగించకూడదు. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్తగా రాజకీయ వ్యక్తీకరణను ప్రతిష్ఠించడానికి నేను అమెరికన్ కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాను. విభేదించే అభిప్రాయాలను కలిగివుండే కార్మికులను వివక్ష నుంచి కాపాడటానికి ప్రస్తుతం ఉనికిలో ఉన్న పౌర హక్కులను అమలు చేస్తాను. మత పరమైన వివక్షపై ఉన్న ఫెడరల్ ప్రభుత్వ నిషేధం ఉద్యోగులను ఏ మతానికీ లోబడనీయకుండా యజమానులను కట్టడి చేస్తోంది. కార్పొరేట్ అమెరికాలో వ్యాపించివున్న మేలుకొలుపు వాదానికి ఇది సరిగ్గా సరిపోయేట్టుగా ఉంది.

పరస్పరం పంచుకునే సూత్రాల చుట్టూ మన జాతీయ అస్తిత్వాన్ని పునరుద్ధరించుకున్న తర్వాత, అమెరికాకు అతి పెద్ద విదేశీ ప్రమాదంగా ఉన్న కమ్యూనిస్టు చైనా వికాసాన్ని ఓడించడానికి అవసరమైన దృఢత్వాన్ని సమకూర్చుకోగలం. 1980లలో సోవియట్ యూనియన్‌లాగా కాకుండా, చైనా నేడు ఆధునిక అమెరికన్ జీవన శైలికి కావాల్సిన శక్తిని ప్రసాదిస్తోంది. అందుకే మనం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవాలి. చైనాను కనీసం తాకకుండా, అమెరికాను వణికిస్తున్న సరికొత్త వాతావరణ మతం చేస్తున్న డిమాండ్లను వ్యతిరేకించడం ద్వారా మనం ప్రపంచ ఇంధన నాయకత్వాన్ని తిరిగి పొందాలి. తైవాన్‌ను ఏ విధంగానైనా సరే కాపాడుతూనే సెమీ కండక్టర్‌ల తయారీలో స్వయం సమృద్ధిని సాధించాలి. 16 సంవత్సరాల లోపు పిల్లలు టిక్ టాక్ ఉపయోగించకుండా నిషేధం విధించాలి. కోవిడ్–19ను వ్యాప్తి చెందించడంపై చైనాను జవాబుదారీని చేయడానికి మనం ఆర్థిక తులాదండాన్ని తప్పకుండా ఉపయోగించాలి. చౌర్యం, వ్యాపారమయ ఎత్తుగడలను చైనా ప్రభుత్వం నిలిపి వేసేంతవరకు అవసరమైతే చైనాలోకి అమెరికన్ కంపెనీలు విస్తరించడాన్ని నిషేధించడానికి కూడా మనం సిద్ధపడాలి.

మనం నిజంగా ఎవరం అని తిరిగి ఆవిష్కరించుకున్నట్లయితే మళ్లీ కాలానికి తగినట్టుగా మనం ఎదగగలం. అమెరికా బలం మన భిన్నత్వం కాదు, ఆ భిన్నత్వానికి అతీతంగా మనల్ని ఐక్యం చేస్తున్న ఆదర్శాలే మన బలం. ఈ ఆదర్శాలే అమెరికన్ విప్లవాన్ని గెలిపించాయి, అంతర్యుద్ధం తర్వాత దేశాన్ని ఐక్యపరిచాయి, రెండు ప్రపంచ యుద్ధాలను, ప్రచ్ఛన్న యుద్ధాన్ని గెలిపించాయి. ఈ ఆదర్శాలు ఇప్పటికీ స్వేచ్ఛాయుత ప్రపంచం పట్ల ఆశను కలిగిస్తున్నాయి. వీటిని మనం పునరుద్ధరించినట్లయితే మనల్ని ఏ శక్తీ ఓడించలేదు.

వ్యాసకర్త అమెరికా అధ్యక్ష స్థానం కోసం పోటీ పడనున్నారు
('వాల్ స్ట్రీట్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తప్పక తలొగ్గారు



మనీశ్ సిసోడియా అరెస్టు పట్ల చాలామంది సీబీఐ అధికారులు వ్యతిరేకంగా ఉన్నట్టు నాకు తెలిసింది. వారందరికీ సిసోడియా అంటే చాలా గౌరవం, పైగా ఆయనకు వ్యతిరేకంగా ఏ సాక్ష్యమూ లేదు. కానీ రాజకీయ ఒత్తిడి ఎంత ఎక్కువగా ఉందంటే, వాళ్లు తమ రాజకీయ గురువులకు తలొగ్గక తప్పలేదు.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

అవసరం



ప్రభుత్వ కార్యాలయాల్లోంచి మహాత్మా గాంధీ ఫొటోను తొలగించడం నుంచి, సీబీఐ ఘటనలను ఎదుర్కోవడానికి అవసరమైన స్థైర్యం కోసం అదే బాపు సమాధి ముందు ప్రార్థించడం చూస్తుంటే– ఆమ్ ఆద్మీ పార్టీ ఒక పూర్తి చక్రభ్రమణం పూర్తిచేసినట్టుంది.

– ఎస్ ఎస్ ఓర్ఝూ, మాజీ ఉన్నతాధికారి

ముంబయికి ఏమైంది?



ముంబయిలో నేను కలుస్తున్న ప్రతి ఐదుగురిలో ఒకరికి గొంతు నొప్పి, దగ్గు, జలుబు ఉన్నాయి. పైగా ఈ సాధారణ జలుబు నుంచి కోలుకోవడానికి మూడు వారాల కంటే ఎక్కువ సమయం పడుతోంది. ఏమైనట్టు? గాలి నాణ్యత సమస్యా? మిగతా నగరాల్లో కూడా పరిస్థితి ఇలాగే ఉందా?

– అదిత్ పోద్దార్, ఆంట్రప్రెన్యూర్

మూసుకుపోతుంది



ఐడియాలజీ అనేది మనల్ని ఒక వాస్తవంతో కూడా విభేదించేలా చేస్తుంది – కేవలం ఆ వాస్తవం మరో వైపు నుంచి వచ్చిందన్న కారణంగా. మేధను ఐడియాలజీ విషపూరితం చేస్తుంది.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

దేనికోసం?



లాక్‌డౌన్లు పని చేయలేదు. మాస్కులు పని చేయలేదు. 'టీకాలు' పని చేయలేదు. మరెందుకోసం అవన్నీ?

– అనస్తాసియా మారియా లూపిస్, డెన్మార్క్ వైద్యురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అత్యంత విషాదకరం

వరంగల్ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థి ప్రీతి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరం. ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు తరచుగా బలవన్మరణాలకు పాల్పడడం విస్మయకరం. ఆత్మహత్యకు పురిగొల్పిన పరిస్థితుల్ని అధిగమించలేని బలహీన స్థితినీ, వాటికి ఊతమిస్తున్న వాతావరణాన్నీ లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. గత వారమే ఐఐటీ ముంబై విద్యార్థి దర్శన్ క్యాంపస్‌లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు ముంబై వైద్య కళాశాలలో మరో పీజీ విద్యార్థి పాయల్‌దీ ఇదే కథ. దశాబ్ద కాలంలో ఉన్నత విద్యాలయాల్లో 122 మంది ఇలా బలవన్మరణాలకు పాల్పడగా అందులో సగానికి పైగా బలహీన వర్గాల నుండి వచ్చిన వారే. పైన ఉదహరించిన ముగ్గురూ దళిత, ఆదివాసీ కుటుంబాల నుండి వచ్చిన వారే. పేదరికం నేపథ్యంగా ఎదిగిన వారే. ఆత్మహత్యలకు వేరు వేరు కారణాలు ఉండొచ్చుగానీ వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన మార్గాలు స్పష్టమే. మొదట విద్యాలయాల్లో అంతర్గతంగా, బహిరంగంగా వివక్షకు గురిచేసే పరిస్థితులకు అడ్డుకట్ట పడాలి. ర్యాగింగ్‌పై ఉక్కుపాదం మోపాలి. మార్కుల విధానం, ఇతర అసెస్‌మెంట్ విధానాలు పారదర్శకంగా ఉండాలి. పక్షపాతం లేని విధంగా పాలనా విధానాలు యూనివర్సిటీల్లో అమలు కావాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులకు, మానసికంగా మద్దతు అవసరం పడ్డవారికి కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి. గౌరవ సుప్రీం ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడ్డట్టు యూనివర్సిటీలో సహానుభూతి (ఎంపతీ) వాతావరణం ఉండేలా చూడాలి. ఇది దేశవ్యాప్తంగా ఉన్న తీవ్ర సమస్య. లోతైన అవగాహనా, చిత్తశుద్ధి గల కార్యాచరణ అవసరం.

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

దేవుడా... ఏమిటిదంతా?!

నాకు ఎప్పుడూ ప్రశాంతంగా నిద్ర పట్టదు. అందువల్ల నేల ఉబికి వస్తున్నట్టు అనిపించేసరికి వెంటనే మెలకువ వచ్చింది. కంగారుగా లేచి మేం పడుకునే మంచానికి పక్కనే నిద్రపోయే మా నాలుగేళ్ల పాప కోసం చూశాను. ఆమె మా కాళ్ల దగ్గరుంది. వెంటనే ఆమెను చేతుల్లోకి తీసుకుని నా భార్యను గట్టిగా అరుస్తూ లేపాను. ఆమె లేస్తూనే ప్రార్థన సమయంలో వాడే దుస్తుల్ని కప్పుకునే ప్రయత్నం మొదలెట్టింది. 'ముందు ప్రాణం ముఖ్యం. అవన్నీ తర్వాత చూసుకుందాం' అంటూనే తాళం చెవి కోసం వెతికాను. వీధి గదివైపు పరుగెత్తేలోగానే భూకంపం తాకిడి మరింత పెరిగింది. తలుపువైపు ఎలా పరుగెత్తామో, బ్యాలెన్స్ చేసుకోవడానికి ఎంత ప్రయత్నించామో తల్చుకుంటే ఇప్పటికీ భయం వేస్తుంది. తాళం చెవి సరిగా పెట్టి తీయడానికి దాదాపు 15 సెకన్ల సమయం పట్టింది. బయటికొచ్చి తలుపులు వేసి వణికించే చలిలో, వర్షం పడుతుండగా చెప్పులు లేకుండా రోడ్డు మీది కొచ్చాం.



'బాబా ఇది కూడా అసాద్ ఊ...ఊ అని పేలుస్తున్నందు వల్లేనా?' మా పాప అడిగింది.

అంతర్యుద్ధం జరిగే ప్రాంతానికి కొన్ని మైళ్ల దూరంలోని బిన్నిష్ పట్టణంలో ఉండటం వల్ల నాలుగేళ్ల మా పాపకు తుపాకి గుళ్ల చప్పుడు, వైమానిక దాడులు, యుద్ధ విమానాల మోతలు అలవాటై పోయాయి. వాటన్నిటినీ తన భాషలో 'ఊ...ఊ' అంటుంది.

నిజానికి ఆమె ఈసారి వింటున్న చప్పుడు సమీపంలోని మసీదుల గుమ్మటాలు కూలిపోతున్న చప్పుళ్లు.

మా ఇరుగుపొరుగంతా ఇళ్లల్లోంచి బయటకు రావటం మొదలైంది. మాలాగే ఎవరి కాళ్లకూ చెప్పుల్లేవు. పైజమాలతో వణికించే చలిలో, వర్షంలో నిస్సహాయంగా నిలబడ్డారు.

భూకంపం కాస్త తగ్గాక వెంటనే నేను లోపలికి పరుగెత్తి సిరియాలోనూ, దక్షిణ టర్కీలోనూ ఉన్న మా బంధువులకు ఫోన్లు చేయడం మొదలుపెట్టాను. వారి క్షేమసమాచారాలు తెలుసుకున్నాను. ఆ తర్వాత కారు తీసి ఎక్కడ ఎలాంటి విధ్వంసం జరిగిందో చూడటానికి వెళ్లాను. ఎటు చూసినా కూలిన ఇళ్లు, గోడలు. రోడ్లన్నీ అంబులెన్సులతో, పౌర రక్షణ బృందాలతో నిండివున్నాయి.

డ్రైవింగ్ చేస్తున్నంతసేపూ నన్ను తొలుస్తున్న ప్రశ్న ఒక్కటే. 'దేవుడా! ఇదంతా మాకు అవసరమా? నియంతృత్వం, యుద్ధం, నరమేధాలు... ఇప్పుడు ఈ భూకంపం! అన్నీ మాకే ఎందుకు జరుగుతున్నాయి? ఇది మా సహనానికి నువ్వు పెట్టే పరీక్షా?'

రోజంతా నేను కలిసినవారితో ఇదే చర్చ. ఎక్కడికెళ్లినా రోదనలు. అందరూ కాపాడమని, ఈ కష్టాలనుంచి గట్టెక్కించాలని దేవుణ్ణి వేడుకుంటున్నవారే.

అతారిబ్ పట్టణంలో నేను చూసిన దృశ్యాలు వర్ణించ శక్యం కానివి. ఫుట్‌బాల్ గ్రౌండ్ అంత సైజులో ఉన్న భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.

సిరియా ప్రభుత్వ నరమేధం నాటి రోజుల్లోకి మళ్లీ వెళ్లామా అన్న భావన నాలో కలిగింది. ఇప్పుడు కూడా గాలిలో ఆ నెత్తుటి వాసనే. మరో రాకెట్ దాడి ఏ క్షణమైనా జరగొచ్చని అప్పట్లో భయపడినట్టే ఇప్పుడు భూమి ఏ క్షణంలో మళ్లీ కంపిస్తుందోనన్న భయం మమ్మల్ని వదలడం లేదు. ఇంతవరకూ వరసబెట్టి ఒక డజను సార్లయినా ప్రకంపనలు వచ్చాయి. వచ్చినప్పుడల్లా మా ప్రాణాలు తోడేశాయి. పౌరరక్షణ బృందాలు కూలిన ఇళ్లలో గాలిస్తుంటే ఆ శిథిలాల ముందు తమ ఆప్తుల జాడ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న జనాన్ని చూస్తే నాకు దుఃఖం ఆగలేదు. సజీవంగా బయటపడుతున్నవారు కొందరైతే... విగతజీవులుగా మారినవారు కొందరు. కొన్ని ముఖాలైతే ఆనవాలుకు కూడా చిక్కనంతగా చితికిపోయాయి. వారి స్థానంలో నన్ను నేను ఊహించుకుని ఆపుకోలేక భోరున విలపించాను.

(సిరియాలో వేలాదిమందిని బలిగొన్న భూకంపంపై అక్కడి పాత్రికేయుడు మహమ్మద్ హాజ్ కదౌర్ రాసిన వ్యాసం)

సార్వజనీన సైన్స్ ఇప్పటి అవసరం

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

1986 నుంచి మన దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీని 'జాతీయ విజ్ఞాన దినోత్సవం' (నేషనల్ సైన్స్ డే)గా జరుపుకొంటున్నాం. సైన్స్‌కు సంబంధించి పెరిగిన అవసరాలు, ప్రాముఖ్యం మరింత తెలియజెప్పడానికి సీవీ రామన్ మహాశయుడు 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) కనుగొన్న ఫిబ్రవరి 28 (1928) తేదీని ఎంచుకుని ప్రత్యేక ఇతివృత్తం (థీమ్) దిశగా పలు కార్యక్రమాలు పలు స్థాయిలలో జరగడం పరిపాటి అయ్యింది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ శాస్త్రవేత్తలు వ్యాపించి ఎన్నో రకాల పరిశోధనలు చేస్తున్నారు అలాగే అణుశక్తి పరిశోధనలోనూ, అంతరాళ ప్రయోగాలలోనూ ఎంతో ప్రతిభ కనబరిచిన మన దేశం... ఆహార ధాన్యాల దిగుబడిలో, ఆరోగ్యసదుపాయాల కల్పనలో, సగటు మనిషికి అవసరం అయిన సౌకర్యాలను అందివ్వడంలో ఎంతో విజయం సాధించిన మాట వాస్తవమే. అయినా మౌలిక రంగంలో విశేషమైన ప్రభావం కల్గించిన ఆ స్థాయి పరిశోధనలు మన దేశం నుంచి ఎక్కువగా రాక పోవడం బాధాకరమే.



మనిషి పుట్టుక నుంచీ పరిణామాన్ని గమనిస్తే ఎందుకు? ఎలా? ఏమిటి? ఎప్పుడు? ఎవరు? వంటి సందేహాలే ఇతర జీవకోటి నుంచీ మనిషిని వేరు పరిచాయి. అటువంటి ఆలోచనారీతి కారణంగానే మనిషి తన చుట్టూ ఉన్న పరిసరాలు, వాతావరణ మార్పు, ఇతర జంతుకోటి వంటివాటి గురించిన భయాన్ని పోగొట్టుకునే రీతిలో అన్వేషణ ప్రారంభించాడు. ఈ తొలి అడుగుకు దోహదపడిందీ, నేపథ్యంగా నిలిచిందీ సైన్సు మాత్రమే. ఈ పరిశీలన రీత్యా పలు రకాల పరిజ్ఞానాన్ని గడించి దాన్ని వివిధ శాఖలుగా వింగడించి, వర్గీకృతమైన జ్ఞానాన్ని (క్లాసిఫైడ్ నాలెడ్జ్) 'సైన్స్' అని పేర్కొంటున్నాం.

ప్రపంచవ్యాప్తంగా మానవాళికి తెలిసిన శాఖోపశాఖల విజ్ఞానాన్నంతా 'విజ్ఞానం' (సైన్స్)గా పిలుస్తున్నారు. ఈ సూత్రాలు, నియమాల ఆధారంగా సౌలభ్యంగా మానవ శ్రమని తగ్గిస్తూ, సౌకర్యవంతంగా జీవితం ఉండేలాగున తయారు చేసుకున్న పనిముట్లను; రూపొందించుకున్న నిర్మాణ సామగ్రిని, పద్ధతుల్ని 'సాంకేతిక శాస్త్రం' (టెక్నాలజీ)గా సంభావిస్తాం. సైన్స్ స్థాయిలో అది ఖర్చుతో కూడిన వ్యవహారం, ప్రత్యేకంగా నేరుగా లాభం కలిగే సదుపాయం లేనిది. దీనిని మౌలిక విజ్ఞాన శాస్త్రాలు (బేసిక్ సైన్సెస్) అంటారు. ప్రస్తుత ప్రపంచంలో ఆకర్షణ కోల్పోయినవి ఈ మౌలిక విజ్ఞాన శాస్త్రాలే.

ఏ పార్శ్వంలో అయితే అవసరాలు పెరిగాయో... ఆ దిశలో దృష్టి పెట్టే రీతిలో ఆయా సంవత్సరాల సైన్స్ డే ఇతివృత్తం (థీమ్) స్వీకరించబడుతుంది. 2023వ సంవత్సరానికి మనదేశం విజ్ఞానశాస్త్రం పరంగా 'గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్' (ప్రపంచ శ్రేయస్సుకి ఊతం ఇచ్చే సార్వజనీనమైన విజ్ఞానం) అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసుకుంది. కరోనా పరామర్శతో ప్రపంచవ్యాప్తంగా మనం ఎంతోకాలంగా రూపొందించుకున్న వ్యవస్థలు ఛిన్నాభిన్నం అవడమే కాకుండా... మనం నిర్మించుకున్న టెక్నాలజీ కవచాలు డొల్లవని కూడా తేలిపోయింది. కనుక ప్రపంచ మానవాళిని దృష్టిలో పెట్టుకుని ఉపయోగపడే సైన్స్ గురించి ఇప్పుడు ఆలోచించాలి.

ప్రాంతం, భాష, దేశం, ఖండం వంటి పరిమితులు నియంత్రించని విజ్ఞానాన్ని రూపొందించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. వనరులను పొదుపు చేయడంలో కానీ, తక్కువ కాలుష్యం కలిగించే రీతిలో వనరుల వినియోగ విధానాలు ఏర్పరచుకోవడంలో కానీ, అలాగే ప్రపంచ స్థాయిలో మన దేశ గౌరవాన్ని ప్రతిష్ఠను ద్విగుణీకృతం చేసే సైన్సు గురించి గానీ మనం కృషి చెయ్యాలి. అంటే మనకున్న పరిమితుల్ని అధిగమిస్తూ ప్రపంచ అవసరాల దృష్ట్యా వ్యూహం సారిస్తూ ముందుకు సాగాలి. అయితే సైన్స్ లక్ష్యం వాణిజ్యం కానీ, ఆర్థికం కానీ, అధికార వ్యూహాలు కానీ, రాజకీయాలు కానీ, రాజకీయ ఎత్తుగడలు కానీ కాకుండా ప్రపంచ శ్రేయస్సే పరమావధి కావాలి! ఆ రీతిలో మనలను మనం సమాయత్తం చేసుకోవాలి. అవసరం అయితే సంకుచిత భావాలను తగ్గించుకుని, విశ్వమానవాళి గురించి ఆలోచించాల్సిన అగత్యం కూడా ఉంది. దానికి తగ్గట్టుగానే మన వాదనలు, ప్రణాళికలు, ప్రయోగాలు, వ్యూహాలు సాగాల్సి ఉంటుంది.

వ్యాసకర్త పాపులర్ సైన్సు రచయిత । 99407 32392
(నేడు నేషనల్ సైన్స్ డే)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.నవమి పూర్తి (24గంటలు), నక్షత్రం: రోహిణి ఉ.10.16 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: సా.4.17 నుండి 5.59 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.28 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.46 వరకు, అమృతఘడియలు: రా.2.33 నుండి 4.16 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 601.

టీటీడీ యాప్‌లో పంచగవ్య ఉత్పత్తులు

- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి/తిరుమల: టీటీడీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న 15 రకాల పంచగవ్య ఉత్పత్తుల గురించి టీటీడీ వెబ్‌సైట్‌తో పాటు ఇటీవల రూపొందించిన యాప్‌లో కూడా సమాచారం పొందుపరచాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. 15 రకాల పంచగవ్య ఉత్పత్తుల్లో 10 ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. వీటిని మరింత ఎక్కువగా వినియోగదారులకు చేరవేయడానికి, ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. టీటీడీ ఆలయాల్లో వినియోగించిన పుష్పాలతో తయారు చేస్తున్న ఫొటో ఫ్రేమ్‌లను మరింత ఆకర్షణీయంగా, సమాచారంతో తీర్చిదిద్దాలన్నారు. అంతకుముందు తిరుమల, తిరుపతిలో పరకామణి అంశంపై ఈవో సమీక్ష జరిపారు. జేఈవో సదా భార్గవి, ఎఫ్ఏసీఏవో బాలాజి పాల్గొన్నారు. కాగా, తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,170 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.


మనసేం బాలేదు!

పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో కుదేలు

- మానసిక శక్తిని దెబ్బతీసిన కరోనా
- ర్యాంక్‌లు, మార్కుల వేటలో విద్యార్థులు విలవిల
- 'టెలీ మానస్'కు కాల్ చేస్తున్న బాధితులు

'కరోనాతో రెండేళ్ల పాటు ఇంట్లోనే ఆన్‌లైన్ క్లాస్‌లకు అటెండ్ అయ్యాను. అప్పట్లో సరిగా చదువుపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం ఆఫ్‌లైన్ క్లాస్‌లు నడుస్తున్నాయి. రోజూ కాలేజీకి వెళుతున్నాను. కానీ టీచర్ చెప్పేది అర్థం కావడం లేదు. పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయి. రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదు'
– ఓ ఇంటర్ విద్యార్థి

'ఓ వైపు ఆఫీస్, మరోవైపు ఇల్లు.. ఇలా రెండు చోట్లా సమస్యలు వేధిస్తున్నాయి. ఫలితంగా మానసిక ప్రశాంతత కోల్పోతున్నాను. ఒంటరిగా జీవించాలనే భావన పెరుగుతోంది'
– ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి



సాక్షి, అమరావతి: ఇలా వివిధ మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారు వైద్య శాఖ ఏర్పాటు చేసిన 'టెలీ మానస్' కాల్ సెంటర్‌ను సంప్రదిస్తున్నారు. సమస్యలను వివరంగా తెలుసుకుంటున్న కాల్ సెంటర్‌లోని కౌన్సెలర్లు బాధితులకు సాంత్వన చేకూరుస్తున్నారు. అవసరం మేరకు దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రిలోని మానసిక వైద్యులకు రిఫర్ చేసి వైద్య సేవలు అందేలా చూస్తున్నారు. కరోనా మహమ్మారి, వైరస్ వ్యాప్తి నేపథ్యంలో విధించిన లాక్ డౌన్ చాలా మందిలో మానసిక శక్తిని దెబ్బతీసింది. దీనికి తోడు వివాహ బంధాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, విద్యా, ఉద్యోగం, అనారోగ్యం ఇతరత్రా కారణాలతో మానసిక సమస్యలతో సతమతమయ్యే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. దేశంలో సుమారు 15 కోట్ల మంది మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గతేడాది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్(ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) సర్వే వెల్లడించింది.

డిప్రెషన్‌కు లోనై..

రాష్ట్రంలో మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, సలహాలు, సూచనలివ్వడం కోసం గతేడాది అక్టోబర్‌లో వైద్య శాఖ కాల్ సెంటర్‌ను ప్రారంభించింది. విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాల్ సెంటర్ ఉంది. ఈ కాల్ సెంటర్‌కు ఇప్పటి వరకూ వివిధ సమస్యలతో 2,452 మంది ఫోన్ చేశారు. ప్రస్తుతం రోజుకు సగటున 30 వరకూ కాల్స్ వస్తున్నాయి. కాల్ సెంటర్‌ను సంప్రదించిన వారిలో ఎక్కువ మందిలో డిప్రెషన్ సమస్య ఉన్నట్టు కౌన్సెలర్లు చెబుతున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి భయం, లాక్‌డౌన్ కారణంగా ఎక్కువ రోజులు ఒంటరిగా గడపడం, కుటుంబ సభ్యులు, సన్నిహితులు మృత్యువాత పడటం.. ఆర్థిక ఇబ్బందులు మొదలైనవి డిప్రెషన్‌కు ముఖ్య కారణాలుగా బాధితులు చెబుతున్నట్టు వెల్లడైంది. కొందరిలో ఈ సమస్య ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్నట్టు తెలిసింది. మరికొందరిలో సమస్య తీవ్రమై.. తమ చుట్టూ ఉండే కుర్చీలు, బల్లలు, ఇతర వస్తువులు మాట్లాడుతున్నాయన్న భావన కలుగుతోందని చెబుతున్నారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులు సైతం కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న వారే. కరోనా కారణంగా రెండేళ్ల పాటు అకడమిక్ ఇయర్ దెబ్బతింది. దీనికి తోడు, కొందరు తల్లిదండ్రులు పిల్లల అభిరుచులు, సామర్థ్యాలు పట్టించుకోకుండా పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు రావాలి, ఐఐటీ, నీట్‌లో ర్యాంక్‌లు సాధించాలి.. అంటూ పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు సైతం మార్కులు, ర్యాంక్‌ల కోణంలోనే విద్యార్థులను వేధిస్తున్నాయి. ఈ ధోరణుల మధ్య తాము తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తున్న విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక దశలో వైద్యులను సంప్రదించడం ఉత్తమం

మానసిక సమస్యలు ఉన్నవారు ప్రాథమిక దశలోనే కౌన్సెలర్లు, వైద్యులను సంప్రదిస్తే మంచిది. అయితే చూసే వాళ్లు ఏమనుకుంటారోనని కౌన్సిలర్‌లు, వైద్యులను సంప్రదించడానికి విముఖత వ్యక్తం చేస్తుంటారు. అలాంటి వారు 14416 లేదా 180089114416 నంబర్‌కు కాల్ చేసి మానసికంగా ఉపశమనం పొందుతున్నారు. నచ్చిన పాటలు వినడం, సినిమాలు చూడటం, విహార యాత్రలకు వెళ్లడం వంటి కార్యకలాపాలు చేస్తే మానసికంగా ప్రశాంతంగా ఉండొచ్చు.
– ఎ.అనంత్‌కుమార్, కౌన్సెలర్, సూపర్‌వైజర్ టెలీ మానస్ కాల్‌సెంటర్

వైభవంగా మన్యంకొండ జాతర

- పొల్లూరు జలపాతం వద్ద పోటెత్తిన భక్తులు



పొల్లూరు జలపాతం వద్ద స్నానాలు చేసేందుకు తరలివచ్చిన భక్తులు

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనుల ఆరాధ్య పండుగ మన్యంకొండ జాతరకు భక్తజనం సోమవారం పోటెత్తారు. ఒడిశా సరిహద్దున సీలేరు నదిని ఆనుకొని ఉన్న ఒడిశా పొల్లూరు గ్రామంలో కన్నమరాజు, బాలరాజు, పోతురాజు స్వాములకు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన పడవపై స్వామివారిని పూజారుల సమక్షంలో సీలేరు దాటించారు. అనంతరం పొల్లూరు గ్రామంలో దేవతలకు ఏపీ జెన్‌కో అధికారులు, ఏఎస్పీ మహేశ్వరరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. పటిష్ట భద్రత మధ్య పొల్లూరు జలపాతంలో దేవతామూర్తులకు పూజారులు స్నానం చేయించారు. జలపాతం వద్ద వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించేందుకు అవసరమైన సౌకర్యాలను జెన్‌కో, పోలీసు అధికారులు కల్పించారు.

వలలో చిక్కిన 600 కిలోల చేప

- విలువ రూ.2 లక్షల పైమాటే..



ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం తీరంలో సోమవారం మత్స్యకారుల వలకు భారీ చేప చిక్కింది. ముక్కుడు టేకుగా పిలిచే ఈ చేప సుమారు 600 కిలోల బరువు ఉంది. దీని విలువ సుమారు రూ.2 లక్షలపైనే. సముద్రంలో వలకు చిక్కిన ఈ చేపను మత్స్యకారులు ప్రాణాలతో ఒడ్డుకు లాక్కొచ్చారు. అంత ఖరీదైన చేపను స్థానికంగా కొనే నాథుడు లేక కాకినాడ, విశాఖపట్నంలోని చేపల వ్యాపారులకు సమాచారం ఇచ్చారు. ఈ రేవులో ఇంత పెద్ద చేప మొదటిసారిగా దొరికిందని, అనుకున్న ధర రాకపోతే చేపను సముద్రంలో విడిచిపెడతామని మత్స్యకారులు చెప్పారు. ప్రస్తుతం శారద, వరాహ నదుల కలయిక మొగలో నీటిలో వల తాడుతో బంధించి ఉంచారు.

సవరణ

తేది. 27-02-2023 నాడు సాక్షి దిన పత్రికలో ప్రచురించిన కృష్ణా నది కుడి ఒడ్డు తనిఖీ మార్గాన్ని విస్తరించడం మరియు బలోపేతం చేయడం కొరకు వేసిన ప్రకటనలో మండదం గ్రామ సర్వే నెం.20 లో మొత్తం విస్తీర్ణము 0.80కి బదులుగా 0.08 అని మరియు సర్వే నెం. 25లో సబ్ డివిజన్ 3బి2కి బదులుగా 3 అని చదువుకొనగలరు.

దేశంలో పెరిగిన ఎరువుల వినియోగం

- 2021లో దేశంలో 10.8 శాతం పెరిగిన ఎరువుల వినియోగం
- 2021 ఖరీఫ్‌లో తెలంగాణలో హెక్టార్‌కు 1.14 టన్నుల వాడకం
- ఏపీలో హెక్టార్‌కు 0.98 టన్నులు, గుజరాత్‌లో 0.95 టన్నులు
- అత్యల్పంగా జార్ఖండ్‌లో హెక్టార్‌కు 0.13 టన్నులే వినియోగం
- కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో ఎరువుల వినియోగం పెరిగినట్లు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 2019-20 సంవత్సరంతో పోల్చితే 2020-21లో దేశంలో ఎరువుల వినియోగం 10.8 శాతం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా ఎరువులు వాడుతున్నట్లు వెల్లడించింది.2021 ఖరీఫ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో అత్యధికంగా ఎరువులు వినియోగించినట్లు నివేదిక తెలిపింది.



దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో హెక్టార్‌కు 1.14 టన్నుల ఎరువులు వాడినట్లు తెలిపింది. ఆ తర్వాత ఏపీలో హెక్టార్‌కు 0.98 టన్నులు, గుజరాత్‌లో 0.95 టన్నులు వాడినట్లు పేర్కొంది. జార్ఖండ్ రాష్ట్రంలో అత్యల్పంగా హెక్టార్‌కు 0.13 టన్నులే వినియోగించినట్లు తెలిపింది.

2021 ఖరీఫ్‌లో రాష్ట్రాల వారీగా ఎరువులు వినియోగం

రాష్ట్రం	హెక్టార్‌కు వాడిన ఎరువులు (టన్నుల్లో..)
తెలంగాణ	1.14
ఆంధ్రప్రదేశ్	0.98
గుజరాత్	0.95
మహారాష్ట్ర	0.68
తమిళనాడు	0.62
పంజాబ్	0.60
బిహార్	0.58
కర్నాటక	0.56
ఉత్తరప్రదేశ్	0.55
పశ్చిమబెంగాల్	0.52
మధ్యప్రదేశ్	0.41
ఛత్తీస్‌గఢ్	0.37
అస్సాం	0.24
రాజస్థాన్	0.23
ఒడిశా	0.23
జార్ఖండ్	0.13

రేపటి నుంచి కుక్కలకు వ్యాక్సిన్లు

- సెప్టెంబర్ వరకు కార్యక్రమం
- విజయవాడలో సుమారు 30 వేల వీధి కుక్కల గుర్తింపు
- మరో 20 వేల పెంపుడు కుక్కలు
- గ్రామ సింహాల నియంత్రణకు వీఎంసీ చర్యలు



పటమట (విజయవాడ తూర్పు): వీధి కుక్కల నియంత్రణకు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) సిద్ధమవుతోంది. రేపటి (బుధవారం) నుంచి నగరంలో వీధి కుక్కలకు వ్యాక్సిన్లు వేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమం మార్చి 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కుక్కలతో కలిగే ఇబ్బందులు, స్థానికుల ఫిర్యాదులపై కార్పొరేటర్లు సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై ఈ నెల 24న మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ప్రత్యేకంగా సమీక్షించారు. వీధి కుక్కలకు త్వరితగతిన వ్యాక్సిన్లు వేయాలని.. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి వ్యాక్సిన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు నగరంలోని 30 వేల వీధికుక్కలు, 20 వేల పెంపుడు శునకాలకు వ్యాక్సిన్లు వేయాలన్నారు. ఇందు కోసం బృందాన్ని ఏర్పాటు చేశారు.

శివార్ల నుంచే నగరంలోకి రాక..

విజయవాడ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో గ్రామసింహాలు ప్రజలను వణికిస్తున్నాయి. నగర శివారులోని రామవరప్పాడు, కానూరు, గొల్లపూడి, నున్న, అంపాపురం, పాతపాడు, జక్కంపూడి నుంచి కూడా వీధి కుక్కలు నగరంలోకి వస్తున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వీధి కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు విజయవాడలో రోజుకు 30 నుంచి 45 కుక్కలకు మాత్రమే స్టెరిలైజేషన్ ఆపరేషన్ చేస్తున్నారు. ఇక నుంచి ఈ సంఖ్యను రోజుకు 60–70 వరకు పెంచనున్నారు.

వీధి కుక్కల నియంత్రణకు అవగాహన సదస్సులు..

విజయవాడలోని 64 డివిజన్లలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కుక్కల ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి వీధి కుక్కల నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకుని వీధి కుక్కల సంరక్షణ, వాటిపై దాడుల నియంత్రణకు పోస్టర్లు అంటించడం, మాధ్యమాల్లో ప్రచారం చేయాలని కమిషనర్ ఆదేశించారు.

అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాడు అరెస్ట్

- ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగాల పేరిట మోసం ..
- నిందితుడు బీటెక్‌లో యూనివర్సిటీ టాపర్
- వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాడిని వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం నిందితుడి వివరాలను కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు. నిందితుడు పార్ట్‌టైం ఉద్యోగాలు, వివిధ ప్రోడక్టులపై ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశచూపి ప్రాసెసింగ్ ఫీజు, తదితర ఖర్చుల పేరిట ఆన్‌లైన్ ద్వారా నగదును కొల్లగొడుతూ అమాయక ప్రజలను మోసం చేసేవాడు. ఇతను రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రజత్ సక్సేనాగా పోలీసులు తమ విచారణలో కనుగొన్నారు. నిందితుడు బీటెక్‌లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. సైబర్ క్రైమ్ ముఠా ఇచ్చే కమీషన్ కోసం తనకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలు, సాంకేతిక సహకారం అందించాడు. నిందితుడిపై ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్)లో దేశవ్యాప్తంగా 20కి పైగా ఫిర్యాదులు అందాయి. మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. నిందితుడి నుంచి ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్‌లు, 14 బ్యాంక్ డెబిట్, క్రెడిట్, గిఫ్ట్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరి మోసానికి గురైన ఓ బాధితుడు ఇటీవల వైఎస్సార్‌జిల్లా బద్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా బాధితుడు ట్రాన్స్‌ఫర్ చేసిన 10 ఖాతాల్లో 9 ఖాతాలు క్లోజ్ చేసినట్లుగా సైబర్ క్రైమ్ టీం పోలీసులు గుర్తించారు. కేవలం ఒక్క ఖాతా యాక్టివ్‌గా ఉండగా.. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించి..రాజస్థాన్‌లోని సిరోహి జిల్లా, బసంత్‌ఘర్‌కు వెళ్లి రజత్ సక్సేనాను అరెస్ట్ చేశారు. విచారణలో విదేశీయుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులోనే పరారీలో వున్న మరికొంతమందిని సైతం పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

'ఫాక్స్‌లింక్'లో భారీ అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు?
- సురక్షితంగా బయటకొచ్చిన 450 మంది సిబ్బంది
- రూ.70 కోట్లకు పైగానే నష్టం



రేణిగుంట ఫాక్స్‌లింక్ కంపెనీలో అగ్ని ప్రమాదం

రేణిగుంట (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉన్న ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రికల్ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ప్రమాదంతో దట్టమైన పొగతో కూడిన మంటలు క్షణాల్లో వ్యాపించాయి. సంఘటనతో పలువురు స్పృహతప్పి పడిపోవడంతో వారిని హుటాహుటిన రేణిగుంట అమర ఆస్పత్రికి తరలించారు. వివరాలివీ.. రేణిగుంట ఈఎంసీ-1 పరిధిలోనున్న ఫాక్స్‌లింక్ ఇండియా కంపెనీలో చార్జింగ్ వైర్ల విడిభాగాలను అనుసంధానం చేసే అసెంబ్లింగ్ యూనిట్ నడుస్తోంది. దాని ఎదురుగా మరో యూనిట్‌ను కూడా ఉంది. ఇక్కడ మొత్తం 4,400మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక సోమవారం ఉదయం షిఫ్ట్‌లో 450 మంది పనిచేస్తుండగా కంపెనీ రూఫ్ నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. దీంతో కంపెనీలో పనిచేస్తున్న వారిని సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తం చేయడంతో వారంతా సురక్షితంగా బయటకు వచ్చేశారు. ఈ క్రమంలో కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. విషయం తెలుసుకున్న జిల్లా ఫైర్ అధికారి రమణయ్య ఎనిమిది ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలను అదుపుచేసేందుకు కృషిచేశారు. రేణిగుంట విమానాశ్రయానికి చెందిన మరో ఫైర్ ఇంజను సహాయక చర్యల్లో పాల్గొంది. సుమారు మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. మరోవైపు.. ఫ్యాక్టరీ లోపల ముడి సరుకు, చార్జింగ్ కేబుళ్లు, కంప్యూటర్లు, ఫర్నిచర్ అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాద నష్టం రూ.70కోట్లు పైగానే ఉంటుందని ఫ్యాక్టరీ యాజమాన్యం వెల్లడించింది.

- రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 పద్దు ద్వారా జీతాలు, పెన్షన్లు చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

ప్రశ్నపత్రాల లీకేజీ వార్తలను నమ్మొద్దు: సీబీఎస్‌ఈ

న్యూఢిల్లీ: 10, 12వ తరగతి బోర్డ్‌ పరీక్ష పత్రాలు లీకయ్యాయంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ సెకండరీ ఎడ్యుకేషన్‌ (సీబీఎస్‌ఈ) సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులను కోరింది. ఈ పుకార్లకు కారకులని తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పేపర్‌ లీకైందని, 2023 పరీక్షా పత్రాలు అందుబాటులో ఉన్నాయంటూ యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీబీఎస్‌ఈ సభ్యుడొకరు తెలిపారు. 'ఇలాంటి పుకార్లతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజేందుకు కొందరు వ్యక్తులు, సమూహాలు, సంస్థలు పథకం వేస్తున్నాయి. బాధ్యతారాహిత్య చర్యలు, అయోమయం, భయాందోళనలకు పురిగొల్పే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి'అని పేర్కొన్నారు.

ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా ఖుష్బూ

న్యూఢిల్లీ: ప్రముఖ సినీ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూ సుందర్‌(52) జాతీయ మహిళా కమిషన్‌(ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలిగా నియమితులయ్యారు. బీజేపీ జాతీయ ఎగ్జిక్యూటివ్‌ కమిటీ సభ్యురాలైన ఆమె సోమవారం ఈ మేరకు ట్వీట్‌ చేశారు. ఆమెతో పాటు మేఘాలయకు చెందిన డెలినా ఖోంగ్‌డుప్, జార్ఖండ్‌వాసి మమతా కుమారి కూడా ఎన్‌సీడబ్ల్యూకు నామినేట్‌ అయ్యారు. సినీ నటి, నిర్మాత అయిన ఖుష్బూ తొలుత డీఎంకేలో, తర్వాత కాంగ్రెస్‌లో కొనసాగారు. బీజేపీలో చేరి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు.



నీట్‌-పీజీ వాయిదా పిటిషన్లు కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: నీట్‌-పీజీ 2023ను వాయిదా వేయాలన్న పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రిపేరయ్యేందుకు చాలినంత సమయం లేనందున వాయిదా వేయాలని ఇంటర్న్‌షిప్‌ గడువు ముగియనందున కౌన్సిలింగ్‌ ఆగస్ట్‌ 11వ తేదీ తర్వాత చేపట్టాలని పిటిషన్లు కోరారు. దీనిపై సోమవారం జస్టిస్‌ ఎస్‌ఆర్‌ భట్, జస్టిస్‌ దీపాంకర్‌ దత్తాల ధర్మాసనం విచారణ చేపట్టింది. పరీక్ష తేదీ మార్పుకు ఈ దశలో అవకాశం లేదని అదనపు సొలిసిటర్‌ జనరల్‌ ఐశ్వర్య భాటి చెప్పారు. ''తప్పో, ఒప్పో. పరిణామక్రమంలో ఇదంతా ఒక భాగం. ఇది కొన్నిసార్లు కరెక్టు, కొన్నిసార్లు తప్పు కావొచ్చు. మీరెలా అనుకుంటే అలా! పరీక్షను మరోసారి రాయాలనుకునే విద్యార్థిని ఈ ప్రపంచంలో ఏశక్తీ అడ్డుకోజాలదు' అని పేర్కొంటూ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది.

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం రెండో ఏడాదిలోకి చొరబడింది. దురాక్రమణ ప్రయత్నాలు జోరుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఏడాది మారణహోమం తర్వాత కూడా వ్లాదిమిర్‌ వ్లాదిమిరోవిచ్‌ పుతిన్‌ రాజ్యకాంక్ష ఏమాత్రం చల్లారలేదు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా ఉక్రెయిన్‌పై ఉరుకులు పరుగుల మీద విరుచుకుపడ్డ రష్యాకు, తన అస్త్రాలేవీ పనికిరాకుండా పోయాయని జ్ఞానోదయం కలగడానికి ఎంతోసేపు పట్టలేదు. బాహుబలిగా కాలుదువ్విన పుతిన్‌ ఏడాది తిరిగేసరికి ప్రపంచం దృష్టిలో విలన్‌ అయ్యారు. సొంత ప్రజల దృష్టిలోనూ బాహుబలి హోదాను ఒకింత కోల్పోయారు. ఇంతకీ పుతిన్‌ ఊహించినదేమిటి? ఆయనకు ఎదురైందేమిటి...?



అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి!

పుతిన్‌కు శిరోభారంగా యుద్ధం

వికటిస్తున్న దుస్సాహసం
ఇమేజీకి ఇంటాబయటా డ్యామేజీ
అధ్యక్ష ఎన్నికల్లో విజయంపై కన్ను
యుద్ధాన్ని అప్పటిదాకా సాగదీసే యత్నం

ఎస్‌ రాజమహేంద్రారెడ్డి

పూర్వపు సోవియట్‌ యూనియన్‌ రిపబ్లిక్కులన్నింటినీ మళ్లీ ఒకే తాటిమీదకు తేవాలన్నది తన లక్ష్యమని పుతిన్‌ చెప్పుకుంటారు. పొరుగు దేశాలైన ఉక్రెయిన్, బెలారస్‌ కూడా ఒకప్పుడు రష్యాలో అంతర్భాగమేనని అంటారాయన. రెండేళ్ల క్రితం ఆయన రాసిన ఓ సుదీర్ఘ వ్యాసంలో కూడా ఈ విషయాన్ని సుస్పష్టం చేశారు. బెలారస్‌తో రష్యాకు ఎలాంటి విభేదాలూ లేవు. పైగా ఉక్రెయిన్‌పై దాడిలో రష్యాకు ఆదినుంచీ అది వెన్నుదన్నుగా ఉంది. రష్యా తొలుత ఉక్రెయిన్‌లో చొరబడేందుకు తన భూభాగాన్ని అనుమతించింది కూడా. ఎటొచ్చీ పుతిన్‌కు పేచీ అల్లా ఉక్రెయిన్‌తోనే! ఆ దేశ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి కూడా రష్యా ఎన్నడూ ఇష్టపడలేదు. రష్యా, ఉక్రెయిన్‌ ఒకే దేశమన్నదే పుతిన్‌ గట్టి నమ్మకం.

లోగుట్టు వేరే

నిగూఢంగా చూస్తే మాత్రం, ఈ గొడవంతా పైపై పటారమే. అసలు విషయం ఏమిటంటే సుదీర్ఘ కాలం పాటు రష్యాకు తిరుగులేని నాయకునిగా వెలిగిపోవాలన్నది పుతిన్‌లో అంతర్లీనంగా ఉన్న ఆశగా చెప్తారు. మూడేళ్ల క్రితం ఆయన ఆ దిశగా ప్రయత్నం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణతో రాజ్యాంగాన్ని మార్చి అధ్యక్షునిగా 16 ఏళ్లపాటు నిరాటంకంగా కొనసాగేలా కొత్త చట్టం తెచ్చేందుకు క్రెమ్లిన్‌ ప్రయత్నించింది. ఆ సమయంలో రష్యా టీవీ పుతిన్‌ కీర్తనలు, గుణగానాలతో హోరెత్తేది. 'కల్లోల సాగరంలాంటి ప్రపంచంలో రష్యా నౌకను సమర్థంగా నడిపిస్తున్న కెప్టెన్‌ పుతిన్‌' అంటూ ఊదరగొట్టేవారు. క్రెమ్లిన్‌ దృష్టిలో పుతిన్‌ సకల కళావల్లభుడు, సకలశాస్త్ర పారంగతుడు. అందుకే జూడో, రేసింగ్, స్విమ్మింగ్, హార్స్‌ రైడింగ్‌ విన్యాసాల్లో పుతిన్‌ సాహసకృత్యాల తాలూకు ఫొటోలను తరచూ ప్రపంచం ముందుకు తెస్తూంటుంది క్రెమ్లిన్‌. రష్యా ప్రజలను ప్రభావితం చేసి పుతిన్‌ పట్ల ఆరాధనా భావాన్ని పెంపొందించే ప్రయత్నాల్లో క్రెమ్లిన్‌ ఎంచుకున్న మార్గమిది. అసలు విషయమేమిటంటే 2024లో రష్యా అధ్యక్ష ఎన్నికలున్నాయి. ఆలోపు ఏదో ఒక ఘనకార్యం చేసి పుతిన్‌ కీర్తిని అమాంతం పెంచేయడం క్రెమ్లిన్‌ లక్ష్యం. పశ్చిమ దేశాల కనుసన్నల్లో సాగుతున్న ఉక్రెయిన్‌ను ఓ దారికి తెస్తే బాహుబలి పుతిన్‌ సత్తా ఏమిటో తెలుస్తుందని, అధ్యక్ష ఎన్నికల్లో మంచి ప్రచారాస్త్రంగా మారుతుందని క్రెమ్లిన్‌ థింక్‌టాంక్‌ అంచనా. అనుకున్నదే తడవుగా దాడికి దిగడం, ఆరంభంలో కొన్ని ప్రాంతాను ఆక్రమించి ఎగిరి గంతెయ్యడం... తర్వాత ఉక్రెయిన్‌ధాటికి తట్టుకోలేక వాటిని వదిలేసి తోకముడవడం చకచకా జరిగిపోయాయి. అయినా సరే, ఇప్పటికీ ఉక్రెయిన్‌పై దాడిని తప్పుగా పుతిన్‌ అంగీకరించడం లేదు. రెండు మూడు రోజుల క్రితం మాట్లాడుతూ ఇదంతా పశ్చిమ దేశాల కుట్రేనని సెలవిచ్చారు! దానికి జవాబుగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ ఏకంగా ఉక్రెయిన్‌ యుద్ధభూమిలో అడుగుపెట్టారు! ఈ పోరులో తమ వైఖరిని మరోసారి కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్‌ను గెలవడం రష్యా తరం కాదని అక్కడే మీడియాముఖంగా ప్రకటించేశారు. బహుశా పుతిన్‌ కూడా ఇలాంటి సవాలు కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు! ఏదోలా వచ్చే ఏడాది రష్యా అధ్యక్ష ఎన్నికల దాకా యుద్ధం కొనసాగాలన్నదే ఆయన అభిమతమని పరిశీలకుల అంచనా. యుద్ధం సమాధుల మీద 2024 అధ్యక్ష ఎన్నికలను నెగ్గాలని పుతిన్‌ భావిస్తున్నట్టు చెబుతున్నారు.

ఆపద్ధర్మ పాత్రతో మొదలై...

1999లో బోరిస్‌ యెల్ట్సిన్‌ ఆకస్మిక రాజీనామాతో ఆపద్ధర్మ అధ్యక్షునిగా తొలిసారి గద్దెనెక్కిన పుతిన్‌ 2000–2004, 2004–08ల్లో రెండు దఫాలుగా అధ్యక్షునిగా కొనసాగారు. అప్పట్లో రష్యా అధ్యక్ష పదవీకాలం నాలుగేళ్లే. తర్వాత 2008 నుంచి 2012 దాకా ఆయన ప్రధానిగా ఉన్నారు. ఈ దశలో రాజ్యాంగ సవరణల ద్వారా అధ్యక్ష పదవీకాలాన్ని ఆరేళ్లకు పెంచారు. తర్వాత 2012 నుంచి 2018 దాకా, 2018 నుంచి ఇప్పటిదాకా పుతిన్‌ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. 2024 మార్చితో పదవీకాలం ముగుస్తుంది. ఒక వ్యక్తి వరుసగా రెండుసార్లకు మించి అధ్యక్షునిగా ఉండరాదన్న నిబంధనను కూడా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చారు. ఫలితంగా 2024తో పాటు 2030 ఎన్నికల్లోనూ పోటీ చేసే అవకాశం పుతిన్‌కు సంక్రమించింది. ఈ రెండుసార్లూ గెలిస్తే 2036 దాకా ఆయనే రష్యా అధినేతగా చక్రం తిప్పుతారు. అలా ఒకే దెబ్బకు రెండు పిట్టల్లా ఒకే యుద్ధంతో అటు రాజ్యకాంక్షను, ఇటు పదవీకాంక్షనూ నెరవేర్చుకోవాలని పుతిన్‌ పట్టుదలగా ఉన్నారు. అందుకే యుద్ధానికి ఇప్పుడప్పట్లో ముగింపు పలికేందుకు ససేమిరా అంటున్నారు. యుద్ధంలో వెనకబడుతున్నట్టు అన్పించినప్పుడల్లా అణ్వాయుధ బూచితో ప్రపంచాన్ని బెదిరిస్తున్నారు. అటు ఉక్రెయిన్‌ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా అమెరికా మద్దతుతో లొంగేది లేదంటూ దీటుగా తలపడుతున్నారు. చివరికి గెలుపెవరిదైనా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం మాత్రం వైరి వర్గాలు రెండింటినీ వెంటాడుతూనే ఉంటాయి. చరిత్ర చెక్కిలిపై యుద్ధం ఎప్పుడూ ఓ కన్నీటి బిందువే! చెరిగిపోని మచ్చే!!

కొసమెరుపు

ఏడాది యుద్ధం బాహుబలిగా వ్లాదిమిర్‌ పుతిన్‌కున్న పేరుప్రతిష్టలను బలి తీసుకుంటే, పూర్వాశ్రమంలో సినిమాల్లో కమేడియన్‌ పాత్రలు పోషించిన వొలోదిమిర్‌ జెలెన్‌స్కీని మాత్రం నిజజీవితంలో హీరోను చేసింది!

సిసోడియాకు 5 రోజుల సీబీఐ కస్టడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానం కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్‌ సిసోడియాను సీబీఐ ఐదు రోజులపాటు కస్టడీకి తీసుకుంది. ఆదివారం ఎనిమిదిగంటలపాటు ప్రశ్నించాక ఆయనను అరెస్టు చేయడం తెలిసిందే. సోమవారం ఢిల్లీలోని రౌజ్‌ అవెన్యూ ప్రత్యేక కోర్టులో జడ్జి ఎంకే నాగ్‌పాల్‌ ఎదుట హాజరుపరిచింది. 'మద్యం విధానాలు, అమలులో సిసోడియా స్వయంగా నిర్ణయాలు తీసుకున్నట్లు సాక్ష్యాలున్నాయి. కానీ ఆయన పూర్తి విరుద్ధమైన, దాటవేసే ధోరణిలో సమాధానాలు చెప్తున్నారు. దర్యాప్తు సాగాలంటే ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సి ఉంది. అందుకు అనుమతించండి' అని సీబీఐ న్యాయవాదులు కోరారు. సిసోడియా తరపు లాయర్లు దీన్ని వ్యతిరేకించారు. 'ఇది కక్షపూరిత కేసు. సిసోడియాకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లేవు. మద్యం విధానంలో లెఫ్టినెంట్‌ గవర్నర్‌ మార్పులుచేస్తే ఆప్‌ ప్రభుత్వంపై సీబీఐ దృష్టిపెట్టింది'' అని వాదించారు. తర్వాత సిసోడియాను ఐదు రోజుల సీబీఐ కస్టడీకిస్తూ జడ్జి నాగ్‌పాల్‌ ఉత్తర్వులు జారీచేశారు.

ఢిల్లీసహా పలు రాష్ట్రాల్లో ఆప్‌ నిరసనల సెగ

సిసోడియా అరెస్టుపై ఆప్‌ శ్రేణులు పలు రాష్ట్రాల్లో ఆందోళనలకు దిగాయి. ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, జమ్మూకశ్మీర్, బిహార్, గోవాల్లో కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. కేంద్రం దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. చండీగఢ్‌లో మంత్రి హర్పాల్‌ సింగ్‌ చీనా, మరో మంత్రిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టు సీబీఐ అధికారులకే ఇష్టం లేదు: కేజ్రీవాల్‌

సిసోడియాను అరెస్ట్‌చేయడం సీబీఐలోనే చాలామంది అధికారులకు ఇష్టం లేదని ఢిల్లీ సీఎం అరవింద్‌ కేజ్రీవాల్‌ అన్నారు. అరెస్టును కేరళ, జార్ఖండ్‌ సీఎంలు పినరయి విజయన్, హేమంత్‌ సోరెన్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్‌ అఖిలేశ్‌ యాదవ్‌ తదితరులు తప్పుబట్టారు. ఆప్‌వి వీధి రాజకీయాలని బీజేపీ ఆరోపించింది.

అతి సమీపానికి గురుశుక్రులు

న్యూయార్క్‌: గురు, శుక్ర గ్రహాలు పరస్పరం అత్యంత సమీపానికి రానున్నాయి. ఈ అరుదైన ఘటన మార్చి 1వ తేదీన కనువిందు చేయనుంది. ఆ రాత్రి భూమి నుంచి చూస్తే అవి రెండూ దాదాపు ఒకదాన్నొకటి ఆనుకున్నంత దగ్గరగా కన్పిస్తాయి! నిజానికవి ఎప్పట్లాగే పరస్పరం కొన్ని లక్షల కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయి. కాకపోతే సూర్యుని చుట్టూ వాటి పరిభ్రమణ క్రమంలో భాగంగా భూమి నుంచి చూసేవాళ్లకు మాత్రం ఆ రోజు పరస్పరం అత్యంత దగ్గరగా వచ్చినట్టు కన్పిస్తాయన్నమాట. దీన్ని మామూలు కళ్లతోనే చూడొచ్చు. సౌరమండలంలో సూర్యచంద్రుల తర్వాత అత్యంత ప్రకాశవంతమైనది శుక్రుడే. భూమికి అత్యంత సమీపంలో ఉండటంతో అప్పుడప్పుడూ పగటి పూటా కనిపిస్తుంటుంది!



3,500 ఏళ్ల నాటి ఎలుగు కళేబరం...

చెక్కుచెదరని స్థితిలో దొరికింది!

మాస్కో: దాదాపుగా 3,500 ఏళ్ల నాటి ఎలుగుబంటి కళేబరం ఏమాత్రం చెక్కుచెదరని స్థితిలో దొరికి సైంటిస్టులను సంభ్రమాశ్చర్యాలకు లోను చేసింది. అది పూర్తిగా అతిశీతల వాతావరణంలో మంచులో కూరుకుపోవడమే ఇందుకు కారణం. రష్యాలో మాస్కోకు 4,600 కిలోమీటర్ల దూరంలో న్యూ సైబీరియన్‌ ఆర్చిపెలాగోలో భాగమైన బొల్షోయ్‌ ల్యాఖ్లోవ్‌స్కీ ద్వీపంలో జింకల వేటగాళ్లు దీన్ని 2020లో గుర్తించారు. ''అది ఆడ ఎలుగుబంటి. గోధుమ రంగుతో, 1.55 మీటర్ల ఎత్తు, దాదాపు 78 కిలోల బరువుంది. చనిపోయేనాటికి బహుశా మూడేళ్ల వయసుంటుంది'' అని తూర్పు సైబీరియాలోని లజరేవ్‌ మామూత్‌ మ్యూజియం లేబొరేటరీ చీఫ్‌ మాక్సిం చెప్రసోవ్‌ అంచనా వేశారు. ఆయన సారథ్యంలోని సైంటిస్టుల బృందం దానికి శవపరీక్ష జరిపింది. ''దాని ఒంట్లోని అతి మృదువైన కణజాలం కూడా గులాబి రంగులో ఇప్పటికీ ఏమాత్రం పాడవకుండా ఉండటం నిజంగా అద్భుతం. అలాగే పసుపు రంగులోని కొవ్వు కూడా. అంతేగాక దాని చివరి తిండి తాలూకు పక్షి ఈకలు, మొక్కలు కూడా పొట్టలో అలాగే ఉన్నాయి. అంత పురాతన కాలపు జంతువు తాలూకు కళేబరం ఇంత చక్కని స్థితిలో పరిపూర్ణంగా దొరకడం ఇదే తొలిసారి'' అని పేర్కొంది. దాని మెదడు, అంతర్గత అవయవాలను కోసి లోతుగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా కణజాల, సూక్ష్మజీవ, జన్యుపరమైన పరీక్షల్లో తలమునకలుగా ఉన్నారట.



అందరికీ విమానయోగం

త్వరలో స్వదేశీ విమానాలు: మోదీ ● బెల్గావీలో భారీ రోడ్‌ షో



బెల్గావీలో ర్యాలీలో మద్దతుదారులకు మోదీ అభివాదం

శివమొగ్గ/బెల్గావీ: ''హవాయి చెప్పులేసుకునే సామాన్యులు కూడా హవాయీ జహాజ్‌ (విమాన) ప్రయాణం చేయగలగాలి. ఆ కల ఇప్పుడు నిజమవుతోంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆయన సోమవారం కర్నాటకలోని శివమొగ్గలో నూతన విమానాశ్రయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. భారత వైమానిక రంగం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. ''మున్ముందు మనకు వేలాది విమానాలు అవసరమవుతాయి. వాటిని ప్రస్తుతానికి దిగుమతి చేసుకుంటున్నా భారత్‌లోనే తయారు చేసే రోజు ఎంతో దూరంలో లేదు. అప్పుడు మనమంతా దర్జాగా మేడిన్‌ ఇండియా విమానాల్లోనే ప్రయాణిస్తాం'' అని చెప్పుకొచ్చారు. చిన్న నగరాలు, పట్టణాల్లోనూ విమానాశ్రయాల నిర్మాణంతో బీజేపీ ప్రభుత్వం విమానయానాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిందని మోదీ చెప్పారు. 2014 దాకా దేశంలో మొత్తం 74 విమానాశ్రయాలుంటే గత తొమ్మిదేళ్లలోనే తాము మరో 74 కొత్త విమానాశ్రయాలు నిర్మించామన్నారు. కాంగ్రెస్‌ పాలనపై మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. ''2014కు ముందు ఎయిరిండియాను నష్టాలు, కుంభకోణాల సంస్థగా చూసే పరిస్థితి ఉండేది. నేడు అలాంటి సంస్థ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. నూతన భారతదేశానికి ప్రతీకగా విజయపుటంచులు చూస్తోంది'' అన్నారు. రూ.3,600 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. శివమొగ్గ జిల్లాకే చెందిన కర్నాటక మాజీ సీఎం, బీజేపీ అగ్ర నేత బి.ఎస్‌.యడియూరప్ప సోమవారం 80వ పుట్టినరోజు జరుపుకున్నారు. దాంతో సభికులంతా మొబైల్‌ ఫ్లాష్‌ లైట్లు ఆన్‌ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలపాల్సిందిగా మోదీ కోరారు. ఆయన జీవితమంతా ప్రజా సేవకు అంకితం చేశారని, రాజకీయ నాయకులందరికీ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. డబుల్‌ ఇంజన్‌ సర్కారుకే మరో అవకాశమివ్వాలని కర్నాటక ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చారన్నారు. అనంతరం బెల్గావీలో మోదీ భారీ రోడ్‌ షో నిర్వహించారు. ప్రజలకు కారులో నుంచుని అభివాదం చేస్తూ సాగారు. అభివృద్ధి చేసిన బెల్గావీ రైల్వేస్టేషన్‌ భవనాన్ని, రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. 8 కోట్ల మంది రైతులకు ప్రధాన్‌మంత్రీ కిసాన్‌ సమ్మాన్‌ నిధి (పీఎంకిసాన్‌) పథకంలో 13వ విడతగా రూ.16 వేల కోట్ల నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో విడుదల చేశారు. సీఎం బసవరాజ్‌ బొమ్మైతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేపాల్‌ ప్రభుత్వంలో కుదుపు

కాఠ్మాండు: వచ్చే నెలలో జరగబోయే నేపాల్‌ అధ్యక్ష ఎన్నికల్లో అధికార కూటమి పార్టీ సీపీఎన్‌-యూఎంఎల్‌ బలపరిచిన అభ్యర్థినికాకుండా అధికార కూటమిలోలేని వేరొక పార్టీ అభ్యర్థికి ప్రధాని ప్రచండ మద్దతు పలకడం సీపీఎన్‌-యూఎంఎల్‌కు ఆగ్రహం తెప్పించింది. దీంతో ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ఆ పార్టీ సోమవారం ప్రకటించింది. ఆ పార్టీకి చెందిన నేతలైన ఉపప్రధాని, ఆర్థికమంత్రి బిష్ణు పౌద్యాల్, విదేశాంగ మంత్రి తమ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించారు. దీంతో రెండు నెలల క్రితమే ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం కూలే అవకాశాలు ఎక్కువయ్యాయి. విపక్ష నేపాలీ కాంగ్రెస్‌ పార్టీకి చెందిన రామచంద్ర పౌద్యాల్‌కు గత శనివారం ఎనిమిది రాజకీయ పార్టీలు సమ్మతి తెలపడం, అధికారకూటమిలోని నేషనల్‌ డెమొక్రటిక్‌ పార్టీ.. ప్రభుత్వం నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం, ఉపప్రధాని పదవికి రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ చైర్మన్‌ రాజేంద్ర ప్రసాద్‌ లింగ్డెన్‌ రాజీనామాచేయడం తెల్సిందే. సీపీఎం-యూఎంఎల్‌ మద్దతులేకున్నా పార్లమెంట్‌లో 89 మంది సభ్యులున్న నేషనల్‌ కాంగ్రెస్‌ పార్టీతో విశ్వాసతీర్మానాన్ని ప్రచండ సర్కార్‌ గట్టెక్కే వీలుంది. గత డిసెంబర్‌లో 7 పార్టీల కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అధికార కూటమి పార్టీలు మద్దతు ఉపసంహరిస్తే ప్రధాని ప్రచండ నెలరోజుల్లోపు పార్లమెంట్‌లో విశ్వాసపరీక్షలో నెగ్గాలి.

నాగాలాండ్, త్రిపురల్లో బీజేపీ

మేఘాలయలో హంగ్‌ ● పెద్ద పార్టీగా ఎన్‌పీపీ ● ఎగ్జిట్‌ పోల్స్‌ అంచనా

న్యూఢిల్లీ: ఈశాన్యాన మళ్లీ కమల వికాసమేనని ఎగ్జిట్‌ పోల్స్‌ అంచనా వేశాయి. తాజాగా ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో నాగాలాండ్, త్రిపురల్లో మళ్లీ బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని, మేఘాలయలో హంగ్‌ తప్పదని జోస్యం చెప్పాయి. అక్కడ అధికార ఎన్‌పీపీ మరోసారి ఏకైక పెద్ద పార్టీగా నిలుస్తుందని చెప్పాయి. త్రిపురలో ఎన్నో ఆశలతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, లెఫ్ట్‌ పార్టీలను కొత్త పార్టీ టిప్రా మోర్చా గట్టి దెబ్బ కొట్టనుంది. అధికార బీజేపీ జైత్రయాత్రకూ అది కాస్త అడ్డుకట్ట వేసిందని ఎగ్జిట్‌ పోల్స్‌ అంచనా. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయల్లో సోమవారం పోలింగ్‌ పూర్తయింది.

నాగాలాండ్‌లో 83%, మేఘాలయలో 75% ఓటింగ్‌

షిల్లాంగ్‌/కోహిమా: నాగాలాండ్‌లో ఓటర్లు పోటెత్తారు. దాంతో సోమవారం జరిగిన పోలింగ్‌లో మధ్యాహ్నం మూడింటికే 83.63% ఓటింగ్‌ నమోదైంది! ఇక మేఘాలయలో సాయంత్రం ఐదింటికల్లా 75% ఓటింగ్‌ నమోదైంది. పోలింగ్‌ కేంద్రాల వద్ద భారీగా క్యూలు ఉండటంతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటింగ్‌ శాతం మరింత పెరగనుంది. రెండు అసెంబ్లీల్లోనూ 60 స్థానాలకు గాను 59 సీట్లకు పోలింగ్‌ జరిగింది. కొన్ని బూత్‌ల్లో ఈవీఎంలతో సమస్య తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కరించారు.



మేఘాలయలోని రిభోయ్‌ జిల్లాలో ఓటేసిన మహిళలు

మేఘాలయ రాష్ట్రంలో ఈసారి హంగ్‌ తప్పకపోవచ్చని అన్ని ఎగ్జిట్‌ పోల్సూ చెప్పడం విశేషం! అధికార ఎన్‌పీపీకి 18 నుంచి 26 సీట్లకు మించకపోవచ్చని అవి పేర్కొన్నాయి. ఇక బీజేపీకి దక్కుతున్నది 4 నుంచి గరిష్ఠంగా 11 స్థానాలే. కాంగ్రెస్‌దీ అదే పరిస్థితి కాగా తృణమూల్‌కు మాత్రం ఎగ్జిట్‌ పోల్స్‌ 5 నుంచి 13 స్థానాల దాకా ఇచ్చాయి. యూడీపీకి ఇండియాటుడే, టైమ్స్‌ నౌ రెండూ 8 నుంచి 14 సీట్లిచ్చాయి.

మొత్తం స్థానాలు 60 (మెజార్టీ మార్క్‌ 31)

పార్టీ	ఇండియాటుడే	టైమ్స్‌ నౌ	జీ న్యూస్‌
ఎన్‌పీపీ	18-24	18-26	21-26
కాంగ్రెస్‌	6-12	2-5	3-6
బీజేపీ	4-8	3-6	6-11
టీఎంసీ	5-9	8-14	8-13
యూడీపీ	8-12	8-14	--
ఇతరులు	4-8	0-2	10-19

నాగాలాండ్ రాష్ట్రంలో ఎన్‌డీపీపీ-బీజేపీ కూటమి అధికారాన్ని నిలుపుకోనుందని ఎగ్జిట్‌ పోల్స్‌ ముక్త కంఠంతో పేర్కొన్నాయి. ఎన్‌డీపీపీకి 28–34 సీట్లు, బీజేపీకి 10 నుంచి 14 వస్తాయని ఇండియాటుడే అంచనా వేసింది. ఎన్‌పీఎఫ్‌కు 3 నుంచి 8 సీట్లు వస్తుండగా కాంగ్రెస్‌ 2 సీట్లకు పరిమితమవుతుందని పేర్కొంది. టైమ్స్‌ నౌ కూడా ఎన్‌డీపీపీకి 27–33 సీట్లు, బీజేపీకి 12–16 ఇవ్వగా ఎన్‌పీఎఫ్‌కు 6 సీట్లతో సరిపెట్టింది.

మొత్తం స్థానాలు 60 (మెజార్టీ మార్క్‌ 31)

పార్టీ	ఇండియాటుడే	టైమ్స్‌ నౌ	జీ న్యూస్‌
బీజేపీ కూటమి	38-48	39-49	35-43
ఎన్‌పీఎఫ్‌	3-8	4-8	2-5
కాంగ్రెస్‌	1-2	0	1-3
ఇతరులు	5-15	9	6-12

త్రిపుర పాతికేళ్ల సీపీఎం కూటమి జైత్రయాత్రకు అడ్డుకట్ట వేస్తూ 2018లో బీజేపీ ఏకంగా 36 సీట్లతో మెజారిటీ సాధించి ఆశ్చర్యపరిచింది. దాంతో ఈసారి బీజేపీని ఎలాగైనా అడ్డుకునేందుకు సీపీఎం కూటమి తన చిరకాల ప్రత్యర్థి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. కానీ వాటి అవకాశాలకు కొత్తగా వచ్చిన టిప్రా మోతా భారీగా గండి కొట్టనుందని ఎగ్జిట్‌ పోల్స్‌ చెబుతున్నాయి. మోతా 9 నుంచి 16 సీట్లు దాకా గెలుచుకుంటుందని అంచనా వేశాయి. బీజేపీ మళ్లీ మెజారిటీ సాధిస్తుందని ఇండియాటుడే, జీ న్యూస్‌ అభిప్రాయపడగా 24 సీట్లకు పరిమితం కావచ్చని టైమ్స్‌ నౌ పేర్కొంది. కాంగ్రెస్‌-సీపీఎం కూటమికి ఏ ఎగ్జిట్‌ పోల్‌లోనూ గరిష్ఠంగా 21 సీట్లు దాటలేదు. బీజేపీకి 45 శాతం ఓట్లు రావచ్చని ఇండియాటుడే అంచనా వేసింది. లెఫ్ట్‌-కాంగ్రెస్‌ కూటమికి 32 శాతం, టిప్రా మోతాకు 20 శాతం వస్తాయని పేర్కొంది. హంగ్‌ నెలకొనే పక్షంలో ప్రత్యేక టిప్రా లాండ్‌ డిమాండ్‌కు జైకొట్టే పార్టీకే మద్దతిస్తామని టిప్రా మోతా అధ్యక్షుడు ప్రద్యోత్‌ కిశోర్‌ మాణిక్య దేవ్‌ బర్మ ఇప్పటికే ప్రకటించారు.

మొత్తం స్థానాలు 60 (మెజార్టీ మార్క్‌ 31)

పార్టీ	ఇండియాటుడే	టైమ్స్‌ నౌ	జీ న్యూస్‌
బీజేపీ కూటమి	36-45	24	29-36
కాంగ్రెస్‌-లెఫ్ట్‌	6-11	21	13-21
టిప్రా మోతా	9-16	14	11-16
ఇతరులు	0	1	0-3

దేశం కోసమే అగ్నిపథ్‌: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సైనిక దళాల్లో నియామకాల కోసం కేంద్రం తెచ్చిన అగ్నిపథ్‌ పథకాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. జాతీయ ప్రయోజనాల కోసం, జాతి భద్రత అనే ఉన్నతమైన ఆశయం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన పథకమని పేర్కొంది. అన్ని కోణాల్లోనూ యోచించి తీసుకున్న ఇటువంటి విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ సతీశ్‌ చంద్ర శర్మ, జస్టిస్‌ సుబ్రమణియమ్‌ల ధర్మాసనం తెలిపింది. అగ్నిపథ్‌ పథకాన్ని, నియామక ప్రక్రియకు అర్హులు కారంటూ కొందరిని మినహాయించడాన్ని సవాల్‌ చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా ధర్మాసనం కొట్టివేసింది. అటువంటి వారికి సైన్యం చేరేందుకు అర్హత లేదని ధర్మాసనం పేర్కొంది. ఒకే రకమైన విధులు చేపట్టే 'అగ్నివీర్‌'లు, సిపాయిలకు మధ్య వేర్వేరు వేతన స్కేళ్లు ఎందుకని కేంద్రాన్ని ప్రశ్నించింది. 'ఆర్మీలో చేరికలు స్వచ్ఛంగానే జరుగుతాయి. ఇందులో ఎటువంటి బలవంతం లేదు. దీనివల్ల హక్కులకు ఎలా భంగం కలుగుతోంది?' అని పిటిషనర్లను ధర్మాసనం అడిగింది.

'ఈడీ చీఫ్‌ పొడిగింపు'పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌(ఈడీ) డైరెక్టర్‌ సంజయ్‌ కుమార్‌ మిశ్రా పదవీ కాలాన్ని కేంద్రం మూడు విడతలుగా పొడిగించడాన్ని సవాల్‌ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మార్చి 21న విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. ఇందుకు సంబంధించి కాంగ్రెస్‌ నేతలు రణ్‌దీప్‌ సింగ్‌ సూర్జేవాలా, జయా ఠాకూర్, టీఎంసీ నేత మహువా మొయిత్రా వేసిన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు డిసెంబర్‌లో కేంద్రం, ఈడీ, సీవీసీలకు నోటీసులు జారీ చేసింది. దీనిపై సోమవారం జస్టిస్‌ బీఆర్‌ గవాయ్, జస్టిస్‌ అరవింద్‌ కుమార్‌ ధర్మాసనం విచారణ జరిపింది.

పడవ మునక ఘటనలో 62కు చేరిన మృతులు

రోమ్‌: ఇటలీలోని కలబ్రియన్‌ తీరంలో వలసదారుల పడవ మునక ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 62కు చేరుకుంది. సుమారు 170 మంది వలసదారులతో తుర్కియేలోని ఇజ్మిర్‌ తీరం నుంచి అయోనియన్‌ సముద్ర జలాల్లో ప్రవేశించిన చెక్క పడవ అలల తాకిడికి ముక్కలు చెక్కలైంది. ఇటలీ తీర రక్షణ బృందాలు గమనించి అందులోని సుమారు 80 మందిని కాపాడాయి. సోమవారం వరకు 62 మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు. మిగతా వారి జాడ కోసం గాలింపు కొనసాగుతోంది.

మొండి బకాయి రాబట్టింది!

చాట్‌జీపీటీ మరో ఘనత

వాషింగ్టన్‌: కృత్రిమ మేథ అందుబాటులోకి వచ్చాక ఎన్నో పనులు అత్యంత వేగంగా, ఖచ్చితత్వంతో జరిగిపోతున్నాయి. చాట్‌బాట్‌లలో దూసుకుపోతున్న చాట్‌జీపీటీ కొత్త మరో ఘనత సాధించింది. ఒక డిజైనింగ్‌ సంస్థకు క్లయింట్‌ నుంచి రావాల్సిన దాదాపు రూ.90లక్షల(1,09,500 డాలర్లు) మొండి బకాయిని రాబట్టింది. అమెరికాకు చెందిన ఒక డిజైనింగ్‌ సంస్థకు సీఈవో అయిన గ్రెగ్‌ ఐసన్‌బర్గ్‌ అనే వ్యక్తి తనకు చాట్‌జీపీటీ ఎలా సాయపడిందనే విషయాన్ని సంతోషంతో ట్విట్టర్‌లో షేర్‌చేశారు. '' గత ఏడాది ఒక ప్రముఖ బ్రాండ్‌కు డిజైన్లు చేసి ఇచ్చాం. అవి వారికి నచ్చాయి. అంతా సవ్యంగా సాగుతోందనే సమయానికి హఠాత్తుగా అటు నుంచి సంప్రదింపులు ఆగిపోయాయి. ఏం జరిగిందని కనుక్కుందామని సమాధానం లేదు. చేసిన డిజైనింగ్‌ పనికి డబ్బులు అడిగితే రిప్లై లేదు. ఐదుసార్లు మెయిల్‌ పెట్టినా ఇలుకూపలుకూ లేదు. ఐదు నెలలు గడిచిపోయాయి. 'ఇక లాభం లేదు. లాయర్ల ద్వారా చట్టప్రకారం ముందుకెళ్దాం' అని నా కింది ఉద్యోగులు నాకు సలహా ఇచ్చారు. చాట్‌బాట్‌ల హవా కొనసాగుతోంది. ఒకసారి చాట్‌జీపీటీతో ప్రయత్నిద్దామని నిర్ణయించుకుని వివరాలను పొందుపరిచా. క్లయింట్‌ను బెదిరిస్తూనే చక్కని దౌత్యం నెరిపేలా ఒక మెయిల్‌ను సిద్ధంచేసి ఇచ్చింది. దానికి చిన్నపాటి నా సొంత మార్పులు చేసి క్లయింట్‌కు పంపించాను. అద్భుతం. కేవలం రెండు నిమిషాల్లోనే అటు నుంచి స్పందన వచ్చింది. 'బాకీ పడిన సొమ్మును చెల్లిస్తున్నాం. చూసుకోండి'' అంటూ సమాధానమొచ్చింది. నా డబ్బొ వచ్చింది'' అని ట్విట్టర్‌లో ఐసన్‌బర్గ్‌ తెగ సంబరపడ్డాడు. భవిష్యత్తులో సంస్థల వ్యాపార లావాదేవీలు ఇలా ఆటోమేషన్‌ అవుతాయని అభిప్రాయపడ్డాడు.



క్రీడలకు ప్రోత్సాహం

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు.

-8లో▸



సామాన్య భక్తులే అజెండా

ఇంద్రకీలాద్రి: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ పాలక మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

పెద్దింట్లమ్మకు పంచహారతులు



కైకలూరు: పెద్దింట్లమ్మ జాతర సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. సోమవారం పెద్దింట్లమ్మకు పష్పావరణ కలశార్చన, వివేషార్చన, పుష్పాలంకరణ, దీప ధూప సేవ, హారతులు నిర్వహించారు.

న్యూస్‌రీల్

కూచిపూడి నాట్య పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో మాస్టర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎంపీఏ) మొదటి సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు ఎగ్జామినర్‌గా డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం వ్యవహరించగా.. కళాపీఠం ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగ శాస్త్రి పర్యవేక్షించారు. 12 మంది విద్యార్థులు హాజరైన ఈ ప్రాక్టికల్ పరీక్షలకు నట్టువాంగంపై డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, గాత్రంపై వేదాంతం వెంకట దుర్గా భవాని, మృదంగంపై పసుమర్తి హరినాథ శాస్త్రి సహకరించారు.

నేడు జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు మంగళవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి అధికారి డాక్టర్ పీవీ.రమేష్ కుమార్ తెలిపారు. రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఐదు ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని వారి కంపెనీల్లోని 370 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఫార్మసీ, బీటెక్ విద్యార్హతలు ఉన్న వారు ఈ పోస్టులకు అర్హులని చెప్పారు. ఇతర వివరాలకు 80087 42842, 90326 335548లో సంప్రదించాల్సిందిగా కోరారు.

నేటి నుంచి స్తోత్ర పఠనలో శిక్షణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి స్తోత్ర పఠన తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రోగామ్ అసిస్టెంట్ సీపీ కె. ప్రసాద్ తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బాల బాలికలలో భక్తి భావం పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని 32 కేంద్రాలలో ప్రతి ఆదివారం ఉదయం ఒక గంటసేపు సంవత్సరం పాటు వివిధ దేవతా స్తోత్రాలు, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామం, వేంకటేశ్వర సుప్రభాతం అంశాలుగా శిక్షణ ఉంటుందని తెలిపారు. బాల బాలికలతోపాటు పెద్దలు కూడా శిక్షణ తీసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 70322 55499లో సంప్రదించాలని కోరారు. అనంతరం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 25 ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఎం. ఫణి దూర్జటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి గానూ 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాతపరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తామన్నారు. http://aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విజయ పాల ధర పెంపు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయ పాల ధర లీటర్‌కు రూ. 2లు చొప్పున మార్చి 1వ తేదీ నుంచి పెంచుతూ కృష్ణా మిల్క్ యూనియన్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. పాల సేకరణ ధర, ప్యాకింగ్ మెటీరియల్, ఇతర వ్యయాలతో పాల ధర పెంపు అనివార్యమైందని యాజమాన్యం పేర్కొంది. నెలవారి పాల కార్డు కొనుగోలు చేసిన వారికి మార్చి 9వ తేదీ వరకు పాత ధరలే వర్తిస్తాయని పేర్కొంది. ఇక చిన్న పాల ప్యాకెట్లు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తుల ధరలలో ఎటువంటి వ్యత్యాసం లేదని ఎండీ కొల్లి ఈశ్వరబాబు పేర్కొన్నారు.

పట్టాభీ.. ఏంటిది?

- టీడీపీ అధికార ప్రతినిధిపై ఆ పార్టీ అధినేత అసహనం
- అన్నీ ఇలాగే చేస్తున్నాడంటూ చంద్రబాబు మండిపాటు
- లోకేష్ పాదయాత్రప్పుడు డైవర్షన్ అవసరమా?
- కృష్ణా నేతల సమాచారంతో అవాక్కు
- టీడీపీ బహిరంగలేఖలో పట్టాభి ప్రస్తావనే లేదాయె



పట్టాభిని గన్నవరం జైలుకు తరలిస్తున్న పోలీసులు(ఫైల్)

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాంపై ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు కోపం వచ్చింది. అన్నీ ఇలాగే చేస్తున్నాడంటూ అసహనం వ్యక్తం చేయడంతో పాటు ముందే దూరం పెట్టి ఉంటే పార్టీ ఇంతగా భ్రష్టుపట్టేది కాదని కూడా అభిప్రాయపడ్డట్లు తెలుస్తోంది. అంతేనా! గన్నవరం విధ్వంసంపై చంద్రబాబు పేరిట ప్రజలకు విడుదలచేసిన నాలుగు పేజీల బహిరంగ లేఖలో మాటవరసకైనా పట్టాభి పేరును ప్రస్తావించకపోవడం పరిశీలనాంశం.

గన్నవరం సంఘటన నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాలో పార్టీ పరిస్థితి పూర్తిగా అయిపోయిందని జిల్లా నాయకులతో నిర్వహించిన సెల్ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ఆగ్రహావేశాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. నాయకుల పనితీరునూ తూర్పారపట్టిన ఆయనకు ఆ తరువాత పలు విషయాల గురించి తెలియవచ్చింది. జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కొందరు కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న అంశాలను, అంతకు ముందు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన దారుణ పరిణామాలను ఏకరువు పెట్టడంతో పాటు సీనియర్లుగా తాము కూడా ఏమీ చేయలేకపోతున్నామని వాపోయారనేది అత్యంత విశ్వసనీయ సమాచారం. అధికారంలో ఉన్నప్పుడు మీకిలాంటివి ఏమీ పట్టలేదని, అప్పుడే కొంతయినా సరిచేసి ఉంటే ఇంతలా పరిస్థితులు ఇప్పుడు తలెత్తేవి కావని అనడంతో చంద్రబాబు కూడా మౌనం వహించారని తెలిసింది. ముఖ్యమంత్రిని ఇతర నాయకులను ఇష్టానుసారం పరుషపదజాలంతో మాట్లాడటం సరికాదని, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయని చెప్పడంతో తమ నాయకుడు మారుమాట్లాడలేదని సమాచారం.

అలా చేయడం ముమ్మాటికీ తప్పే..

బీసీ వర్గానికి చెందిన బచ్చుల అర్జునుడు గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండగా పార్టీ ఆదేశిస్తే తానే పోటీచేస్తానంటూ పట్టాభి ఇష్టానుసారం మాట్లాడటంతో నియోజకవర్గానికి చెందిన వారు కూడా అంటీముట్టనట్లు ఉన్నారని విశ్లేషించారు. తనంతట తాను గొప్ప నాయకునిగా పోల్చుకుంటూ రాష్ట్ర, జిల్లాలోని సీనియర్లకు గౌరవం ఇవ్వకపోవడం, కేశినేని నాని కార్యాలయంలో ఉంటూ పలు ఆరోపణలను ఎదుర్కోవడం, వివాదాలకు కారకుడనే గుర్తింపు తెచ్చుకోవడం తదితరాలతో పాటు పట్టాభి గతంలో అమెరికాకు వెళ్లి ఎన్ఆర్ఐల వద్ద పార్టీపేరు చెప్పి స్వీయ ప్రయోజనాలు పొందారని వివరించడంతో, అవునా అంటూ చంద్రబాబు సీరియస్ అయ్యారని తెలిసింది. 'పట్టాభి గురించి తెలియాల్సిన అంశాలన్నీ మా సార్‌కు ఇప్పటికి తెలిసొచ్చాయి. అతను అంత యూజ్‌లెస్ నా అంటూ మండిపడ్డారు. ఇలాంటి వారి విషయంలో ముందే జాగ్రత్తపడి ఉంటే బాగుండేది. అతని మాటలవల్లే కదా మంగళగిరి, గన్నవరంలో పార్టీ ఆఫీసులపై దాడులు జరిగాయి' అని ప్రస్తావనకు వచ్చిందని ఓ సీనియర్ నాయకుడు 'సాక్షి'కి తెలిపారు. లోకేష్ పాదయాత్ర జరుగుతున్న సమయంలో ఇలాంటివన్నీ అవసరమా? మొత్తం డైవర్ట్ అయిపోయిందిగా. పార్టీ కూడా బాగా బదనాం అయ్యింది. అన్నింటికన్నా ముఖ్యంగా పట్టాభికి సంబంధించిన ఆ పాత ఫొటోలు ఎవరు పోస్ట్ చేశారో.. అన్నివిధాలా చాలా డ్యామేజ్ అయ్యిందని ముఖ్యనాయకుల వద్ద బాబు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పట్టాభి పేరు కూడా లేదాయె...

'గన్నవరం విధ్వంసం– ప్రజలకు బహిరంగ లేఖ' అంటూ చంద్రబాబు పేరిట ఇదివరకే పార్టీ విడుదల చేసింది. నాలుగు పేజీల ఆ లేఖలో పట్టాభి పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. గన్నవరం టీడీపీ బీసీ నేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా పేరు మాత్రం రెండు చోట్ల ప్రముఖంగా ఉంది. దీన్నిబట్టి పట్టాభి విషయంలో పార్టీ ఎలాంటి అభిప్రాయానికి వచ్చి ఉంటుందో స్పష్టమైపోతోందని విజయవాడకు చెందిన మరో నాయకుడు అభిప్రాయపడ్డారు. పట్టాభి వ్యవహార శైలిని జిల్లా నాయకుల ద్వారా స్పష్టంగా తెలుసుకున్న నేపథ్యంలోనే గన్నవరం నియోజకవర్గం కో ఆర్డినేషన్ కమిటీని అధిష్టానం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ నేతృత్వంలో తక్షణం నియమించినట్లు స్పష్టమవుతోంది.

స్పందన అర్జీలపై శ్రద్ధ పెట్టండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- స్పందనలో 94 అర్జీలు స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో జేసీ, డీఆర్‌ఓ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో స్పందనలో అర్జీలు సమర్పిస్తారన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాటికి సరైన పరిష్కార మార్గాలను వెదకాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. ఆఫ్ లైన్, ఆన్ లైన్లో నమోదవుతున్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. నేరుగా స్పందనలోనే కాకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, 1902 కాల్ సెంటర్, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. స్పందనలో ఒకసారి నమోదైన అర్జీ తిరిగి నమోదు కాకూడదన్నారు. స్పందనలోని ప్రతి ఫిర్యాదును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రజలకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందకపోవడం, ఏదైనా విషయంలో తమకు అన్యాయం జరిగిన సందర్భాలలో ఫిర్యాదులు వస్తే విచారించి గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్‌లో జిల్లాకు చెందిన అర్జీల పెండింగ్ లేకుండా ఆయా శాఖల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పందనలో మొత్తం 94 వినతులు నమోదు కాగా, వీటిలో చాలా సమస్యలను జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్ గా మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, డీఆర్వో కె మోహన్‌కుమార్, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి వెండి ఆభరణాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానానికి భక్తులు సోమవారం వెండి ఆభరణాలను సమర్పించారు. మచిలీపట్నానికి చెందిన కేదారి లక్ష్మీనారాయణ, సాహిత్య దంపతులు రూ.లక్ష విలువ చేసే కిలోన్నర వెండితో తయారు చేసిన కిరీటం, ఇతర ఆభరణాలను ఆలయ అర్చకుడు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులుకు అందజేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటంతో అర్చకులు సత్కరించారు. దాత కుటుంబ సభ్యులు కేదారి శివనాగరాజు, నాగమల్లేశ్వరి, గోవర్ధన్‌సాయి, చంద్రశేఖర్, సుదర్శిని, లోహిత శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు మూడు జాతీయ పతకాలు



అధికారులను అభినందిస్తున్న సీపీ రాణా, డీసీపీ విశాల్‌గున్ని



అర్జునరావును అభినందిస్తున్న సీపీ రాణా, డీసీపీ విశాల్‌గున్ని

విజయవాడ స్పోర్ట్స్: అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు మూడు పతకాలు దక్కాయి. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 66వ జాతీయ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు ఇటీవల జరిగాయి. ఆరు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో అన్ని రాష్ట్రాల నుంచి రెండు వేల మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆరుగురిలో జిల్లా కమిషనరేట్‌లోని ఎస్బీ సీఐ జీఆర్‌కే హనీష్, ఎస్ఐ యు.హైమావతి ఉన్నారు. సీఐ హనీష్ ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో మొదటి స్థానాన్ని సాధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకోవడంతో పాటు లిఫ్టింగ్–ప్యాకింగ్–ఫార్వాడింగ్ ఆఫ్ ఎవిడెన్స్ పోటీల్లో రెండో స్థానాన్ని సాధించి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ఎస్ఐ హైమావతి క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ టెస్ట్ ఇన్ సైంటిఫిక్ ఎవిడెన్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ఇద్దరు అధికారులు మూడు పతకాలు సాధించడంతో ఈ పోటీల్లో రాష్ట్రానికి మూడో స్థానం దక్కింది. సీఐ హనీష్ 2009లో పోలీస్ అధికారిగా బాధ్యతలు తీసుకుని కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్‌లలో సీఐగా విధులు నిర్వర్తించారు. హైమావతి 2018 నుంచి ఎస్ఐగా పని చేస్తున్నారు. ఇద్దరు అధికారులను పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీ విశాల్‌గున్ని సోమవారం అభినందించారు.

ఆర్ఎస్ఐ అర్జునరావుకు పీఎం మెడల్..

విజయవాడ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మకమైన ప్రధాన మంత్రి లైఫ్ సేవింగ్ మెడల్ ఆర్ఎస్ఐ అర్జునరావును వరించింది. 2019లో డిసెంబర్ రెండో తేదీన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పక్క నుంచి ప్రవహిస్తున్న బందరు కాలువలో కొట్టుకుపోతున్న ఓ మహిళను అర్జునరావు ప్రాణాలకు తెగించి కాపాడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిష్టాత్మకమైన ప్రధాన మంత్రి లైఫ్ సేవింగ్ మెడల్‌కు అర్జునరావును భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇటీవల జరిగిన 66వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఈ మెడల్‌ను అర్జునరావు అందుకున్నారు. అర్జునరావును పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీ విశాల్‌గున్ని సోమవారం అభినందించారు.

కుట్రలో స్వామీజీల భాగస్వామ్యం బాధాకరం

- విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- పరిపూర్ణానంద స్వామి వ్యాఖ్యలకు ఖండన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతి పక్షాలు చేస్తున్న కుట్రల్లో కొందరు స్వామీజీలు, ఆధ్యాత్మికవేత్తలు భాగస్వాములు కావడం బాధాకరమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విజయవాడలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై హిందూపురంలో శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సమాజాన్ని సన్మార్గంలో నడపాల్సిన స్వామీజీలు అసత్యాలను ప్రచారం చేయడం, హిందూ ధర్మాన్ని ఎల్లవేళలా పరిరక్షిస్తున్న ప్రభుత్వంపై విషం చిమ్మడం సరికాదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఆలయాల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున 1,072 ఆలయాల నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి రూ.80 కోట్లు ఇచ్చిన దాఖలాలు గతంలో ఎన్నడూ లేవని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో టీడీపీ–బీజేపీ కలిసి పుష్కర పనుల్లో ఎంత అవినీతికి పాల్పడ్డాయో పరిపూర్ణానంద స్వామికి తెలియదా అని ప్రశ్నించారు. తెలుగుదేశం హయాంలో ఆలయాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసినప్పుడు, ప్రచార ఆర్భాటానికి అమాయక భక్తుల ప్రాణాలను బలిగొన్న రోజున హిందువుల మనోభావాలు పరిపూర్ణానంద స్వామికి గుర్తుకు రాలేదా అని నిలదీశారు. చంద్రబాబు పాలన బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఒక చీకటి యుగమని మల్లాది విష్ణు విమర్శించారు. టీడీపీ నేత బుచ్చి రాంప్రసాద్‌కు చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు పాలనలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి అందించిన సంక్షేమంపై మాట్లాడాలని హితవుపలికారు. సీఎం జగన్ నేతృత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా బ్రాహ్మణులు తమ స్థాయికి తగ్గట్లు పదవులు, సత్కారాలు పొందుతున్నారని వివరించారు. బ్రాహ్మణ సంక్షేమానికి ఈ మూడున్నరేళ్లలో రూ.466.69 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో రూ.8 కోట్ల వరకు బిజినెస్ లోన్లు మంజూరు చేశామన్నారు. ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కార్యక్రమం పుట్టిందే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి అని వివరించారు.

సృజనకు వేదిక.. విజ్ఞాన వీచిక

మొదలైన రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలు

- ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాశాఖ మంత్రి బొత్స
- 26 జిల్లాల నుంచి 260 ప్రాజెక్టుల ప్రదర్శన
- నేటితో ముగియనున్న సైన్స్‌ఫెయిర్



ప్రాజెక్టును తిలకిస్తున్న మంత్రి బొత్స సత్యానారాయణ, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థుల సృజనకు సైన్స్ ఫెయిర్ అద్దం పట్టింది. వారి ప్రాజెక్టులు వారిలోని శాస్త్రీయ దృక్పథాన్ని, సమాజంపై వారికున్న శ్రద్ధను తట్టి చూపింది. ఆంధ్రలయోల కళాశాల ఆవరణలో సోమవారం రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాటైంది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన స్వాగత నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పిల్లలకు ఇచ్చే ఆస్తి కేవలం విద్య ఒక్కటే అనే విధంగా ప్రభుత్వం ముందడుగేస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ర్యాగింగ్ ను నివారించడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



కవాతు చేస్తున్న విద్యార్థులు

కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి..

పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే దిశగా విద్యా సంస్థలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సైతం మార్కులకే పరిమితం కాకుండా నూతన ఆలోచనలతో విద్యా వంతులుగా ఎదగాలన్నారు. ఇందుకోసమే పాఠశాల స్థాయి, మండల, జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో 5 అంశాలపై 26 జిల్లాల నుంచి 260 ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్నామన్నారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27, 28 తేదీలలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిశోర్, లయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ గ్జేవియర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టును ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో రోడ్ సేఫ్టీ, పర్యావరణ పరిరక్షణ, కంప్యూటర్ పరిజ్ఞానం, కాలుష్య నివారణ వంటి అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోడ్డుపై వెలిగే వీధి దీపాలు సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఆదా చేసే దిశగా అద్దంకి మండలం ప్రభుత్వ పాఠశాలకు చెందిన మొహ్మద్ అఫ్జల్ చేసిన ప్రయోగం మన్ననలు పొందింది. అంతరిక్షంలో సంచరించే పరికరం ద్వారా అక్కడి వనరుల వివరణ రేడియో సిగ్నల్స్ ద్వారా మనకు తెలియచేసే జెజె స్మార్ట్ రోవర్ ప్రయోగం అబ్బుర పరిచింది. ఈ వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించేందుకు నగరంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.

తిరుపతమ్మకు రూ. 17.93లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.17,93,646 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జీవీడీఎస్ లీలాకుమార్ తెలిపారు. వీటిలో ఆలయానికి చెందిన వ్యవసాయ భూములు ఏడాది పాటు సాగు చేసుకునే హక్కునకు సంబంధించి రూ.6,88,646 ఆదాయం రాగా.. చిన్న తిరునాళ్ల సందర్భంగా 10 రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్ నిర్వహించుకునే హక్కునకు రూ. 11,05,000 వచ్చింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'అగ్నిపథ్'కు దరఖాస్తు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): ఇండియన్ ఆర్మీలో చేరేందుకు అగ్నిపథ్ పథకం ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీయార్ జిల్లా యువజన సంక్షేమాధికారి యూ. శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవివాహితులైన పురుష అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ లోపు https:// www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్‌కు పదోతరగతి ఉత్తీర్ణత ఉండాలని, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు ఎనిమిదో తరగతి విద్యార్హత ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు దశల్లో పరీక్షలు ఉంటాయన్నారు.

దేశంలోనే బలమైన నేత వైఎస్‌ జగన్‌

రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత


మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి తానేటి వనిత, పక్కన విప్‌ ఉదయభాను, కేడీసీసీబీ చైర్మన్‌ తన్నీరు

వత్సవాయి(పెనుగంచిప్రోలు): దేశంలోనే బలమైన నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. వత్సవాయి మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్‌ సామినేని ఉదయభానుతో కలిసి రూ.86.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. రైతులకు రూ.40 లక్షల డివిడెండ్లు పంపిణీ చేయటంతో పాటు ఇళ్ల పట్టాలు అందజేశారు. ముందుగా ఎస్సీ కాలనీలో మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజు బలవంతుడైతే శత్రువులంతా ఒకటవుతారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక ప్రతిపక్షాలతో పాటు ఎల్లో మీడియా అంతా ఒక్కటవుతున్నారన్నారు. అయినా సింహం సింగిల్‌గానే వస్తుందన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మొత్తం 175 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా కర్షకమిత్ర, విదేశీ విద్యకు రుణాలు అందించటంతో పాటు అన్ని రకాల రుణ సదుపాయాలు అందిస్తున్నారన్నారు. అనంతరం డీఆర్‌డీఏ, వైఎస్సార్‌ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఎఫ్‌పీఏ కలెక్షన్‌ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. డ్వాక్రా మహిళలకు గొర్రె పొట్టేళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు, కేడీసీసీ బ్యాంక్‌ చైర్మన్‌ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి, సర్పంచ్‌ భూక్యా సీతమ్మ, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముక్తేశ్వరరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వత్సవాయి, పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు గాదెల రామారావు, వూట్ల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్‌ ముత్తినేని విజయశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌ స్పందనలో 100 ఫిర్యాదులు

విజయవాడ స్పోర్ట్స్‌: ఎన్టీఆర్‌ జిల్లా పోలీస్‌ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 100 మంది బాధితులు ఫిర్యాదులు అందజేశారు. నగదు లావాదేవీలపై 28, కుటుంబ కలహాలపై 17, ఆస్తి వివాదాలపై 10, మోసాలపై తొమ్మిది, ఇతర వివాదాలపై 36 మంది ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం బాధితులతో పోలీస్‌ కమిషనర్‌ టి.కె.రాణా మాట్లాడారు. బాధితుల ఫిర్యాదులను నిర్ణీత సమయానికి పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌ స్టేషన్‌ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలి

న్యాయమూర్తి కేవీఆర్‌ కృష్ణయ్య


మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్‌ కృష్ణయ్య

మచిలీపట్నంటౌన్‌: ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నియమాలను పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి కేవీఆర్‌ కృష్ణయ్య అన్నారు. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని ఐటీఐ కళాశాల ఆడిటోరియంలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణయ్య మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగంలో పొందుపరిచిన విధి విధానాలను వివరించారు. జిల్లా రవాణాశాఖ అధికారి పి.సీతాపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ నిబంధనలను మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు లియావత్‌ సిద్ధిఖ్, బీఎస్‌ఎస్‌ నాయక్, బార్‌ అసోసియేషన్‌ కార్యదర్శి చీలి మునలయ్య వివరించారు. 150 మంది ఐటీఐ విద్యార్థులు, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

స్పా సెంటర్లపై నిరంతర నిఘా

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై క్రిమినల్‌ చర్యలు తీసుకోవాలి
- ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ ఢిల్లీరావు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): స్పాలు, సెలూన్లు, బ్యూటీ పార్లర్‌లపై నిరంతరం నిఘా ఉంచాలని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మసాజ్‌ సెంటర్ల ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్‌ చర్యలు తీసుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకాడవద్దని అధికారులను ఆదేశించారు. 'స్పా' సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంపై సోమవారం కలెక్టర్‌ ఢిల్లీరావు తన కార్యాలయంలో పోలీస్‌ టాస్క్‌ఫోర్స్, మున్సిపల్‌ కార్పొరేషన్, మహిళా శిశు సంక్షేమశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ మాట్లాడుతూ నగరంలో 'స్పా' సెంటర్లపై నిఘాకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నగరంలో 126 స్పా సెంటర్లు, సెలూన్లు, బ్యూటీ పార్లర్‌లపై తనిఖీ నిర్వహించగా వాటిలో 88 స్పా సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వాటిని మూసివేసేలా చర్యలు తీసుకోవడంపై అధికారుల బృందాలను అభినందించారు. దాడులను నిరంతరం కొనసాగించి, మళ్లీ అటువంటి తప్పు చేయకూడదని స్పా సెంటర్ల నిర్వాహకులలో భయాన్ని కలిగించాలన్నారు. ఈ విషయంలో ఉపేక్షిస్తే నగరం మరో కోల్‌కత, ముంబైల మాదిరి విష సంస్కృతి ఇక్కడకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. స్పా సెంటర్లకు భవనాలు అద్దెకిచ్చిన యజమానులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలలో పట్టుబడిన మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్‌ నిర్వహించి వారిలో సత్ప్రవర్తన తీసువచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమాధికారులను కలెక్టర్‌ ఢిల్లీరావు ఆదేశించారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ రమణ మూర్తి, ఐసీడీఎస్‌ పీడీ జి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పదికి పది కొట్టు.. రూ.లక్ష పట్టు!


లక్ష రూపాయల బహుమతి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో తాహెరాసుల్తానా

మచిలీపట్నంటౌన్‌: పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో పదికి 10 పాయింట్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు లక్ష రూపాయల బహుమతి అందించే కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన ఆలివ్‌ స్వీట్స్‌ అధినేత వి.దొరరాజు తిరిగి ప్రారంభించటం అభినందనీయమని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం స్థానిక హిందూ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఆలివ్‌ స్వీట్స్‌ అధినేత దొరరాజు ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 10 పాయింట్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఎనిమిది సంవత్సరాలుగా ఈ పారితోషకాన్ని అందిస్తున్నారన్నారు. కోవిడ్‌ కారణంగా నిలిచిన ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచి ప్రారంభించటం అభినందనీయమన్నారు. మచిలీపట్నంలో పదో తరగతి చదివే విద్యార్థులు పది పాయింట్లను సాధించి లక్ష రూపాయలను పొందాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీవైఈవో యువీ సుబ్బారావు, బందరు కోట మునిసిపల్‌ హైస్కూల్‌ ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్‌ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహానికి ప్రభుత్వం చిత్తశుద్ధి

- 2 వేల మందికి స్పోర్ట్స్‌ కోటాలో ఉద్యోగాలు కల్పించాం
- రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత


క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న హోంమంత్రి తానేటి వనిత

జగ్గయ్యపేట అర్బన్‌: రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్‌) కళాశాలలో దివంగత సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్‌ మెమోరియల్‌ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి సోమవారం రాత్రి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తూ అనేక పథకాలను అమలు చేస్తున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 2 వేల మందికి క్రీడల్లో రిజర్వేషన్‌ ద్వారా ఉద్యోగావకాశాలను కల్పించి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. ప్రభుత్వ విప్‌ సామినేని ఉదయభాను మాట్లాడుతూ తమ సోదరుడు ఎస్‌వీఎం ప్రసాద్‌ జ్ఞాపకార్థం గత 30 ఏళ్లుగా నియోజకవర్గంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. అనంతరం మంత్రి తానేటి వనిత క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ పోటీల్లో స్వయంగా పాల్గొని కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, కేడీసీసీ బ్యాంక్‌ చైర్మన్‌ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్‌ చైర్మన్‌ రాఘవేంద్ర, ఏఎంసీ చైర్మన్‌ ముత్తినేని విజయశేఖర్, ఏపీ ఒలింపిక్‌ అసోసియేషన్‌ సెక్రటరీ కేపీ రావు, వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ యువ నేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్‌ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గాంధీ జీవితం విద్యార్థులకు ఆదర్శప్రాయం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్‌ చాన్సలర్‌ రామమోహనరావు, రిజిస్ట్రార్‌ ఎం.రామిరెడ్డి

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): జాతిపిత మహాత్మా గాంధీ జీవితం విద్యార్థులకు ఆదర్శమని కృష్ణా యూనివర్సిటీ వైస్‌ చాన్సలర్‌ ప్రొఫెసర్‌ కె.రామమోహనరావు అన్నారు. సయ్యద్‌ అప్పలస్వామి కళాశాల ఆవరణలోని గాంధీ దేవాలయ వ్యవస్థాపకుడు రాంపిళ్ల జయప్రకాష్‌ రూపొందించిన గాం. దీజీ అష్టపంచ దశావతార, పంచశతి నామావళి పుస్తకావిష్కరణ తాడేపల్లిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ప్రపంచం మొత్తం గాంధీ ఆశయాలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.రామిరెడ్డి, స్వాతంత్ర్య సమర యోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ, ఆంధ్ర ఆర్ట్స్‌ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, ఇండియన్‌ సివిలైజేషన్‌ గాంధీ ట్రస్ట్‌ డైరెక్టర్లు తమ్మిన సోనియ, తమ్మిన హనుమ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ సరళ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

హత్య కేసులో నిందితుల అరెస్టు

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య
- 24 గంటల్లో హంతకులను అరెస్ట్‌ చేసిన కంచికచర్ల పోలీసులు
- సీఐ నాగేంద్రకుమార్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంలను అభినందించిన ఏసీపీ


కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన ఏసీపీ నాగేశ్వరరెడ్డి

కంచికచర్ల: ఈ నెల 24న కంచికచర్ల పెద్దబజార్‌ పోస్టాఫీస్‌ రోడ్డులో జరిగిన హత్య కేసులో నిందితులు నలుగురిని వేర్వేరు ప్రదేశాలలో అరెస్ట్‌ చేసినట్లు నందిగామ డివిజన్‌ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. కంచికచర్ల పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కుంచం రామారావు రేషన్‌డీలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతుడు రామారావు ఇబ్రహీంపట్నం కిలేశపురానికి చెందిన భార్గవిని 19 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. భార్గవికి మండలంలోని మోగులూరు గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా ఉద్యోగం రావటంతో స్థానిక పెద్దబజార్‌ పోస్టాఫీస్‌ రోడ్డులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. హతుడు రామారావుకు గతంలో జేసీబీ ఉండేది. జుజ్జూరు గ్రామానికి చెందిన మోగులూరు ప్రవీణ్‌ జేసీబీ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. రామారావు ఇంటికి ప్రవీణ్‌ తరచూ వస్తూ పోతున్న క్రమంలో భార్గవితో వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరిద్దరిని చూసిన రామారావు పలుమార్లు హెచ్చరించాడు. దీంతో వారిద్దరూ రామారావును అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. అనంతరం భార్గవి ప్రవీణ్‌కు ఫోన్‌ చేసి తన భర్తను చంపేద్దాం.. రమ్మని చెప్పటంతో ప్రవీణ్‌ తన స్నేహితులయిన జుజ్జూరు గ్రామానికి చెందిన మోగులూరు బుజ్జిబాబు, పులి సురేష్‌ల సహాయాన్ని కోరాడు. వారు ముగ్గురూ రాత్రి 11గంటల సమయంలో బైక్‌పై భార్గవి ఇంటికి వచ్చి రామారావుతో ఘర్షణకు దిగారు. బుజ్జిబాబు, సురేష్‌ అతని కాళ్లు పట్టుకోగా ప్రవీణ్‌ గుండెభాగంలో పిడి గుద్దులు గుద్ది, తలకు తనతో తెచ్చుకున్న ప్లాస్టిక్‌ కవర్‌ను తగిలించి ఊపిరాడకుండా చేసి చంపేద్దామని ప్రయత్నం చేశాడు. అదే సమయంలో భార్గవి మృతుని టెస్టికల్స్‌ను గట్టిగా పిసికింది. మృతుడు పెనుగులాడుతూ ప్రవీణ్‌ ఎడమచేతిని కొరికి ముఖానికి ఉన్న కవర్‌ను చింపి కేకలు వేయగా చుట్టుపక్కల వారు, రోడ్డుపై వెళ్లేవారంతా ఆగారు. వారిని చూసిన ప్రవీణ్‌ అతని స్నేహితులు వారు వేసుకు వచ్చిన బైక్‌ను అక్కడే వదలి పారిపోయారు. స్థానికులు రామారావును 108 అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 25వ తేదీ తెల్లవారుజామున 3.15 గంటలకు మృతిచెందాడు. హత్యకు కారణమైన భార్గవిని కిలేశపురంలో, మిగిలిన ముగ్గురిని పొన్నవరం క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్‌ చేశామని చెప్పారు. 24 గంటల్లో కేసును ఛేదించిన సీఐ ఐవీ నాగేంద్రకుమార్, ఎస్‌ఐ పీవీఎస్‌ సుబ్రహ్మణ్యంలను ఏసీపీ అభినందించారు.

రెండవ అంతస్తు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతుడు దుర్గారావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్‌): ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటనపై ఎస్‌ఎన్‌పురం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కొయ్యన్న దుర్గారావు(31) భార్య నాగమణి, ఇద్దరు మగ పిల్లలతో కలసి బావాజీపేట ఊర్వశి టిఫిన్‌ సెంటర్‌ సమీపంలో నివాసముంటున్నాడు. దుర్గారావు గత పదేళ్ల నుంచి ముఠా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బావాజీపేట శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నివాసముంటున్న అతని చెల్లి సాయిలక్ష్మి ఇంటి వద్ద ఉంటున్న తన తల్లిని చూడటానికి దుర్గారావు, భార్య నాగమణి వెళ్లారు. అనంతరం రాత్రి 10.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి బయలుదేరారు. ఆ సమయంలో తన చెల్లితో మాట్లాడేందుకు రెండవ అంతస్తులోని గోడ మీద కూర్చునే ప్రయత్నంలో అదుపు తప్పి ప్రమాదవశాత్తు జారి రోడ్డుమీద పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కిందకి దిగి చూడగా తల వెనుక భాగంలో బలమైన గాయాలై రక్తపు మడుగులో ఉన్నాడు. 108 సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం


మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: జాతీయ రహదారిపై బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. వీరవల్లి బైపాస్‌ రోడ్డులో సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో యువకుడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కొద్దిసేపటికి రహదారిపై వెళుతున్న వాహనదారులు గుర్తించి హైవే సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హైవే సేఫ్టీ ఎస్‌ఐ సుందరరావు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పక్కకు తరలించి, రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. అనంతరం మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. మృతుడు నీలం రంగు జీన్స్‌ ఫ్యాంట్, లేత గులాబీ రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

నందిగామ: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నందిగామ పట్టణంలో జరిగింది. ఎస్‌ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం గూడూరు ప్రభాకర్‌ రెడ్డి ఆర్మీలో పని చేసి ఉద్యోగ విరమణ అనంతరం నందిగామలో నివాసం ఉంటున్నాడు. అతని భార్య గూడూరు శ్రీలేఖ (31) ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుంది. స్థానికులు వెంటనే ఆమెను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శ్రీలేఖ మృతి చెందింది. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగానే శ్రీలేఖ ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో మోసం చేసిన వ్యక్తికి ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్‌: నకిలీ డాక్యుమెంట్‌లు, స్టాంప్‌లు తయారు చేసి మోసానికి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఒకటవ అదనపు చీఫ్‌ మెట్రోపాలిటన్‌ కోర్టు న్యాయమూర్తి టి.వి.ఎస్‌.ఎస్‌.ప్రకాష్‌ సోమవారం తీర్పు చెప్పారు. ఆదిత్య బిర్లా అల్ట్రాటెక్‌ సిమెంట్‌ కంపెనీలో అసిస్టెంట్‌ కమర్షియల్‌ అధికారిగా పనిచేసిన బి.హేమంత్‌కుమార్‌ నకిలీ డాక్యుమెంట్‌లు, స్టాంప్‌లతో నకిలీ కంపెనీలను సృష్టించాడు. ఆదిత్య బిర్లా అల్ట్రాటెక్‌ సిమెంట్‌ సరుకును అతను సృష్టించిన నకిలీ కంపెనీలకు పంపి మోసానికి పాల్పడ్డారు. ఏడాది కాలంలో బిర్లా సిమెంట్‌ కంపెనీకి చెందిన రూ.20 లక్షల సరుకును తరలించి మోసం చేశాడు. ఈ ఘటనపై బాధిత కంపెనీ ప్రతినిధులు 2016 ఏప్రియల్‌ 30న మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే నిందితుడు హేమంత్‌కుమార్‌ను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్‌ తరఫున సీనియర్‌ అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎస్‌.ఉమావతి కోర్టుకు వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు హేమంత్‌కుమార్‌కు జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులతో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణలంక పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధి, తిరుమలరావు ఫీడర్‌లోని తిరుమలరావు వీధి, మంటాడవారి వీధి, దింత్యాలవారి వీధి, కాటూరివారి వీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

-రూ.1.42 లక్షల నగదు స్వాధీనం

ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో పేకాడుతున్న 16 మందిని పటమట పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్‌చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఓ హోటల్ గదిలో పేకాడుతున్నట్టు పోలీసులకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్‌ద్వారా సమాచారం వచ్చింది. సీఐ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.1,42,740 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు. వీరంతా ఉయ్యూరు, గన్నవరం, తేలప్రోలు, నున్నతోపాటు పలు ప్రాంతాలకు చెందినట్టు పోలీసులు చెప్పారు. వీరందరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. హోటల్ యజమానితో పాటు పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసం చేశారని ఫిర్యాదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): తక్కువ ధరకు కెమెరా తెప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ మహిళ, ఆమె భర్త, కుమారుడిపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరానికి చెందిన డి.సాయిప్రకాశ్ ఫిర్యాదు చేశారు. "పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన దుబ్బాక నాగమణి, ఆమె భర్త మల్లారెడ్డి తమకు అమెరికాలో బంధువులు ఉన్నారని, వారి ద్వారా కెమెరా తెప్పించి పెడతామని 2021లో పలు దఫాలుగా సాయిప్రకాశ్ నుంచి రూ.2.25 లక్షలు వసూలు చేశారు. ఎంతకూ కెమెరా తెప్పించక పోవడంతో అతను తిరిగి డబ్బులు ఇవ్వాలని అడుగగా నాగమణి, ఆమె భర్త, కుమారుడు వెంకటరెడ్డి తాము తెలంగాణ మాజీ డీజీపీ బంధువులమని బెదిరించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వచ్చిన అవకాశాలు వినియోగించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నీరజ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల కళాశాలలో సోమవారం మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచి మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి పురస్కారం అందుకున్న విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన రుషిత, వర్ష క్విజ్‌లో, వెంకటలక్ష్మి, ప్రేమ వ్యాసరచన పోటీల్లో పురస్కారం అందుకోవడం కళాశాలకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె. బాలకృష్ణ, అరుణ, సుమిత్ర, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజన పెంపొందించేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ 37వ డివిజన్ ఇన్‌చార్జి ఇసరపు రాజు అన్నారు. ముత్యాలంపాడు ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో సోమవారం సీవీ రామన్ జయంతి పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, రీజనల్ ఇన్‌చార్జి ఉమారాణి మాట్లాడుతూ విద్యార్థులు సీవీ రామన్ స్ఫూర్తితో పరిశోధనలు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. సుమారు 300 ప్రదర్శనలను వివరించారు. కార్యక్రమంలో స్కూలు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడలు, పోటీ పరీక్షల్లో రాణించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్ది వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నామని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు చెప్పారు. విజయవాడ చిల్డ్రన్ స్కూల్ అసోసియేషన్ నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన రాకేష్ పబ్లిక్ స్కూల్లోని 25 మంది విద్యార్థులను సోమవారం స్కూల్ ఆవరణలో అభినందించారు. స్కూల్స్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో 21 మంది, కేబీఎన్ కాలేజీలో జరిగిన పోటీల్లో మరో ముగ్గురు, ఐటీసీ క్లాస్‌మేట్ నిర్వహించిన పోటీలో ఒకరు విజేతలుగా నిలిచారన్నారు. వీరిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన మూడేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో తన కుటుంబానికి ఆర్థిక భరోసా లభించిందని కానూరి పద్మావతి అన్నారు. వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పింఛన్ కానుక, ఇంటి స్థలం తదితర సంక్షేమ పథకాల ద్వారా రూ.7.06 లక్షలు లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. 18వ డివిజన్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని 84 వార్డు సచివాలయం పరిధిలో మాదంశెట్టి సీతయ్య వీధిలోని 220 గడపలను స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ పథకాల ద్వారా రూ.1,40 వేలు లబ్ధి చేకూరిందని బొడ్డు లలిత ఆనందం వ్యక్తం చేసింది.ఇలా పలువురు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. అవినాష్ మాట్లాడుతూ మూడేళ్ల పాలనలో డివిజన్‌లో రూ.12 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. పార్టీలు, కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'స్పందన'

వీఎంసీ స్పందనలో 22 అర్జీల స్వీకరణ


స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. స్పందనలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం - 3, ఇంజినీరింగ్ - 2, రెవెన్యూ- 7, ప్రజారోగ్య విభాగం - 3, యు.సి.డి (పి.ఒ.)- 7, విభాగాలపై అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత, ఎస్.ఇ. నరసింహ మూర్తి, మేనేజర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో

చిట్టినగర్‌లోని సర్కిల్ - 1 కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం - 1, యు.సి.డి (పి.ఒ)- 1, సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2లో రెవెన్యూ - 1 అర్జీ, పటమటలోని సర్కిల్ - 3లో ఇంజినీరింగ్ విభాగం - 2, పట్టణ ప్రణాళిక విభాగం-1 అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్లు తెలిపారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

కలెక్టర్ ఢిల్లీరావు


కళాశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించి, విష సంస్కృతికి దూరంగా ఉండేలా విద్యార్థుల్లో చైతన్యం పెంచాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఇటీవల విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సేవలందించిన కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు ఉపయోగిస్తూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, మహిళాభివృద్ధి, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలోని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఔత్సాహికులైన విద్యార్థులు టీంలుగా ఏర్పడి విద్యార్థుల ముఖ కవళికలు, ఆరోగ్యపరమైన మార్పులను గమనించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తే నిజమైన సేహ్నితులుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రామకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వృత్తి విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా రాష్ట్రంలో స్కిల్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వృత్తి విద్యా విధానంలో మెరుగైన అప్రెంటీస్ షిప్ లక్ష్యంగా భారత ప్రభుత్వ మినిస్టరీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో జాతీయ అప్రెంటిస్ షిప్ అవగాహన సదస్సు జరిగింది. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ లావణ్య, ఏడీఆర్ఎం శ్రీకాంత్, ఎస్‌డీఎఫ్ఎం బి.చంద్రశేఖర బాబు, ఎస్‌డీపీఓ బాలమురళీధర్, ఏడీఎఫ్ఎం వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ పీ చంద్రమౌళి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సును ఏడీఎఫ్ఎం వెంకటేశ్వరరావు సమన్వయం చేయగా 187 సంస్థల నుంచి 400కుపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యే పరమావధి కాకుండా చిన్నారుల్లో దాగి ఉండే సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాలు, మానసిక ఉల్లాసాన్ని కలిగించే సాంస్కృతిక ప్రదర్శనలను విద్యా సంస్థలు అందించాలని ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ డైరెక్టర్ జయ భారతరావు, నేషనల్ బెస్ట్ ప్రొఫెసర్ అవార్డ్ గ్రహీత ఆర్ బెనర్జీ కుమార్ అన్నారు. ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పటమట శాఖ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు వివిధ రకాల ఆట పాటలతో ఆహూతులను ఉర్రూతలూగించారు. వేడుకల్లో భాగంగా 'పంచభూతాలు', సేవ్ ద గర్ల్ చైల్డ్, మొబైల్ థీమ్‌లను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించి అందరి హర్షాధ్వానాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య పాల్గొని చిన్నారులను ప్రశంసించారు. వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ సునీత పర్యవేక్షించారు.

విద్యార్థులకు విద్యతో ఉన్నత స్థానం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి , మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాగా చదువుకుంటే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిట్టినగర్ శ్రీ గౌతమ్ విద్యా సంస్థల రజతోత్సవం సోమవారం జక్కంపూడి కాలనీ బ్రాంచ్‌లో నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ సూర్యారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యేతో పాటు అతిథులు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏడీసీపీ (క్రైం) వెంకటరత్నం, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, శివకుమార్ పట్నాయక్, గొల్లపూడి ఎంపీటీసీ కె.సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. కేక్ కోశారు. అనంతరం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీ పరీక్షలు, క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తులసి, ఇన్‌చార్జిలు శ్రీరామ్, రమ, ఉషా, రేష్మా, మధులత, యమున తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం కానూరు, రామవరప్పాడులోని వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ వంతు సామాజిక బాధ్యతగా నిత్యావసర సరుకులు, ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, వినీల, తేజ, భాష తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయం' యువతను ఆకట్టుకుంటుంది: మద్దిపాటి



లబ్బీపేట/గుణదల(విజయవాడతూర్పు): సస్పెన్స్ థ్రిల్లర్‌తో కూడిన గ్రంథాలయం సినిమా యువతను ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విన్నును మద్దిపాటి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విన్ను మద్దిపాటి మాట్లాడుతూ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ సినిమాలో సస్పెన్స్ థ్రిల్లర్ సీన్స్‌తో పాటు, యాక్షన్ సీక్వెన్స్ కూడా దర్శకుడు చాలా బాగా తీశారన్నారు. దర్శకుడు సాంబశివన్ జంపన మాట్లాడుతూ గ్రంథాలయంలో జరిగే సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయన్నారు. సమావేశంలో హీరోయిన్ స్మిరిత రాణి, నిర్మాత అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): నగరంలోని గవర్నర్ పేట -1 డిపో పరిధిలో ఆర్టీసీ సర్వీసులకు సంబంధించి ఫిర్యాదులు, భద్రత ప్రమాణాలు పాటించడానికి ప్రయాణికులు సలహాలు, సూచనలు తెలిపాలని డిపో మేనేజర్ కె. బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం జరగనున్న డయల్ యువర్ డీఎం.. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225455కు ఫోన్ చేసి సూచనలు చేయాలని పేర్కొన్నారు.

నీలకంఠేశ్వరునికి బిల్వార్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్యనగర్ శ్రీ శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం స్వామివారికి బిల్వార్చన జరిగింది. మహన్యాసపూర్వక ఏక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు అభి షేకాలు చేశారు.

గంజాయి స్వాధీనం.. ఆటో సీజ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న రావి మహేష్‌కుమార్ ఆటో నడుపుతుంటాడు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతో ఆటోలో గంజాయిని తరలించి విక్రయిస్తున్నాడు. గంజాయిని ఆటోలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు సోమవారం రాత్రి కృష్ణలంకలోని సత్యంగారి హోటల్ వద్ద తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆటుగా వెళ్తున్న అతని ఆటోను ఆపగా కేజీ గంజాయి ప్యాకెట్ లభించింది. అతనిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి అతనిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ముగిసిన 'చతుర్వేద మాస' పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన వేదపండితులతో ఏర్పాటు చేసిన దిన త్రయ చతుర్వేద మాస పారాయణం సోమవారం ముగిసింది. పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్ళపల్లి శివశర్మ శ్రౌతి మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఇక్కడ మూడు రోజుల పాటు పారాయణం ఏర్పాటు చేశామన్నారు.


ప్రకాశం బ్యారేజ్‌లో పచ్చగా పాచి పట్టి కనిపిస్తోంది. సంబంధిత సిబ్బంది తొలగించాల్సి ఉంది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పన్నుల చెల్లింపునకు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు 2022-23 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి, నీటి, డ్రైనేజీ, ఖాళీస్థలాల పన్నులు చెల్లింపునకు పలు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని, పన్నులు చెల్లించని వారి నీటి కుళాయి కనెక్షన్ తొలగించిఆస్తులు జప్తునకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్కిల్-1 పరిధిలో...

సర్కిల్-1 పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని (భవానీపురం ఓల్డ్ పోలీస్‌స్టేషన్) క్యాష్ కౌంటర్, చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు, భవానీపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని సచివాలయం నంబరు 130లో ఒక క్యాష్ కౌంటర్ ఏర్పాటుచేశారు.

గొల్లపాలెం గట్టు వద్ద ఉన్న సచివాలయం 225లో, కేదారేశ్వరరావు పేట బీఆర్‌పీ రోడ్డులోని సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న 118, వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఒక క్యాష్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సర్కిల్-2 కార్యాలయం పరిధిలో...

సర్కిల్-2 కార్యాలయంలో మూడు క్యాష్ కౌంటర్లు, పకాష్‌నగర్ సచివాలయంలోని 269లో, అజిత్‌సింగ్‌నగర్‌లోని ఆంధ్రప్రభ కాలనీలోని సచివాలయం 259లో, గవర్నర్‌పేటలోని వీహెచ్ఆర్ కాంప్లెక్‌లోని సచివాలయం నంబరు 98లో, మధురానగర్‌లోని సచివాలయం 205లో, ప్రకాష్‌నగర్ ఆప్నా బజార్, వాటర్‌ట్యాంక్ వద్ద క్యాష్ కౌంటర్ నంబరు 7,8,9లో చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సర్కిల్-3 పరిధిలో...

బ్రహ్మానందరెడ్డినగర్‌లోని సచివాలయం నంబరు 32లో, లబ్బీపేట మలేరియా ఆస్పత్రిపైన ఉన్న సచివాలయం నంబరు 86లో, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని సచివాలయం నం 8లో, కృష్ణలంక సిమెంట్ గొడౌన్ వద్ద ఉన్న సచివాలయం నంబరు 83లో, స్టెల్లా కళాశాల వద్ద, సాయిబాబా గుడి వద్ద ఉన్న వీఎంసీ క్యాష్ కౌంటర్, కృష్ణలంకలోని 102 సచివాలయంలో, గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఉన్న వీఎంసీ క్యాష్ కౌంటర్‌లో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో మూడు క్యాష్ కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఆరోగ్య ప్రగతి

డీఎంహెచ్ఓ మాచర్ల సుహాసిని


ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్న డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పునరుత్పత్తి శిశు ఆరోగ్యం అప్‌డేట్స్, అభివృద్ధి కమిటీ నిధులు వినియోగంపై మార్గదర్శకాలు, ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ అమలు వంటి అంశాలపై సమీక్షించారు. నాన్ కమ్యూనికల్ వ్యాధులు, సాంక్రమిక వ్యాధులు, ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు ఫీడ్ బ్యాక్ సమరీ కార్యక్రమం అమలుపై లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, స్టాటిస్టికల్ అధికారి లక్ష్మోజీ, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఎక్సెల్‌ప్లాంట్ పనులు


ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): త్వరితగతిన ఎక్సెల్ ప్లాంట్ పనులు పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ ఆదేశించారు. అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో మిగిలిన సి.సి.రోడ్లను వేయాలని, కొత్తగా ఆఫీసు బిల్డింగ్ నిర్మించాలన్నారు. కర్లాన్ ఇండస్ట్రీస్ నిర్వహణలోని చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో ప్రహరీ పక్కన ఏర్పాటు చేసిన గ్రీనరీని మరింత పెంచాలని, ఖాళీ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మొక్కలు నాటాలని ఆదేశించారు. అనంతరం ఆయన సర్కిల్-2 పరిధిలో సత్యనారాయణపురంలో అభివృద్ధి చేసిన సి.సి. రోడ్లను రీబౌండ్ హ్యామర్‌తో పనుల నాణ్యత పరిశీలించారు. ఆయా రోడ్లలో జరుగుతున్న డ్రైన్ పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, జోనల్ కమిషనర్-2 యు. సృజన, ఈఈలు సత్యనారాయణరావు, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బుడమేరు ఆక్రమణల తొలగింపు


బుడమేరు ఆక్రమణలను తొలగిస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్, పోస్ట్‌మేన్ రామచంద్రరావు వీధి, 4వ క్రాస్‌రోడ్డులో శనివారం రాత్రి నుంచి ఆర్ఎస్ నం 63లో బుడమేరుకు చెందిన భూమిలో ఆక్రమణలు చేశారని వీటిని తమ సిబ్బంది సోమవారం తొలగించారని వీఎంసీ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సర్కిల్-2 అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ పర్యవేక్షణలో విజయవాడ ఉత్తర మండల తహసీల్దారు కార్యాలయం సర్వేయర్‌తో హద్దులు, కొలతలు, సర్వే అనంతరం స్థానిక వీఆర్వో, జలవనరుల శాఖ సమన్వయంతో వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సారథ్యంలో జేసీబీతో ఆక్రమణను తొలగించామన్నారు. ఆయా శాఖల నుంచి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా కొనుగోలు చేస్తే భవన నిర్మాణానికి అనుమతి మంజూరు లభించదని, బ్యాంకుల నుంచి లోన్లు రావని, మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు విద్యుత్ సదుపాయం రావని సూచించారు. ఆక్రమణల తొలగింపులో వీఎంసీ ప్లానింగ్ విభాగం వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారన్నారు.

రూ.68.99 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ


వీఆర్ సిద్ధార్థ కాలేజీలో ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం 305 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. నార్త్‌సౌత్ ఫౌండేషన్(ఎన్ఎస్ఎఫ్) సహకారంతో చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.68.99 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పుట్టగుంట సతీష్‌కుమార్, డీన్ బావినేని పాండురంగారావు, ఎన్ఎస్ఎఫ్ ప్రతినిధి ప్రసాద్, కన్వీనర్ చాగర్లమూడి బేబీరాణి, సూరపనేని వెంకటరత్నం పాల్గొన్నారు.

యూనియన్ నేతపై ఫిర్యాదు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నకిలీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో రైల్వే శాఖను మోసం చేసిన మజ్దూర్ యూనియన్ నేతపై ఫిర్యాదు చేశారు. ఆ సంఘ నేత అసలు డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం మరో రెండు నెలల్లో రిటైర్డ్ కావాల్సి ఉండగా, తప్పుడు సర్టిఫికెట్‌తో మరో ఏనిమిదేళ్ల అధికారాన్ని అనుభవించేందుకు పక్కాగా ప్లాన్ చేసుకున్నాడు. అదే యూనియన్‌లోవారు ఈ విషయం కాస్తా బయటపెట్టడంతో డొంక కదిలింది. దీనిపై రైల్వే విజిలెన్స్, పీసీఓ ఉన్నతాధికారుల వాస్తవాలను వెలికితీసేందుకు రంగంలోకి దిగినట్లు సమాచారం.

క్లుప్తంగా...

పంగిడిలో సోలార్ గ్లాస్ పరిశ్రమ

సీఎం జగన్‌తో భేటీలో త్రివేణి గ్లాస్ ఎండీ వరుణ్ గుప్తా



సీఎంను కలిసిన వరుణ్ గుప్తా

సాక్షి, అమరావతి: తూర్పుగోదావరి జిల్లా పంగిడిలో రోజుకు 840 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన సోలార్ గ్లాస్ తయారీ కర్మాగారాన్ని రూ. 1,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్నట్లు త్రివేణి గ్లాస్ లిమిటెడ్ ఎండీ వరుణ్ గుప్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఈ ప్లాంట్ వల్ల 2,000 మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వరుణ్ గుప్తా తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం వరుణ్ గుప్తా కలిశారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో పారదర్శక పారిశ్రామిక విధానాలను సీఎం వివరిస్తూ.. ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, ప్రభుత్వ సలహాదారు ఎస్ రాజీవ్‌కృష్ణ పాల్గొన్నారు.

ప్రచారానికే పథకాలు

టీడీపీ నేత యనమల రామకృష్ణుడు

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అబద్ధపు ప్రచారం చేసుకునేందుకు, తప్పుడు లెక్కలతో ప్రజలను మభ్య పెట్టేందుకే పథకాలు అమలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో ఆరోపించారు. విద్యా హక్కు చట్టం అమలుకు, అమ్మఒడి పథకాన్ని మెలిక పెట్టడంతో పేద విద్యార్థులకు ప్రయోజనం లేకుండా పోతోందని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలలు 25 శాతం సీట్లు పేదలకు కేటాయించి.. ప్రభుత్వం నేరుగా పాఠశాలలకు ఫీజులు చెల్లించాలని, కానీ అమ్మఒడి నగదును ఫీజుగా చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకతవకలు : అచ్చెన్న

సాక్షి, అమరావతి : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నట్లు ఎన్నికల సంఘానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లేఖ రాశారు. ఎన్నికల నిర్వహణ అధికార పార్టీ ఆదేశాల మేరకు జరుగుతోందని ఆరోపించారు. స్థానిక సంస్థల నియోజకవర్గాలకు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కొందరు రిటర్నింగ్ అధికారులు ఎన్నికల కమిషన్ నియమావళికి విరుద్ధంగా కొందరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారని ఆరోపించారు.

యువగళం దెబ్బకు జగన్ పల్లెకు వస్తున్నారు

టీడీపీ అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్: లోకేశ్

తిరుపతి రూరల్/చంద్రగిరి: నాలుగేళ్లుగా తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకురాని జగన్ యువగళం దెబ్బకు పల్లెల్లో నిద్రకు వస్తున్నారని టీడీపీ నాయకుడు లోకేశ్ చెప్పా రు. ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలో శానంబట్ల నుంచి మామండూరు వరకు సాగింది. తొండవాడ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాను రోడ్డుపై నడుస్తుంటే ముఖ్యమంత్రి జగన్ తట్టుకోలేపోతున్నారని, అందుకే మైక్‌లు, వాహనాలను లాక్కొంటున్నారని విమర్శించారు. ఆయన సైకోలాగా మారి జిల్లాకో సైకోను తయారు చేశారని, ఉమ్మడి చిత్తూరు జిల్లా సైకో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని పేర్కొన్నారు. శ్రీవారి పింక్ డైమండ్ ఎక్కడ ఉందో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలపై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు.

సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ రద్దు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకా హత్య కేసులో నిందితుడు(ఏ-2) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. విచారణ దశలో బెయిల్ మంజూరు చేయలేమని తేల్చి చెప్పింది. వివేకా హత్య కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, బెయిల్ మంజూరు చేయాలని సునీల్ హైకోర్టులో ఈ నెల 6న బెయిల్ పిటిషన్ వేశారు. అయితే ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ వివేకా కూతురు సునీతారెడ్డి, భార్య సౌభాగ్యమ్మ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సుమలత సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది నయన్‌కుమార్, సీబీఐ తరఫు ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సీబీఐ, సునీత పిటిషన్లలోని విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. ప్రధాన కేసు విచారణ మార్చి 10న కొనసాగనుంది.



మునిగినా వరిస్తుంది

ముంపుప్రాంత రైతుల కోరిక సిద్ధించింది. మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం కృషి ఫలించింది. వరదలు.. ఎడతెరిపిలేని వర్షాలు.. తుపానుల కాలంలో ఏకబిగిన 15 రోజుల నుంచి మూడు వారాల వరకు ముంపును తట్టుకునే వరి వంగడం రైతులకు అందుబాటులోకి వచ్చింది. అడుగున్నర లోతున నీటిలో మునిగినా.. ముంపు తగ్గిన వెంటనే తెప్పరిల్లే పంట రకాన్ని మార్టేరు వరి పరిశోధనా స్థానం రూపొందించింది. ఎంటీయూ-1232 పేరిట వచ్చే ఖరీఫ్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

-సాక్షి, అమరావతి

ఎంటీయూ-1232.. పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు వరి పరిశోధనా స్థానం అభివృద్ధి చేసిన కొత్త రకం వంగడమిది. నారుమడి దశ నుంచి పిలకల దశ వరకు 15 రోజుల నుంచి గరిష్ఠంగా మూడు వారాల పాటు అడుగున్నర లోతున ముంపునకు గురైనా నిలదొక్కుకోగలిగే రకమిది. దీనిని గోదావరి జిల్లాల్లోని రైతులు ఇప్పటికే ప్రయోగాత్మకంగా సాగు చేసి సత్ఫలితాలు సాధించారు. ఇప్పటికే రాష్ట్ర కమిటీ ఆమోదం పొందగా.. త్వరలో కేంద్రం అనుమతితో మార్కెట్‌లోకి రాబోతుంది. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ముంపును తట్టుకునే కొత్త వరి వంగడం

- మార్టేరు పరిశోధనా స్థానం సృష్టి
- వరద ముంపు ప్రాంతాల్లో సాగుకు అనువైన రకం
- ఎంటీయూ-1232 వంగడంతో రైతు వెతలకు చెక్
- పంట నీట మునిగినా దిగుబడికి ఢోకా లేదు
- నిండా మునిగినా నూకల శాతం తక్కువే
- వచ్చే ఖరీఫ్ నుంచి పూర్తి స్థాయిలో మార్కెట్‌లోకి..

ఏటా ముంపు బారిన 3 లక్షల హెక్టార్లు

తుపానులు.. అకాల వర్షాలు.. తక్కువ సమయంలో కురిసే అధిక వర్షపాతం.. వరదల వల్ల రాష్ట్రంలో ఏటా 3 లక్షల హెక్టార్లలో వరి పంట ముంపు బారిన పడుతోంది. ప్రధానంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనే వరి పంట ఎక్కువగా తాత్కాలిక, మధ్యస్థ ముంపునకు గురవుతుంటుంది. ముంపును తట్టుకునేలా పూళ్ల పరిశోధనా కేంద్రం పీఎల్ఏ-1100 (బడవా మసూరి), గోదావరి జిల్లాల కోసం మార్టేరు పరిశోధనా కేంద్రం ఎంటీయూ-1140 (భీమ), ఎంటీయూ-1172 (క్షీర) రకాలను అభివృద్ధి చేశాయి. వీటి పంట కాలవ్యవధి 150-155 రోజులు. ఊడ్చిన 40 రోజుల తర్వాత వారం, 10 రోజుల పాటు ముంపును మాత్రమే తట్టుకుంటున్నాయి. పైగా ఎన్ని రోజులు ముంపునకు గురైతే ఆ మేరకు దిగుబడి తగ్గిపోతుంది.



ఏం టీ యూ 1232 రకం వంగడం తో సాగు చేసి వరి పొలం

ఇవీ ప్రత్యేకతలు

ప్రస్తుతం వినియోగంలో ఉన్న ముంపు రకాలకు భిన్నంగా కొత్త వంగడాన్ని మార్టేరు పరిశోధనా స్థానం అభివృద్ధి చేసింది. సబ్-1 జన్యువును మధ్యస్థ ఎత్తు కల్గిన ఎంటీయూ-1075లో 3 తరాలపాటు ప్రవేశపెట్టడం ద్వారా ఎంటీయూ-1232 అనే రకాన్ని శాస్త్రవేత్తలు మార్కెట్‌లోకి తెచ్చారు. ఇటీవలే ఈ వంగడాన్ని రాష్ట్ర కమిటీ ఆమోదంతో విడుదల చేశారు. పైలట్ ప్రాజెక్టుగా కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ముంపు, పల్లపు ప్రాంతాల్లో రైతులకు మినీ కిట్స్‌గా ఇచ్చి సాగు చేయించి సత్ఫలితాలను రాబట్టగలిగారు. పంట కాలం సాధారణ పరిస్థితుల్లో 135-140 రోజులు కాగా.. ముంపువేళ 140-145 రోజులుగా నిర్ధారించారు. సాధారణ పరిస్థితుల్లో హెక్టార్‌కు 6 టన్నులు.. ముంపునకు గురైతే హెక్టార్‌కు 3.8 టన్నుల దిగుబడి వస్తుంది. ఎద పద్ధతి ద్వారా సాగు చేసినా.. నారుమడి పద్ధతిలో సాగు చేసినా పిలకల దశ వరకు ఎప్పుడైనా సరే కనీసం 15 రోజుల పాటు ఆకు కనపడకుండా మునిగినప్పటికీ పంట బతుకుతుంది. అదే అడుగు అడుగున్నర మేర నీరు నిలబడే పల్లపు ప్రాంతాల్లో 3 వారాల పాటు ముంపును తట్టుకుంటుంది. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. ముదురాకు పచ్చరంగులో ఉండి ఈ రకం సిఫార్సు చేసిన ఎరువులతో సాగు చేస్తే అధిక దిగుబడులు ఇస్తుంది. మిగిలిన రకాల్లో నాణ్యత కల్గిన గింజ శాతం 60-64 ఉంటే.. ఈ వంగడంలో 66 %గా ఉంటుంది.

ముంపు తట్టుకుని నిలబడింది



మా పొలం గోదావరి గట్టు పక్కనే ఉంది. ఏటా వరదలు, వర్షాల వేళ ముంపు తప్పడం లేదు. మొన్న ఖరీఫ్‌లో మార్టేరు శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఎంటీయూ-1232 రకం వేశా. ముంపును తట్టుకుని నిలబడింది. 145 రోజులకే కోత కొచ్చింది. 30 బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.6,700 అదనంగా ఆదాయం వచ్చింది. చేనుపై పడిపోలేదు. పురుగులు, తెగుళ్లను తట్టుకుంటుంది.

– గంధం విజయ శ్రీనివాసరావు, గెద్దాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ముంపులేని ప్రాంతాల్లో 14 బస్తాలు అదనం



మాది పల్లపు ప్రాంతం. ఎంటీయూ-1232 వేశాను. 140 రోజుల్లోనే పంట కోతకొచ్చింది. ఎంటీయూ-1064 రకంతో పోలిస్తే 8-10 రోజులు అదనంగా ముంపు తట్టుకుని నిలబడుతోంది. సార్వాలో ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వస్తోంది. ముంపులేని ప్రాంతాల్లో 14 బస్తాలు అదనంగా దిగుబడి వచ్చింది.

– బొమ్మారెడ్డి రాజశేఖరరెడ్డి, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా

ఎకరాకు రూ.13,400 అదనపు ఆదాయం



మాది పల్లపు ప్రాంతం. డ్రెయిన్ పక్కన ఉండటం వలన ఏటా ఊడ్చిన వెంటనే మొక్కలు చనిపోవడం, అడుగు-అడుగున్నర లోతు నీరు నిలిచిపోవడంతో దిగుబడులు తగ్గిపోయేవి. మొన్న ఖరీఫ్‌లో ఎంటీయూ-1232ను 2ఎకరాల్లో సాగు చేశా. ముంపును తట్టుకుని ఎకరాకు 35 బస్తాల దిగుబడి ఇచ్చింది. 10 బస్తాల వరకు అధిక దిగుబడి రాగా.. ఎకరాకు రూ13.400అధిక ఆదాయం వచ్చింది.

– టి.నాగమల్లేశ్వరరావు, ఎస్ఎన్ గొల్లపాలెం, కృష్ణా జిల్లా

సూపర్ సక్సెస్



ముంపును తట్టుకునేలా అభివృద్ధి చేసిన ఎంటీయూ-1232 రకాన్ని ప్రయోగాత్మకంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో సాగు చేయించాం. సూపర్ సక్సెస్ అయ్యింది. ముంపును తట్టుకుని నిలబడడమే కాదు.. మంచి దిగుబడులు కూడా వచ్చాయి. ఇటీవలే రాష్ట్ర కమిటీ ఆమోదం తెలిపింది. కేంద్రానికి పంపించాం. త్వరలోనే కేంద్ర కమిటీ ఆమోదంతో గెజిట్ విడుదల చేయనుంది. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తిస్థాయిలో ఈ విత్తనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ విత్తనం కావాల్సిన వారు మార్టేరు పరిశోధనా కేంద్రాన్ని 91772-91369, 93968-48380, 93967-49370 నంబర్లలో సంప్రదించి పొందవచ్చు.

– డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ సైంటిస్ట్, మార్టేరు వరి పరిశోధనా స్థానం

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై హైకోర్టు ధర్మాసనం స్టే

- స్కూళ్ల ఆవరణల్లో ఆర్బీకేలు, సచివాలయాల నిర్మాణం వ్యవహారం

సాక్షి, అమరావతి : ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు), గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణాలు చేపట్టడంపై సింగిల్ జడ్జి జరుపుతున్న విచారణపై సీజే ధర్మాసనం స్టే విధించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 28కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో ఆర్బీకేలు, సచివాలయాల నిర్మాణాలపై దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ స్కూళ్ల ప్రాంగణాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఆ తర్వాత కూడా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ కోర్టు ధిక్కార వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఓ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా అసలు ఉపాధి హామీ పథకం నిధులను గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణానికి వాడొచ్చో లేదో చెప్పాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సింగిల్ జడ్జి ఆదేశించారు. ఇందులో భాగంగా వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని సుమోటోగా ప్రతివాదిగా చేరుస్తూ ఈ నెల 14న ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా శాఖల ముఖ్య కార్యదర్శులు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై సోమవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. ముఖ్య కార్యదర్శుల తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషన్లలో అభ్యర్థనను దాటి సింగిల్ జడ్జి విచారణ సాగుతోందని వివరించారు. సింగిల్ జడ్జి తన ముందున్న రిట్ పిటిషన్లను ప్రజా ప్రయోజన వ్యాజ్యాల రీతిలో విచారణ జరుపుతున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగానే ఉపాధి హామీ నిధులతో గ్రామ, వార్డు సచివాలయాలు నిర్మించవచ్చా అంటూ ప్రశ్న లేవనెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారని, ఇది పిటిషనర్లు కోరిన అంశాన్ని దాటి వ్యవహరించడమే అవుతుందని ఏజీ తెలిపారు. ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా సింగిల్ జడ్జి రిట్ పిటిషన్ల పరిధిని విస్తరిస్తున్నారని, ఇందుకు ఎంత మాత్రం ఆస్కారం లేదని అన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సీజే ధర్మాసనం సింగిల్ జడ్జి విచారణపై స్టే విధించింది.

7 ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 23న ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో 7 ఎమ్మెల్యే కోటా శాసన మండలి స్థానాలకు మార్చి 23న ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఫలితాలు కూడా విడుదలవుతాయి. మార్చి 6వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) సోమవారం షెడ్యూలు విడుదల చేసింది. ఎమ్మెల్యే కోటాలో శాసన మండలికి ఎన్నికైన నారా లోకేశ్, చల్లా భగీరథ్ రెడ్డి, పోతుల సునీత, బచ్చుల అర్జునుడు, డొక్కా మాణిక్య వరప్రసాద్, పీవీవీ సూర్యనారాయణ రాజు, గంగుల ప్రభాకర్ రెడ్డి పదవీ కాలం మార్చి 29న ముగియనుంది. దీంతో ఈ స్థానాలకు సీఈసీ ఎన్నికలు నిర్వహిస్తోంది. తెలంగాణలో మూడు స్థానాలకు కూడా అదే రోజు ఎన్నికలు జరుగుతాయి.

షెడ్యూల్

నోటిఫికేషన్ :	మార్చి 6
నామినేషన్లకు చివరి తేది :	మార్చి 13
నామినేషన్ల పరిశీలన:	మార్చి 14
నామినేషన్ ఉపసంహరణ :	మార్చి 16
పోలింగ్ : మార్చి 23 ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు	
కౌంటింగ్, ఫలితాలు	: మార్చి 23 సాయంత్రం 5 గంటలకు

అయ్యన్న ఫోర్జరీపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు అనుమతి

హైకోర్టు ఉత్తర్వులు పక్కన పెట్టిన జస్టిస్ ఎం.ఆర్.షా ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడుపై నమోదైన ఫోర్జరీ కేసులో సుమారు పదేళ్ల వరకు శిక్షపడే ఐపీసీ సెక్షన్ 467 ప్రకారం దర్యాప్తు చేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను పక్కన పెట్టింది. అయ్యన్నపాత్రుడుపై నమోదైన కేసులో సెక్షన్ 467 చెల్లదంటూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ నీటిపారుదలశాఖ అధికారి మల్లికార్జునరావు తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ సి.టి.రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేసు దర్యాప్తు సాగుతుండగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఫోర్జరీ చేశారని హైకోర్టు ప్రాథమికంగా గుర్తించిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. దర్యాప్తు సంస్థ ఐపీసీ సెక్షన్ 467 ప్రకారం దర్యాప్తు కొనసాగించవచ్చని చెప్పింది. హైకోర్టు మెరిట్స్ ఆధారంగా విచారణ చేపట్టాలని, మూడునెలల్లో విచారణ ముగించాలని సూచించింది. నర్సీపట్నంలో ఇంటి నిర్మాణం నిమిత్తం ఇంజినీరింగ్ అధికారి సంతకం ఫోర్జరీ చేశారన్న ఆరోపణలతో సీఐడీ అధికారులు అయన్నపాత్రుడు, కుమారుడు రాజేశ్‌లపై కేసు దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే.

'సుప్రీం'లో మాజీమంత్రి నారాయణకు చుక్కెదురు

సాక్షి, న్యూఢిల్లీ : పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ఏపీ మాజీమంత్రి పి.నారాయణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన బెయిల్ రద్దుచేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ నారాయణ సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని జస్టిస్ రవీంద్రభట్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో పిటిషనర్ మంత్రిగా ఉన్నారని, 2014లోనే నారాయణ విద్యాసంస్థల అధినేతగా వైదొలిగారని తెలిపారు. మేజిస్ట్రేట్ ఇచ్చిన బెయిల్‌ను హైకోర్టు రద్దుచేసిందని.. రివిజన్ పిటిషన్‌కు కూడా సెషన్స్ కోర్టుకు వెళ్లాలని సూచించిందన్నారు. హైకోర్టు రివిజన్ పిటిషన్‌కు అనుమతించేలా ఆదేశాలివ్వాలని లూత్రా కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మెరిట్స్ ఆధారంగా సెషన్స్ కోర్టు విచారిస్తుందని స్పష్టంచేసింది. సెషన్స్ కోర్టు ఇచ్చే ఉత్తర్వులపై వారంపాటు పిటిషనర్‌కు రక్షణ కల్పిస్తామని.. ఈలోగా హైకోర్టును ఆశ్రయించొచ్చని ధర్మాసనం పేర్కొంటూ నారాయణ పిటిషన్‌ను కొట్టేసింది.

పాడి రైతుకు తోడు

▶ మొదటి పేజీ తరువాయి

వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. రూ.240.69 కోట్ల వ్యయంతో రెండు విడతల్లో 340 అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. వీటిని నియోజకవర్గానికి రెండు చొప్పున అందుబాటులోకి తీసుకొచ్చి ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి అంబులెన్స్ లో రూ.35 వేల విలువైన 81 రకాల మందులను అందుబాటులో ఉంచారు. 54 రకాల అత్యాధునిక పరికరాలతో పాటు వెయ్యి కిలోలు బరువున్న జీవాలను ఎత్తగలిగేలా హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. ఇప్పటివరకు కాల్ సెంటర్‌కు రైతుల నుంచి రోజుకు సగటున 1500 కాల్స్ చొప్పున 3.90 లక్షల కాల్స్ రాగా మారుమూల పల్లెల్లో 1.30 లక్షల ట్రిప్పులు తిరిగాయి. దాదాపు 2 లక్షలకుపైగా పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. ఇప్పటి వరకు 1.35 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. ఏపీ తరహాలో పంజాబ్, కేరళ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలు వెటర్నరీ అంబులెన్స్‌లను తీసుకొస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా అందిస్తున్న పశు వైద్యసేవలపై 'సాక్షి బృందం' రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర స్థాయి పరిశీలన నిర్వహించింది.

మూగ జీవులపై మమకారం..

వైఎస్సార్ పశు సంరక్షణ పథకం కింద పశువులకు హెల్త్‌కార్డులు జారీ చేయడమే కాకుండా పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులతో ఆర్థిక చేయూతనిస్తున్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నారు. కృత్రిమ గర్భధారణ, పునరుత్పత్తి, దూడల సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా 3వ శనివారం పాడి రైతులకు, 2, 4వ బుధవారాల్లో గొర్రెలు, మేకల పెంపకందారులకు వైఎస్సార్ పశువిజ్ఞానబడులు నిర్వహిస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆర్బీకేల్లో దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా పాడి, మూగజీవాల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 155251, 1962 టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు.

రెండున్నరేళ్లలో సేవలిలా..

రాష్ట్రవ్యాప్తంగా 10,778 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు కాగా పాడి సంపద ఎక్కువగా ఉన్న 8,330 ఆర్బీకేల్లో ట్రెవిస్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా రూ.4 వేల విలువైన మందులను సరఫరా చేస్తున్నారు. ఆర్బీకేల ద్వారా గత 32 నెలల్లో 4,468 టన్నుల గడ్డి విత్తనాలు, 62,435 టన్నుల సంపూర్ణ మిశ్రమం, 60 వేల కిలోల న్యూట్రిషనల్ సప్లిమెంట్స్, 350 టన్నుల పశువుల మేతతో పాటు 3,909 చాఫ్ కట్టర్స్ పంపిణీ చేశారు. ఆర్బీకేల ద్వారా 2 కోట్ల పశువులకు టీకాలిచ్చారు. 33.08 లక్షల పశువులకు హెల్త్ కార్డులు జారీ చేశారు. 1.61 కోట్ల పశువులకు ప్రాథమిక వైద్యసేవలు అందించారు. పశువిజ్ఞాన బడుల్లో 13.99 లక్షల మంది రైతులకు శిక్షణ నిచ్చారు. ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు 42 వేల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులందించి రుణ పరపతి కల్పిస్తున్నారు.

వెన్న శాతం, దిగుబడి పెరిగింది

వైఎస్సార్ జిల్లా వెలమవారిపల్లెకు చెందిన జే.గుర్రప్ప జీవనాధారం పాడిపోషణే. తనకున్న 15 పశువులకు మేతగా ఎండుగడ్డి, శనగ కట్టెతో పాటు ఆరు బయట లభ్యమయ్యే పచ్చగడ్డి అందించినప్పుడు ఆశించిన పాల దిగుబడి వచ్చేది కాదు. పశువులు తరచూ అనారోగ్యాల బారిన పడేవి. ఆర్నెల్ల క్రితం ఆర్బీకే ద్వారా 50 కిలోల గడ్డి విత్తనాలు తీసుకొని సాగు చేశాడు. గడ్డిలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పశువులు ఇష్టంగా మేత మేశాయి. పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రోజుకు 4-4.5 లీటర్ల పాలు ఇచ్చే ఈ పశువులు ప్రస్తుతం 5-6.5 లీటర్లు ఇస్తున్నాయి. పాలల్లో వెన్న శాతం 5-6 నుంచి 7-8 శాతానికి పెరిగింది. లీటర్‌పై రూ.10 అదనంగా పొందగలుగుతున్నట్లు గుర్రప్ప ఆనందంగా చెబుతున్నాడు.

75 శాతం రాయితీపై విత్తనాలు



గతంలో నాణ్యమైన పచ్చగడ్డి దొరక్క పశువులు సకాలంలో ఎదకు వచ్చేవి కావు. పాల దిగుబడి సరిగా ఉండేది కాదు. ఆర్బీకేల ద్వారా రాయితీపై నాణ్యమైన మొక్కజొన్న (ఆఫ్రికన్ టాల్ గడ్డి రకం) విత్తనాలను 75 శాతం రాయితీపై తీసుకొని సాగు చేశా. 60 రోజుల్లో 9 అడుగులు పెరిగి ఎకరానికి 5-6 టన్నుల దిగుబడి వచ్చింది. ఇప్పుడు మేత ఇష్టంగా తింటున్నాయి. సకాలంలో ఎదకు రావటమే కాకుండా పాల దిగుబడి రోజుకి 2-3 లీటర్లు పెరిగింది. సీఎం జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– అంకంరెడ్డి రవికుమార్, ఓతపేట, అనకాపల్లి జిల్లా

ఆరోగ్యంగా పశువులు.. అదనంగా లాభం

నాకు 8 పశువులున్నాయి. గడ్డి కత్తిరించే యంత్రాల ద్వారా మేత వృథా కాకుండా ఎలా నివారించవచ్చో పశువిజ్ఞాన బడి కార్యక్రమాల ద్వారా తెలుసుకున్నా. 40 శాతం రాయితీపై గడ్డి కత్తిరించే యంత్రాన్ని ఆర్బీకేలో తీసుకున్నా. మొక్కజొన్న గడ్డిని ముక్కలుగా చేసి అందిస్తున్నా. గేదెలు ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నాయి. గతంలో 62 లీటర్ల పాల దిగుబడి రాగా ప్రస్తుతం 70 లీటర్లు వస్తున్నాయి. అదనంగా రూ.320 లాభం వస్తోంది. ప్రభుత్వానికి నిజంగా రుణపడి ఉంటాం.

– చిలంకూరి తిరుపతయ్య, లింగారెడ్డిపల్లి, ప్రకాశం జిల్లా

ఆర్బీకేల ద్వారా పశువైద్య సేవలు



ఆర్బీకేల ద్వారా పాడిరైతుల గడప వద్దకే పశు వైద్య సేవలందిస్తున్నాం. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. పాడిరైతుకు ఏది కావాలన్నా ఆర్బీకేల ద్వారా అందిస్తున్నాం. రూ.4 వేల విలువైన మందులతో పాటు నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా, గడ్డికోసే యంత్రాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నాం.

–డాక్టర్ అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

సవరణ చట్టంపై కౌంటర్లు దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏలకు హైకోర్టు ఆదేశం
- సవరణ చట్టంతో జీవో 107పై వ్యాజ్యాలు నిరర్థకమయ్యాయన్న అదనపు ఏజీ
- నిరర్థక వ్యాజ్యాలతో ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమీలేదన్న ధర్మాసనం
- రాజధాని వ్యవహారంతో సహా అన్ని కేసుల్లో విచారణ వేసవి సెలవుల తరువాతకు వాయిదా

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో పేదలకు, ఇతర ప్రాంతాల వారికి ఇళ్లస్థలాల కేటాయింపు నిమిత్తం సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఆర్‌డీఏను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి, పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అమరావతి రాజధాని సమీకరణ రైతుసమాఖ్య, మరికొందరు హైకోర్టులో గత ఏడాది వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు సోమవారం విచారణకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందన్నారు. సవరణ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాజధాని ప్రాంతంలో ఇళ్లస్థలాల కేటాయింపు నిమిత్తం ప్రభుత్వం తెచ్చిన జీవో 107ను సవాలు చేస్తూ 2020లో దాఖలైన వ్యాజ్యాలన్నీ నిరర్థకం అవుతాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం ఆదేశాల మేరకు ఈ విషయాన్ని మెమో రూపంలో కోర్టు ముందుంచామన్నారు. ఈ మెమోకు కౌంటర్ దాఖలు చేశామని పిటిషనర్ల న్యాయవాదులు ఉన్నం మురళీధరరావు, కారుమంచి ఇంద్రనీల్ చెప్పారు. ఈ సమయంలో అదనపు ఏజీ స్పందిస్తూ.. నిరర్థకం అయినట్లు తాను చెప్పిన వాదనను రికార్డు చేయాలని కోరారు. నిరర్థకమైన వ్యాజ్యాలను ఆ మేర మూసివేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. నిరర్థకం అయిన వ్యాజ్యాల వల్ల ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమీలేదని పేర్కొంది. అన్ని వ్యాజ్యాలను కలిపి వేసవి సెలవుల తరువాత విచారిస్తామని తెలిపింది. సవరణ చట్టంపై దాఖలైన వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఇప్పటివరకు రాజధాని ప్రాంతంలో ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వనందుకు నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వాన్ని, సీఆర్‌డీఏను ఆదేశించాలంటూ దాఖలైన వ్యాజ్యాల్లో కూడా ధర్మాసనం విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా నష్టపరిహారం తీసుకోవచ్చని పిటిషనర్లకు ధర్మాసనం స్పష్టం చేసింది. రాజధాని విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ రైతులు దోనె సాంబశివరావు తదితరులు దాఖలు చేసిన కోర్టుధిక్కార వ్యాజ్యాల్లో కూడా విచారణను వేసవి సెలవుల తరువాత చేపడతామంది. ఈ మొత్తం వ్యవహారం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కొంతకాలం వేచి చూద్దామని ధర్మాసనం స్పష్టం చేసింది.

కోర్టుధిక్కార కేసులో కోర్టుకు డీజీపీ

విచారణ మార్చి 20కి వాయిదా

సాక్షి, అమరావతి: కోర్టుధిక్కార కేసులో డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం హైకోర్టు ముందు హాజరయ్యారు. ఆయన హాజరును పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. కోర్టుధిక్కార కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మార్చి 20కి వాయిదా వేసింది. ఇదిలా ఉంటే మాజీ డీజీపీ, ప్రస్తుత ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ అధికార కార్యక్రమం వల్ల కోర్టుకు హాజరు కాలేదు. తదుపరి విచారణకు హాజరవుతానని ఆయన కోర్టుకు లిఖితపూర్వకంగా తెలిపారు. ఆయన వినతిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం జిల్లా పోలీసు ట్రెనింగ్ కాలేజీలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌కు 1999లో జారీచేసిన జీవో 257 ప్రకారం పదోన్నతి కల్పించే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు 2019లో ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ రాజశేఖర్ కోర్టుధిక్కార వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారించిన జస్టిస్ గంగారావు ప్రస్తుత డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ డీజీపీ గౌతం సవాంగ్‌ల వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాల మేరకు రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. రాజశేఖర్ వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్) సంతృప్తికరంగా లేదని చెప్పారు. ఆయన పదోన్నతిని డీపీసీ తిరస్కరించిందని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, పదోన్నతి కల్పించే విషయంలో అన్ని అంశాలను పునఃపరిశీలించాలని సూచించారు. కౌంటర్ దాఖలుకు గడువునిస్తూ విచారణను మార్చి 20కి వాయిదా వేశారు. తదుపరి విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి రాజేంద్రనాథ్‌రెడ్డికి మినహాయింపునిచ్చారు.

వెబ్ ఆప్షన్‌ల నమోదు ప్రారంభం

సాక్షి, అమరావతి: వైద్య విద్య ఎండీ/ఎంఎస్ హోమియో, ఆయుర్వేద కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్‌ల కోసం తొలి దశ వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా సోమవారం నుంచి వెబ్ ఆప్షన్‌ల నమోదు ప్రక్రియను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రారంభించింది. ఆప్షన్‌ల నమోదుకు బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు గడువు ఇచ్చింది. ఎండీ (హోమియో) కోర్సుల్లో ప్రవేశాల కోసం https:// pghomoeo.-ntruhsadmissions.com/, ఎండీ/ఎంఎస్(ఆయుర్వేద) కోర్సుల్లో ప్రవేశాల కోసం https:-//pgayurveda.ntruhsadmissions.com/ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలి. ఆప్షన్‌ల నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే 8333883934, 9063400829, 7416563063, 7416253073 నంబర్‌లను, సందేహాలకు 8978780501, 7997710168, 9391805238, 9391805239 ఫోన్ నంబర్‌లను సంప్రదించాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధిక రెడ్డి తెలిపారు.

తెలంగాణ

పిస్టల్‌తో కాల్చుకున్న అసదుద్దీన్ వియ్యంకుడు

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వియ్యంకుడు డాక్టర్ మజారుద్దీన్ అలీఖాన్ (60) తన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో కాల్చుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఆయన ఇంట్లోనే ఈ ఉదంతం జరిగింది. ఆర్థిక, కుటుంబ వివాదాలే కారణమని ప్రాథమికంగా అనుమానిస్తున్న బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మజారుద్దీన్ ప్రస్తుతం ఒవైసీ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగం డీన్‌గా పనిచేస్తుండగా.. ఆయన కుమారుడు అబేద్ అలీఖాన్ అదే హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సర్జన్‌గా ఉన్నారు. అబేద్‌కు అసదుద్దీన్ ఒవైసీ కుమార్తె యాస్మిన్ ఒవైసీతో 2020 సెప్టెంబర్ 22న వివాహమైంది. మజారుద్దీన్ ఇంట్లో భార్య అఫియా రషీద్ అలీఖాన్, అబేద్, యాస్మిన్ ఉంటుండగా.. మజారుద్దీన్ కుమార్తె జైనా అలీఖాన్ అమెరికాలో నివసిస్తున్నారు. ఆర్థిక, కుటుంబ వివాదాల నేపథ్యంలో కొన్నాళ్లుగా మజారుద్దీన్, అఫియా మధ్య విభేదాలు ఉన్నాయి. దీంతో వారు ఒకే ఇంట్లోనే వేర్వేరుగా ఉంటున్నారు. రెండు రోజులుగా వారి మధ్య వాగ్వాదాలు జరిగినట్లు తెలిసింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తన గదిలోకి వెళ్లిన మజారుద్దీన్ తలుపులు గడియపెట్టుకున్నారు. ఆపై తన వద్ద ఉన్న .32 క్యాలిబర్ లైసెన్స్‌డ్ పిస్టల్‌తో కుడివైపు చెవి పైభాగంలో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో డ్రైవర్ తాజుద్దీన్ వెళ్లి కిటికీ నుంచి చూడగా మజారుద్దీన్ మంచంపై రక్తపు మడుగులో పడి ఉండటం గమనించాడు. వెంటనే మజారుద్దీన్‌ను కారులో అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పల్నాడులో 'బృహత్ శిలాయుగం'!

అచ్చమ్మకుంట అటవీ ప్రాంతంలో క్రీస్తుపూర్వం 3 వేల ఏళ్లనాటి సమాధులు

- కృష్ణాతీరంలో 5 కిలోమీటర్ల మేర 300–400 ఆదిమ మానవ సమాధుల గుర్తింపు
- దాదాపు 10–15 కిలోమీటర్ల మేర విస్తరించినట్టు అంచనా
- వాస్తు ప్రకారం.. ఒకే వరుసలో దక్షిణం వైపు ద్వారాలతో వీటి నిర్మాణం
- ప్రథమ, ద్వితీయ శ్రేణులుగా సమాధులు


అచ్చమ్మకుంట అటవీ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 3వేల ఏళ్లనాటి సమాధులు

పల్నాడు.. పౌరుషగడ్డ. పల్నాడు అంటే.. రాజ్యాల మధ్య కాలుదువ్విన కోడిపుంజులు కనిపిస్తాయి. వెయ్యేళ్ల కిందట అధికారం, ఆధిపత్యం కోసం సాగిన యుద్ధభేరీ వినిపిస్తుంది. వీరులకు గుడికట్టిన సంప్రదాయం కనిపిస్తుంది. ఇది ఇప్పటివరకు చరిత్ర. కానీ.. కృష్ణానది ఒడ్డున పల్నాట క్రీస్తుపూర్వం 3 వేల ఏళ్లనాడే గొప్ప మానవ నాగరికత విలసిల్లింది. కిలోమీటర్ల మేర బృహత్ శిలాయుగపు (మెగాలిథిక్) సమాధుల రూపంలో నిక్షిప్తమైంది. మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో పురావస్తు అధికారులు, పరిశోధకుల వెలికితీతతో ఆదిమ మానవ జీవనం ప్రపంచానికి పరిచయం అవుతోంది.

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా మాచర్ల మండలం అచ్చమ్మకుంట తండా అటవీ ప్రాంతంలో కృష్ణా తీరం వెంబడి ఆదిమ మానవ సంస్కృతి విస్తరించింది. ఇక్కడ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర 300 నుంచి 400 వరకు సమాధులు బయటపడ్డాయి. ఇంత పెద్ద ఎత్తున వరుసక్రమంలో ప్రాచీన కాలపు సమాధులు దేశంలో ఎక్కడా లేవు. ఇక్కడ అత్యధిక సంఖ్యలో గృహ సమాధి (డాల్మెన్), గూడు సమాధులు (సిస్ట్ బరియల్) ఉన్నాయి. ఈ సమాధుల నిర్మాణంలో వాస్తుశాస్త్రాన్ని పాటించడం విశేషం. అన్నింటిని దక్షిణం వైపు ద్వారం ఉండేలా నిర్మించారు. ప్రతి సమాధి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. ఇవన్నీ కృష్ణానది పరీవాహక ప్రాంతంలోనే ఉన్నాయి. దీంతో అప్పటి ప్రజలు కృష్ణానది ఎగువభాగంలో నివసించినట్టు తెలుస్తోంది. వ్యవసాయంతోపాటు పశువులపై ఆధారపడి జీవనం సాగించారని, ముఖ్యంగా జొన్నలు, సజ్జలు, కందులు పండించారని లభ్యమైన ఆధారాలను బట్టి తెలుస్తోంది. పూసలు, ప్రత్యేకమైన ఎరుపు, నలుపు రంగు మట్టిపాత్రల అవశేషాలను బట్టి అప్పటి ప్రజలు అలంకార ప్రియులుగా భావిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో మొదటగా బృహత్ శిలాయుగంలో ఇనుమును వినియోగించినట్టు పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రాంతంలో ముడి ఇనుము అధికంగా లభ్యమవడంతో ప్రజలు ఇక్కడ నివసించేవారని తెలుస్తోంది. ముఖ్యంగా కృష్ణా, తుంగభద్ర, గోదావరి, పెన్నానది తీరాల్లో వీటి ఆనవాళ్లు తరచు బయటపడుతున్నాయి.

ప్రత్యేక నిర్మాణ శైలిలో సమాధులు

ప్రాచీన శిలాయుగంలో మానవుడు మృతదేహాలను ప్రకృతికే వదిలేశాడు. నవీన శిలాయుగానికి వచ్చేసరికి మృతదేహాన్ని క్రమపద్ధతిలో పాతిపెట్టడం నేర్చుకున్నాడు. బృహత్ శిలాయుగంలో మానవ మృతదేహాన్ని జంతువులు పీక్కుతినకుండా, ఖనన సామగ్రిని పాడుచేయకుండా పెద్దపెద్ద శిలలతో సమాధులు నిర్మించారు. వీటిలో మృతుడు ఉపయోగించిన యుద్ధ, వ్యవసాయ సామగ్రి, మట్టిపాత్రలు, పెంపుడు జంతువులను కూడా సమాధి చేసేవారు. ఈ సమాధుల చుట్టూ పెద్ద బండరాళ్లను పేర్చేవారు. ఇవే రాక్షసగూళ్లు. వీటి ఆనవాళ్లు ప్రపంచం అంతటా ఉన్నాయి. ముఖ్యంగా ఐరోపా, ఆసియా ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. గతంలో విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోను బృహత్ శిలాయుగపు సమాధులు బయటపడ్డాయి. చదునైన బండరాళ్లతో నలువైపులా స్వస్తిక్ ఆకారంలో పేర్చి గది మాదిరి తయారు చేశారు. ఇందులో భూమి లోపల కొంత, భూ ఉపరితలంపై కొంతభాగం కనబడే విధంగా నిర్మించారు. ఈ సమాధులు పెద్ద బండరాళ్లతో ఉండటం, అక్కడ లభించిన మట్టిపాత్రలు, అస్థిపంజరాలను బట్టి ఇవి సామాన్య మానవులకు ఇది సాధ్యం కాదనే ఉద్దేశంతో.. వీటిని రాక్షసుల స్థావరంగా నమ్మి రాక్షసగూళ్లుగా పిలిచేవారు. ఇలాంటి రాక్షసగూళ్లు అచ్చమ్మకుంటలో భారీగా ఉన్నాయి. వీటిలో కొన్ని అప్పటికప్పుడు నిర్మించినవైతే.. మరికొన్ని ముందే నిర్మించుకున్నట్టు తెలుస్తోంది. వీటిలో కొన్ని సామూహిక సమాధులున్నాయి. వీటిలో రెండురకాలున్నాయి. మృతదేహాన్ని ఖననం చేసినవి ప్రథమశ్రేణి సమాధులుగా, మృతదేహాన్ని దహనం చేయగా మిగిలిన అవశేషాలను పూడ్చిపెట్టినవి ద్వితీయశ్రేణి సమాధులుగా వర్గీకరించారు.

ఇప్పటికీ చెక్కు చెదరలేదు



నేను పుట్టి పెరిగిన ప్రాంతంలో ఇంతటి గొప్ప నాగరికత విలసిల్లిందంటే సంతోషంగా ఉంది. నా పరిశోధనలో బృహత్ శిలాయుగపు సమాధులు కనుగొన్నప్పుడు వాటిని చూసి ఆశ్చర్యపోయాను. సమాధులు 10–15 కిలోమీటర్ల మేర విస్తరించినట్టు అంచనా వేస్తున్నాం. స్థానికులు వీటిని బండరాళ్లుగా భావించి కొన్ని చెదరగొట్టారు. మిగిలిన సమాధులు చెక్కు చెదరలేదు. ఈ సమాధులకు పక్కనే ఎండిపోయిన నదీపాయ ఉండటంతో అప్పటి ప్రజలు దిగువన సువిశాల ప్రాంతంలో వ్యవసాయం చేసుకుని జీవించినట్టు తెలుస్తోంది. ఇప్పటికీ ఆ ప్రాంతం సాగులో ఉంది. ఇక్కడ తవ్వకాలు జరిగితే ఆనాటి ప్రజల సాంస్కృతిక, సామాజిక జీవనం, వర్తకవాణిజ్య వివరాలు వెలుగులోకొస్తాయి.

– ఎం.స్వామినాయక్, ఏపీ పురావస్తు, ప్రదర్శనశాలల అసిస్టెంట్ డైరెక్టర్

ముగ్గుదిన్నె కాలువకు ఇరువైపులా..

వెల్దుర్తి మండలం గంగలకుంటలోని కృష్ణానది కుడిగట్టుపైన.. ముగ్గుదిన్నె కాలువకు ఇరువైపులా దాదాపు మూడుచదరపు కిలోమీటర్ల మేర వెయ్యికిపైగా ఇనుపయుగపు స్మారక కట్టడాలున్నాయి. ఇక్కడ 5–10 మీటర్ల వ్యాసార్థంతో, 1–2 మీటర్ల ఎత్తులో స్థానిక నాపరాళ్లను గుండ్రంగా పేర్చి, గులకరాళ్లతో ఉబ్బెత్తుగా అమర్చిన సమాధులు కనిపిస్తాయి. ఈ సమాధులకు ఉత్తరాన 10–25 అడుగుల ఎత్తు, 3–5 అడుగుల వెడల్పు, 6 అంగుళాల మందంతో చనిపోయిన వారికి గుర్తుగా రాళ్లను నిలువుగా ఏర్పాటు చేశారు. వాటిపై ఇనుపయుగపు అంత్యక్రియ పద్ధతులను తెలిపే ఎద్దు, చదరం, గంగ్రం, ముగ్గును పోలిన రేఖాచిత్రాలున్నాయి. 'గంగలకుంటలో గతంలో వందలాది నిలువురాళ్లు, రాకాసిగుళ్లు ఉండేవి. ఇప్పుడు పదో, పదిహేనో మిగిలాయని స్థానికులు ద్వారా తెలుసుకున్నాం. రైతులు నీళ్లగొట్టాలు వేసినప్పుడు, మైనింగ్ కారణంగా దాదాపు 500 సమాధులు, 700 నిలువురాళ్లు ధ్వంసమయ్యాయి. ఇక్కడ లభ్యమైన 25 అడుగుల నిలువురాయి (మెన్‌హిర్) రాష్ట్రంలోనే అతి పెద్దది. ఇంతటి మానవచరిత్రను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..' అని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

- పదోన్నతి పొందిన ఉద్యోగులకూ కొత్త పీఆర్సీ ప్రకారం వేతనాలు
- సీఎం వైఎస్ జగన్ చొరవతో జీవో విడుదల
- బకాయిలతో కలిపి చెల్లింపు
- రాష్ట్ర వ్యాప్తంగా 2,096 మందికి లబ్ధి

కదిరి (శ్రీసత్యసాయి జిల్లా): పదోన్నతి పొందిన ఆర్టీసీ ఉద్యోగులందరికీ కొత్త పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ నెల 24న ఉత్తర్వులు విడుదలయ్యాయి. సవరించిన కొత్త పీఆర్సీ ప్రకారం మార్చి 1వ తేదీన వారంతా వేతనాలు అందుకోనున్నారు. దీనికితోడు పదోన్నతి పొందిన నాటి నుంచి వారికి రావాల్సిన వేతన బకాయిలు కూడా కొత్త పీఆర్సీ ప్రకారం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ)లో రాష్ట్ర వ్యాప్తంగా 51,488 మంది ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 2,096 మందికి పదోన్నతి లభించింది. డీపీసీ నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతి లేకుండా పదోన్నతి కల్పించారంటూ ఆర్థిక శాఖ అభ్యంతరం తెలిపింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పీఆర్సీ వీరికి వర్తింపజేయడం కుదరదని తెగేసి చెప్పింది. పదోన్నతి పొందిన వారిని మినహాయించి 49,392 మందికి 2022 సెప్టెంబర్ 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉద్యోగ సంఘాలు ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాయి. సీఎం సానుకూలంగా స్పందించి.. వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫలితంగా పదోన్నతి పొందిన వారికి కూడా కొత్త పీఆర్సీ వర్తింపజేస్తూ బకాయిలతో సహా చెల్లించేలా ఈ నెల 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిర్ణయంతో 2,096 మందికి లబ్ధి చేకూరనుంది. వీరిలో 27 మంది డిపో మేనేజర్లు, 18 మంది అసిస్టెంట్ డీఎంలు, 148 మంది గ్రేడ్–1 కండక్టర్లు, 332 మంది గ్రేడ్–1 డ్రైవర్లు, 197 మంది అసిస్టెంట్ డిపో క్లర్కులు, 345 మంది ఆర్టిజాన్‌లు, 198 మంది మెకానిక్‌లు, 322 మంది సూపర్‌వైజర్లు, 44 మంది సెక్యూరిటీ విభాగం వారితో పాటు ఇతరులు 465 మంది ఉన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేరుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. ఆర్థిక శాఖ అనుమతి లేకున్నా సరే 2,096 మందికి పదోన్నతులు కల్పించారు. ప్రస్తుతం వారికి పే రివిజన్‌ను క్రమబద్ధీకరించారు. మనసున్న సీఎం వైఎస్ జగన్‌కి ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పటికీ మద్దతుగా నిలుస్తారు. – చంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్టీసీ వైఎస్సార్ యూనియన్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కార్మికులకు దేవుడయ్యారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతి పొందిన మాలాంటి 2,096 మందికి కొత్త పీఆర్సీ అమలయ్యేలా నిర్ణయం తీసుకున్నారు. సీఎంకు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది మొత్తం జీవితాంతం రుణపడి ఉంటాం.

– మోకా హరిమోహన్, అసిస్టెంట్ మేనేజర్, కదిరి డిపో


జిల్లా వార్తలు

బాక్సర్ విక్రమ్‌కు సీపీ రాణా అభినందనలు


బాక్సర్ విక్రమ్‌ను అభినందిస్తున్న సీపీ రాణా, డీసీపీ విశాల్ గున్నీ

విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ పతకాలతో రాష్ట్ర, జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని అంతర్జాతీయ బాక్సర్ విక్రమ్ నాయుడుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సూచించారు. ఇటీవల ఢిల్లీలో యూనివర్సల్ బాక్సింగ్ ఆర్గనైజేషన్(యూబీఓ) నిర్వహించిన అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన విక్రమ్ టైటిల్ సాధించారు. టాంజినీయా క్రీడాకారుడిని అద్భుతమైన పంచ్‌లతో ఓడించారు. టైటిల్ సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని సీపీ రాణా, డీసీపీ విశాల్‌గున్నీని క్రీడాకారుడు విక్రమ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కృషి, పట్టుదల, బలమైన సంకల్పంతోనే విక్రమ్ ఈ టైటిల్ సాధించాడని ఈ సందర్భంగా సీపీ రాణా అన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కోచింగ్ సెంటర్‌లో కోచ్ ఇసాక్ వద్ద విక్రమ్ శిక్షణ తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు అండగా పోలీసుశాఖ


ప్రసాద్‌కు చెక్కును అందజేస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్(మచిలీపట్నం): హోంగార్డు కుటుంబాలకు పోలీసుశాఖ అన్నివేళలా అండగా ఉంటుందని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా భరోసా ఇచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన, అకాల మరణం పొందిన వారి కుటుంబాలకు జిల్లాలోని హోంగార్డుల అందరి తరఫున ఒక రోజు వేతనాన్ని విరాళంగా సేకరించి వచ్చిన నగదును ఎస్పీ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. గత యేడాది నవంబర్ ఆరో తేదీన ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ప్రసాద్‌కు రూ.3,85,530 కాంట్రిబ్యూషన్ చెక్కు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో హోంగార్డు నాంచారయ్య మృతి చెందడంతో అతని కుటుంబానికి జిల్లాలోని హోంగార్డులంతా కలిసి సేకరించిన ఒకరోజు వేతనం రూ.3,79,140ల చెక్కును ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో అంతర్భాగమేనన్నారు. అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకట రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ముంగిటకు మరిన్ని సేవలు

- క్యాన్సర్ చికిత్సకు కేంద్రం ఆమోదం
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీతో ఒప్పందం


ఎయిమ్స్ ఆసుపత్రి భవన సముదాయం

మంగళగిరి: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో నూతనంగా మరో చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దక్షిణ భారత దేశానికే తలమానికమైన ఎయిమ్స్ నగరంలోని ఆహ్లాదకర వాతావరణంలో రెండు కొండల మధ్య నిర్మాణం పూర్తి చేసుకుంది. సుమారు రూ.1617 కోట్లతో ఎయిమ్స్ నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోంది. రూ.10 నామమాత్రపు ఫీజుతో రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. మందులు, పరీక్షలు అన్ని సేవలు తక్కువ ఫీజులకే అందుతుండటంతో వివిధ ప్రాంతాల నుంచి రోగులు భారీగా తరలివస్తున్నారు. నిత్యం మూడు వేల మందికి పైగా రోగులు ఎయిమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ఇప్పటికే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రాగా రాష్ట్ర ప్రభుత్వం ఎయిమ్స్‌తో ఆరోగ్యశ్రీ ఒప్పందం కుదుర్చుకోవడంతో రోగులు నాణ్యమైన ఉచిత సేవలు అందుకుంటున్నారు. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో ఎయిమ్స్‌లో క్యాన్సర్‌కు సైతం చికిత్స అందించనున్నట్లు ప్రకటించడంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఎయిమ్స్ నీటి సమస్యను ఎదుర్కొంటోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.7.50 కోట్లతో నీటి సమస్య పరిష్కారానికి పనులు ప్రారంభించింది. రోగులకు సేవలు అందించడంతో పాటు వైద్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పరీక్ష కేంద్రాల నిర్వహణ, ప్రయోగ కేంద్రాలు సైతం అందుబాటులోకి రావడంతో మంగళగిరి–తాడేపల్లి నగరానికి మరో మణిహారంగా ఎయిమ్స్ మారింది. రోగులు, వారి కోసం వచ్చే బంధువులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు ఆయా విభాగాల్లో పని చేసే వారితో ఎయిమ్స్ వైద్యశాల నిత్యం కిటకిటలాడుతోంది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రత్యేక చొరవ తీసుకుని ఎయిమ్స్ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతో ఎయిమ్స్ రోడ్డులో ఎలాంటి భయం లేకుండా జనం తిరుగుతున్నారు. ఎయిమ్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుండటంతో మంగళగిరి–తాడేపల్లి నగరం మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుందని నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉగాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

మచిలీపట్నంటౌన్: జిల్లాలో గృహనిర్మాణ లక్ష్యాలను ఉగాది పండుగలోపు పూర్తి చేసేలా అధికారులు కృషిచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 12 వేలకు పైగా గృహాల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. వచ్చే నెల 22వ తేదీ లోపు మరో 4,800 ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి తొలి లక్ష్యం 16,890 ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధంచేయాలని సూచించారు. ప్రతి వారం లక్ష్యాలను నిర్ణయించుకుని ఆ మేరకు పూర్తయ్యేలా పనిచేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల నుంచి హౌసింగ్ అధికారుల వరకు సమష్టిగా పనిచేయాలని స్పష్టంచేశారు. పామర్రు ఎంపీడీఓతోపాటు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఫోన్ మాట్లాడటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అతని వివరణ తీసుకోవాలని ఆదేశించారు.

పురోగతి లేకుంటే చర్యలు

జిల్లాలో కొన్ని మండలాల్లో గృహనిర్మాణాలు ప్రగతి తక్కువగా ఉందని వచ్చే 20 రోజుల్లో పురోగతి లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ రంజిత్‌బాషా హెచ్చరించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత ఎంపీడీఓలు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ఆదాయ, కులధ్రువీకరణ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ఎదుగుదలకు పటిష్ట ప్రణాళిక రూపొందించి అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. రెండో విడత మనబడి, నాడు – నేడు పనులు వేగవంతం చేసి పాఠశాలల సుందరీకరణ, మౌలిక వసతులపై దృష్టిసారించాలన్నారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్చేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా, హౌసింగ్ పీడీ జి.వి.సూర్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ సాధికారిక అధికారి ఎ.సరస్వతి, మెప్మా, డీఆర్డీఏ పీడీ పి.ఎస్.ఆర్.ప్రసాద్, డీపీఓ నాగేశ్వర నాయక్, సర్వేశాఖ ఏడీ గోపాలరాజా, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ముదిగొండ ఫణిదూర్జటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణానికి దేవతలకు ఆహ్వానం

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అతిప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఋత్విగరణ, అంకురారోపణాది కార్యక్రమం నిర్వహించి స్వామి వారి కల్యాణోత్సవానికి భక్త జనులను, దేవతలను ఆహ్వానించేందుకై భక్తాగ్రేసరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్ఠించారు. స్వామి వారి సేవలకు, భక్తజన సేవలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కలుగజేసేందుకు దేవతలందరిని వారి వారి విధుల్లో నియమించేందుకు గరుత్మంతుడు ఆహ్వానం పలకడానికి సన్నద్ధమయ్యాడు. అష్ట నాగాధిపతి అయిన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దలు అనే పేరుతో పంపిణీ చేశారు. గరుడ ముద్దలు ప్రసాదంగా తీసుకుంటే సంతానం లేని దంపతులు సంతాన వంతులు కాగలరని భక్తుల విశ్వాసం. భారీగా తరలి వచ్చిన భక్తులు గరుడ ముద్దల ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు వ్యవహరించగా, ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వీఆర్‌కు మచిలీపట్నం ఎస్‌ఐ రమేష్‌బాబు

కోనేరుసెంటర్: మచిలీపట్నం సబ్‌ఇన్‌స్పెక్టర్ డి.రమేష్‌బాబును వీఆర్‌లోకి పంపుతూ కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, కీలకమైన కేసుల్లో సరైన ప్రతిభ కనబరచకపోవటంతో ఆగ్రహించిన ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

సామాన్య భక్తులే అజెండా


దుర్గగుడి పాలక మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కర్నాటి రాంబాబు
చిత్రంలో ఆలయ ఈఓ భ్రమరాంబ, కమిటీ సభ్యులు

- దుర్గగుడి తొలి పాలకవర్గ సమావేశంలో 19 అంశాలకు ఆమోదం
- అవన్నీ సామాన్య భక్తులకు మేలు చేసేవే
- స్నానఘాట్ నుంచి రెండు ఉచిత బస్సు సర్వీసులు
- ఉచితంగా చెప్పుల స్టాండ్
- ఇకపై భక్తులందరికీ కుంకుమ ప్రసాదం
- దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలకు అనుమతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ దుర్గగుడి పాలక మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన తొలి సమావేశంలోనే పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన బోర్డు సమావేశం మందిరంలో పాలక మండలి, దుర్గగుడి ఈఓ భ్రమరాంబ, ఇంజినీరింగ్ అధికారులు, ఏఈఓలు సమావేశమయ్యారు. మొత్తం 19 అంశాలకు ఆమోదం తెలిపారు. వాటిల్లో ప్రధానమైనవి ఇవే..

- కొండ దిగువన దుర్గాఘాట్ నుంచి కొండపై ఓం టర్నింగ్ వరకు రెండు ఉచిత బస్సు సర్వీసులను నడిపేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది. కరోనాకు ముందు దేవస్థానం రెండు బస్సులను ఉచితంగా నడిపేది. కరోనా సమయంలో వాటిని రద్దు చేయడంతో తిరిగి వాటిని పునరుద్ధరించాలని తీర్మానం చేసింది.
- ఇక అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల చెప్పులను ఉచితంగా భద్రపరచుకోవచ్చు. కొండ దిగువన మహా మండపం వద్ద కౌంటర్, ఓంటర్నింగ్ వద్ద ఉన్న కౌంటర్‌లలో ఈ సేవలను భక్తులు ఉచితంగా వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం జతకు రెండు రూపాయల చొప్పున దేవస్థానం వసూలు చేస్తోంది.
- అమ్మ వారి ఆశీస్సులు భక్తులందరికీ ఉండాలనే భావనతో శటారీ ఇవ్వాలని పాలక మండలి తీర్మానించింది. అంతే కాకుండా వీఐపీలు, సామాన్య భక్తులు అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ కుంకుమ ప్రసాదం ఇవ్వాలని తీర్మానించారు.
- అమ్మ వారికి ప్రతి నిత్యం సాయం సంధ్య వేళ జరిగే పంచ హారతుల సేవలో పాల్గొనే భక్తులు అందరికీ ఒక లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించారు.

దుర్గాఘాట్ ఆధునికీకరణ

భక్తులు అమ్మవారి ఘాట్‌గా భావించే దుర్గాఘాట్‌లో భక్తులు నదిలోకి దిగి పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులకు పాలక మండలి సభ్యులు సూచించారు. మోడల్ ఘాట్‌గా దీనిని తీర్చిదిద్దేందుకు అంచనాలను రూపొందించాలన్నారు. స్నాన ఘాట్‌లో భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయడంతో పాటు టాయిలెట్స్‌ను నిర్మించేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది.

సమావేశంలో ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, కేసరి నాగమణి, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవి, అనుమోలు ఉదయలక్ష్మి, నంబూరి రవి, చింకా శ్రీనివాసులు, కొలుకులూరి రామసీత, మారం వెంకటేశ్వరరావు, తొత్తడి వేదకుమారి, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా, ఏఈఓలు ఎన్. రమేష్‌బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లు, చలివేంద్రాలు

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని చైర్మన్ రాంబాబు సూచించారు. భక్తులు నడిచే ప్రదేశంలో కూల్ పెయింట్ వేయడంతో పాటు మజ్జిగ పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులను అమ్మవారి దర్శనంతో పాటు అన్న ప్రసాదం స్వీకరించేందుకు లిఫ్ట్‌లోకి అనుమతించాలని సిబ్బందిని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అమ్మవారికి నిత్యం జరిగే ఆర్జిత సేవల్లో పాల్గొనే ఉభయదాతలు, భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా ఆధునికమైన టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం నుంచి ఆమోదం తెలిపిన వెంటనే పనులు వేగంగా చేపడతామన్నారు.



సెమీస్‌లో శ్రీకాంత్‌కు షాక్

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. పుణేలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 19–21, 13–21తో మిథున్ మంజునాథ్ (రైల్వేస్) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి (తెలంగాణ)–ట్రెసా జాలీ (కేరళ) జోడీ ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–16, 21–18తో సిమ్రన్ –రితిక (మహారాష్ట్ర) జోడీపై నెగ్గింది.



గుజరాత్ జెయింట్స్ కెప్టెన్‌గా బెత్ మూనీ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ కెప్టెన్‌గా... భారత ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో తొలి డబ్ల్యూపీఎల్ జరగనుంది. 29 ఏళ్ల మూనీ ఇప్పటి వరకు 83 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడి 2 సెంచరీలు, 18 అర్ధ సెంచరీల సహాయంతో 2,380 పరుగులు చేసింది.

10 ఆలౌట్

- టి20 క్రికెట్‌లో 'ఐల్ ఆఫ్ మ్యాన్' జట్టు చెత్త రికార్డు
- 2 బంతుల్లో 2 సిక్సర్లతో స్పెయిన్ గెలుపు


స్పెయిన్ జట్టు

కార్టజెనా (స్పెయిన్): టి20లంటే ఎప్పుడు మెరుపులేనా? అప్పుడప్పుడు మలుపులుంటాయి... బౌలింగ్ దెబ్బలూ ఉంటాయి. బ్యాటర్లు, బ్యాటింగ్ జట్లే కాదు... పొట్టి క్రికెట్లో అరివీర భయంకర బౌలింగ్, బౌలర్లు కూడా తారెత్తిస్తారు. స్పెయిన్ జట్టు కూడా అదే పని చేసింది. 'ఐల్ ఆఫ్ మ్యాన్' అనే చిన్న ద్వీపదేశాన్ని క్రికెట్ చరిత్రలో నిలిచేంతగా దెబ్బ కొట్టింది. స్పానిష్ బౌలర్ల ధాటికి 11 మంది బరిలోకి దిగిన 'ఐల్ ఆఫ్ మ్యాన్' క్రికెట్ జట్టు అంతా కలిసి 10 పరుగులకే ఆలౌటైంది. ఇదో రికార్డు అయితే 11 పరుగుల లక్ష్యాన్ని స్పెయిన్ జట్టు రెండు సిక్సర్లతో పూర్తి చేయడం మరో విశేషం. అంటే 19.4 ఓవర్లు మిగిలుండగానే గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు 8.4 ఓవర్లలో 10 పరుగులకు కుప్పకూలింది. ఆరుగురు డకౌట్ కాగా, జోసెఫ్ (4) టాప్ స్కోరర్! స్పెయిన్ బౌలర్లలో మొహమ్మద్ కమ్రాన్, అతీఫ్ మెహమూద్ చెరో 4 వికెట్లు, బర్న్స్ 2 వికెట్లు తీశారు. అతీఫ్ 4 వికెట్లలో 'హ్యాట్రిక్' కూడా ఉంది. అతీఫ్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లోని తొలి మూడు బంతులకు ల్యూక్ వార్డ్, బియర్డ్, ఎడ్వర్డ్ వెబ్‌స్టర్ అవుటయ్యారు. 11 పరుగుల విజయ లక్ష్యాన్ని స్పెయిన్ బ్యాటర్ అవైస్ అహ్మద్ (12 నాటౌట్; 2 సిక్సర్లు) ఒక్కడే ముగించేశాడు. 'ఐల్ ఆఫ్ మ్యాన్' బౌలర్ జోసెఫ్ తొలి బంతి నోబాల్ వేయగా, 2, 3 బంతుల్ని అవైస్ భారీ సిక్సర్లుగా బాదాడు. 6 మ్యాచ్‌ల సిరీస్‌ను స్పెయిన్ 5–0తో కైవసం చేసుకుంది. వానతో రెండో టి20 రద్దయ్యింది. ఐల్ ఆఫ్ మ్యాన్ చెత్త రికార్డుతో రెండు రికార్డులు కనుమరుగయ్యాయి. అంతర్జాతీయ క్రికెట్లో చెక్ రిపబ్లిక్‌తో 2019లో జరిగిన పోరులో టర్కీ అత్యల్ప స్కోరు (21 ఆలౌట్) తెరమరుగైంది. ఇక ఓవరాల్ టి20 ఫార్మాట్‌లో అడిలైడ్ స్ట్రయికర్స్ ధాటికి సిడ్నీ థండర్స్ గత ఆగస్టులో 15 పరుగులకు ఆలౌటైన రికార్డు కూడా చెదిరిపోయింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)లో ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు 2017లో అసోసియేట్ సభ్య దేశంగా మారింది. 2018లో టి20 ప్రపంచకప్ యూరోప్ క్వాలిఫయింగ్ టోర్నీలో పోటీపడి ఆరో స్థానంలో నిలిచింది.

జొకోవిచ్ 'నంబర్‌వన్' రికార్డు

అత్యధిక వారాలు టాప్ ర్యాంక్‌లో నిలిచిన టెన్నిస్ ప్లేయర్‌గా గుర్తింపు



దుబాయ్: టెన్నిస్ చరిత్రలో ఏ ప్లేయర్‌కూ సాధ్యం కాని ఘనతను సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ సొంతం చేసుకున్నాడు. 1973 నుంచి టెన్నిస్‌లో కంప్యూటర్ ర్యాంకింగ్స్ మొదలయ్యాక అత్యధిక వారాలు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) తాజా ర్యాంకింగ్స్‌లో జొకోవిచ్ 6,980 పాయింట్లతో తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. దాంతో ఈ సెర్బియా స్టార్ నంబర్‌వన్ ర్యాంక్ హోదాలో 378 వారాలు పూర్తి చేసుకోవడం ఖాయమైంది. ఇప్పటి వరకు ఈ రికార్డు జర్మనీ దిగ్గజం, మహిళా స్టార్ స్టెఫీ గ్రాఫ్ పేరిట ఉంది. గ్రాఫ్ 377 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక వారాలు టాప్ ర్యాంక్‌లో నిలిచిన ప్లేయర్‌గా 2021 మార్చిలోనే జొకోవిచ్ గుర్తింపు పొందాడు. స్విట్జర్లాండ్ మేటి రోజర్ ఫెడరర్ (310 వారాలు) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు. తాజాగా అటు పురుషుల విభాగంలోగానీ, ఇటు మహిళల విభాగంలోగానీ అత్యధిక వారాలు నంబర్‌వన్‌గా నిలిచిన ప్లేయర్‌గా ఈ సెర్బియా యోధుడు చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. 'మీరందరి ప్రేమాభిమానం కారణంగా నా కెరీర్‌లో ఎన్నో కొత్త ఘనతలు సాధించాను. తాజాగా అత్యధిక వారాలు నంబర్‌వన్‌గా నిలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించినందుకు చాలా ఆనందంగా ఉంది' అని దుబాయ్ ఓపెన్‌లో పాల్గొనేందుకు వచ్చిన 35 ఏళ్ల జొకోవిచ్ వ్యాఖ్యానించాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ 2011 జూలై 4న 24 ఏళ్ల 43 రోజుల ప్రాయంలో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్ అయ్యాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచిన 28 ప్లేయర్లలో ఒకడైన జొకోవిచ్ రికార్డుస్థాయిలో ఏడుసార్లు సీజన్‌ను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించాడు.

అత్యధిక వారాలు అగ్రస్థానంలో నిలిచిన టాప్–5 ప్లేయర్లు

1. జొకోవిచ్	378 వారాలు
2. స్టెఫీ గ్రాఫ్	377 వారాలు
3. మార్టినా నవ్రతిలోవా	332 వారాలు
4. సెరెనా విలియమ్స్	319 వారాలు
5. రోజర్ ఫెడరర్	310 వారాలు

ఇంగ్లండ్ లక్ష్యం 258


విలియమ్సన్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్యటనలో ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్ చేసేందుకు సిద్ధమవుతోంది. రెండో టెస్టులో ఇంగ్లండ్ విజయానికి మరో 210 పరుగులు కావాలి. చేతిలో 9 వికెట్లున్నాయి. 258 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోయి 48 పరుగులు చేసింది. అంతకుముందు కివీస్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (132; 12 ఫోర్లు) వీరోచిత సెంచరీతో ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. ఫాలోఆన్‌లో 202/3 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 162.3 ఓవర్లలో 483 పరుగుల వద్ద ఆలౌటైంది. విలియమ్సన్ 29 పరుగులకు చేరుకోగానే రాస్ టేలర్ (7,682) రికార్డును అధిగమించి... న్యూజిలాండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...



న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) పురుషుల ప్రొ లీగ్‌లో భాగంగా ప్రపంచ చాంపియన్ జర్మనీ, నాలుగో ర్యాంకర్ ఆస్ట్రేలియా జట్లతో జరిగే మ్యాచ్‌ల్లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రూర్కెలాలో జరిగే మ్యాచ్‌ల్లో మార్చి 10న జర్మనీతో... 12న ఆస్ట్రేలియాతో...13న జర్మనీతో... 15న ఆస్ట్రేలియాతో భారత జట్టు తలపడుతుంది.

భారత హాకీ జట్టు: హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), హార్దిక్ సింగ్ (వైస్ కెప్టెన్), పీఆర్ శ్రీజేశ్, జుగ్‌రాజ్ సింగ్, నీలం సంజీప్ జెస్, జర్మన్‌ప్రీత్ సింగ్, సుమిత్, మంజీత్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, రబిచంద్ర సింగ్, విష్ణుకాంత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, షంషేర్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, ఎస్.కార్తీ, సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, గుర్జంత్ సింగ్.

మోహన్ హర్షకు రజతం



సాక్షి, హైదరాబాద్: ఫజా అంతర్జాతీయ పారాథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అథ్లెట్ ఉయ్యాల మోహన్ హర్ష రజత పతకం సాధించాడు. టి47 కేటగిరీ 100 మీటర్ల పరుగులో మోహన్ హర్ష 11.26 సెకన్లలో లక్ష్యానికి చేరి రెండో స్థానంలో నిలిచాడు.

ఐసీసీ జట్టులో రిచా ఘోష్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో ముగిసిన మహిళల టి20 ప్రపంచకప్‌లో రాణించిన రిచా ఘోష్‌కు ఐసీసీ 'మోస్ట్ వాల్యుబుల్ టీమ్'లో చోటు దక్కింది. భారత జట్టు నుంచి ఒక్క రిచాకే ఈ టీమ్‌లో స్థానం లభించడం విశేషం. ఈ మెగా టోర్నీలో 19 ఏళ్ల రిచా... 31 నాటౌట్ (పాక్‌పై), 44 నాటౌట్ (వెస్టిండీస్‌పై), 47 నాటౌట్ (ఇంగ్లండ్‌పై) ఇన్నింగ్స్‌లతో మొత్తం 136 పరుగులు చేసింది. ఆరోసారి విశ్వవిజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టు నుంచి అత్యధికంగా నలుగురు క్రికెటర్లు ఈ జట్టులోఎంపికయ్యారు.

ఫైనల్లో ఎస్‌ఆర్‌ఆర్, గౌతమ్ కాలేజీ జట్లు


గౌతమ్ కాలేజీ జట్టు

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర స్థాయి సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ జూనియర్ విభాగంలో ఎస్‌ఆర్‌ఆర్ కాలేజి (మంచిర్యాల), గౌతమ్ జూనియర్ కాలేజి (ఈసీఐఎల్) జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. సీనియర్ విభాగంలో వాగ్దేవి డిగ్రీ కాలేజి (మంచిర్యాల), భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజి (సైనిక్‌పురి) జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఫైనల్స్ నేడు జరుగుతాయి. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాప సింగారంలోని బాబురావు సాగర్ మైదానంలో ఈ టోర్నీ జరుగుతోంది. సోమవారం జరిగిన జూనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌ఆర్ కాలేజి తొమ్మిది వికెట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి (వరంగల్)పై గెలిచింది. ముందుగా పాలిటెక్నిక్ కాలేజి 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. అనంతరం ఎస్‌ఆర్‌ఆర్ కాలేజి 7.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 89 పరుగులు చేసి గెలుపొందింది. ఎస్‌ఆర్‌ఆర్ ప్లేయర్ కృష్ణతేజ 25 బంతుల్లో 52 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ గౌతమ్ జూనియర్ కాలేజి 67 పరుగుల తేడాతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి (వరంగల్)ను ఓడించింది. ముందుగా గౌతమ్ కాలేజి 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 119 పరుగులు చేసింది. అన్విత్ రెడ్డి 16 బంతుల్లో 32 పరుగులు చేశాడు. అనంతరం పాలిటెక్నిక్ కాలేజి 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 52 పరుగులకే పరిమితమై ఓడిపోయింది.

సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కాలేజి ఎనిమిది వికెట్లతో ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కాలేజి (ఖమ్మం)పై నెగ్గింది. ముందుగా ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కాలేజి 10 ఓవర్లలో 9 వికెట్లకు 74 పరుగులు చేయగా... వాగ్దేవి కాలేజి 6 ఓవర్లలో 2 వికెట్లకు 75 పరుగులు చేసి గెలిచింది. సాయి 16 బంతుల్లో 38 పరుగులు చేశాడు. సీనియర్ విభాగం రెండో మ్యాచ్‌లో భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజి ఐదు వికెట్లతో ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కాలేజిని ఓడించింది. మొదట ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. అనంతరం భవాన్స్ వివేకానంద కాలేజి 6.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసి గెలుపొందింది. భవాన్స్ ప్లేయర్ కృతిక్ 17 బంతుల్లో 51 పరుగులు సాధించాడు.

ప్రపంచ మహిళల బాక్సింగ్ పోటీలకు భారత జట్టు

50 కేజీల బరిలో నిఖత్ జరీన్



న్యూఢిల్లీ: వచ్చే నెల 15 నుంచి 26 వరకు స్వదేశంలో జరిగే ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగే ఈ మెగా ఈవెంట్‌లో 12 వెయిట్ కేటగిరీల్లో భారత బాక్సర్లు పోటీపడతారు. గత ఏడాది టర్కీలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 50 కేజీల విభాగంలో తాను సాధించిన స్వర్ణ పతకాన్ని న్యూఢిల్లీలోనూ నిలబెట్టుకునేందుకు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ బరిలోకి దిగనుంది.

భారత జట్టు: నీతూ ఘంఘాస్ (48 కేజీలు), నిఖత్ జరీన్ (50 కేజీలు), సాక్షి చౌదరీ (52 కేజీలు), ప్రీతి (54 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), జాస్మిన్ లంబోరియా (60 కేజీలు), శశి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు), సనమచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు), సవీటి బూరా (81 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 81 కేజీలు).

సినిమా


శ్రుతీహాసన్

నేను లక్కీ

'నేను చాలా లక్కీ' అంటున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. గత కొన్నేళ్లుగా శాంతను హజారికాతో శ్రుతీహాసన్ ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. వీలున్నప్పుడల్లా కలిసి రెస్టారెంట్, షాపింగ్ మాల్స్, పార్టీలకు వెళుతుంటారు శాంతను అండ్ శ్రుతి. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారామె. అందులో భాగంగా తాజాగా శాంతను హజారికాతో ఉన్న ఓ ఫోటోను షేర్ చేశారు శ్రుతీహాసన్. ''శాంతనుతో కలిసి బయటకువెళ్లి భోజనం చేయడాన్ని నేనెంతగానో ఆస్వాదిస్తుంటాను. మేమిద్దరం భోజన ప్రియులమే. భోజనం చేస్తూ మాట్లాడుకోవడం మా ఇద్దరికీ ఇష్టమైన అంశం. ఫుడ్‌ను ప్రేమించే వ్యక్తితో నేను ప్రేమలో ఉన్నందుకు అదృష్టంగా భావిస్తున్నా'' అని పేర్కొన్నారు శ్రుతీహాసన్. ఇక ఆమె హీరోయిన్‌గా నటించిన 'సలార్', ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.


● శ్రీనివాసా చిట్టూరి, ఇళయరాజా, నాగచైతన్య, వెంకట్ ప్రభు

ప్రముఖ సంగీత దర్శకుడు మాస్ట్రో ఇళయరాజా 'రాజా లైవ్ ఇన్ కాన్సర్ట్' కోసం హైదరాబాద్‌కి వచ్చారు. ఈ సందర్భంగా 'కస్టడీ' చిత్రబృందం ఆయన్ను కలిసి, అభినందనలు తెలిపింది. ఇళయరాజాను కలిసిన వారిలో హీరో నాగచైతన్య, డైరెక్టర్ వెంకట్ ప్రభు, నిర్మాత శ్రీనివాసా చిట్టూరి ఉన్నారు. కాగా 'కస్టడీ' చిత్రానికి ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.

ఆ అవకాశం రాలేదు

- రణ్‌బీర్ కపూర్



'భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ బయోపిక్‌లో నేను నటించబోతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు' అన్నారు బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్. డైరెక్టర్ లవ్ రంజన్ తెరకెక్కించిన తాజా హిందీ చిత్రం 'తూ ఝూటీ మై మక్కార్'. రణ్‌బీర్ కపూర్, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన ఈ చిత్రం మార్చి 8న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు రణ్‌బీర్ కపూర్. ''గంగూలీ గారికి ప్రపంచమంతా ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన బయోపిక్ అంటే అది అందరికీ స్పెషలే. కానీ ఆయన బయోపిక్‌లో నటించాలనే అవకాశం నాకు రాలేదు. నాకు తెలిసి ఈ బయోపిక్‌కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ఇంకా జరుగుతుందనుకుంటున్నాను'' అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ''ప్రముఖ గాయకులు, నటులు కిషోర్ కుమార్‌గారి బయోపిక్ కోసం 11ఏళ్లుగా వర్క్ జరుగుతోంది. దర్శక–నిర్మాత, నటుడు అనురాగ్ బసు ఈ స్క్రిప్ట్ వర్క్‌లో భాగస్వామిగా ఉన్నారు. నేను చేయబోయే నెక్ట్స్ బయోపిక్ కిషోర్ కుమార్‌గారిదే అవుతుందనుకుంటున్నాను'' అన్నారు. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'యానిమల్' చేస్తున్నారు రణ్‌బీర్ కపూర్. ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టు 11న రిలీజ్ కానుంది.

రోబోలా నటించా


● హన్సిక

హీరోయిన్ హన్సిక రోబోలాగా నటించారు. ఎమ్.రాజేష్ దర్శకత్వంలో హన్సిక, ముగెన్ రావ్, శాంతను, జనని ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్‌సిరీస్ 'ఎమ్‌వై 3'. సౌత్ కొరియన్ టెలివిజన్ సిరీస్ 'ఐ యామ్ నాట్ ఏ రోబోట్' ఆధారంగా 'ఎమ్‌వై 3' సిరీస్ రూపొందింది. ఈ సిరీస్‌లో నటించిన అనుభవాన్ని తాజాగా పంచుకున్నారు హన్సిక. ''ఈ కథ విన్నప్పుడు ఇందులోని పాత్రలు పోషించడం చాలా సులువు అనుకున్నాను. కానీ నా కెరీర్‌లోనే అత్యంత కష్టమైన ప్రాజెక్ట్ ఇది.. ఎందుకంటే ఇందులో నేను ద్విపాత్రాభినయం చేశాను. అందులో ఓ పాత్ర రోబో. దీంతో రోబోలాగా నటించాల్సి వచ్చింది. షూటింగ్ సమయంలో కనురెప్పలు వాల్చకూడదు.. అలాగే కొన్ని సెకన్లపాటు శ్వాస కూడా తీసుకోకూడదు.. ప్లాస్టిక్ బొమ్మలా ఉండాలి. ఇది చాలా కష్టంగా అనిపించింది. అయితే నా కెరీర్‌లో బెస్ట్ క్యారెక్టర్ కూడా ఇదే. 'ఐ యామ్ నాట్ ఏ రోబోట్' సిరీస్‌ను నేను చూడలేదు. చూసి అందులో చేసినట్లు నటించడం నాకు ఇష్టం ఉండదు. కొత్తగా, ఫ్రెష్‌గా చేయడమే నాకు నచ్చుతుంది'' అన్నారు హన్సిక.


ఇకపై అలా జరగదు

- సమంత


● సమంత


''గతంలో ఎన్నో విషయాలు నన్ను బాధపెట్టాయి. కానీ ఇకపై అలా జరగదు. కేవలం ప్రేమ, కృతజ్ఞతతో మాత్రమే ముందుకు సాగుతున్నా'' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'ఏమాయ చేసావె'. నాగచైతన్య హీరోగా గౌతమ్ వాసుదేవ మీనన్ దర్శకత్వం వహించారు. 2010 ఫిబ్రవరి 26న విడుదలైన ఈ సినిమా మంచి హిట్ అయింది. ఈ మూవీలో జెస్సీ పాత్రలో అలరించారు సమంత. ఈ సినిమా విడుదలై ఆదివారంతో (2023 ఫిబ్రవరి 26) 13 ఏళ్లు పూర్తయ్యాయి. చిత్ర పరిశ్రమలో విజయవంతంగా 13 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తన సినీ జర్నీపై భావోద్వేగ ప్రకటనని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు సమంత. ''మీరంతా నాపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను థ్యాంక్స్. నేను ఎంత ఎదిగినా, ఎంత దూరం ప్రయాణించినా మీరు చూపించే ప్రేమాభిమానాన్ని మర్చిపోలేను. నాపై ఇంతటి అభిమానం చూపిస్తున్నందుకు థ్యాంక్స్.. ఇది ఎప్పటికీ ఇలాగే ఉండాలి. అలాగే నాకు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను పరిచయం చేస్తోన్న ప్రతిరోజుకూ ధన్యవాదాలు'' అన్నారు. కాగా సమంత ప్రస్తుతం 'సిటాడెల్' అనే వెబ్ సిరీస్‌తో పాటు విజయ్ దేవరకొండకి జోడీగా 'ఖుషి' చిత్రంలో నటిస్తున్నారు.

యాక్షన్ ధ్రువ


● విక్రమ్

విక్రమ్ హీరోగా, రీతూ వర్మ, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ధ్రువనక్షత్రం'. గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సిమ్రాన్, ఆర్.పార్తీబన్ కీలక పాత్రలు చేశారు. స్పై అండ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన 'ధ్రువనక్షత్రం' త్వరలో థియేటర్స్‌లోకి రానుంది. ఈ చిత్రంలో ధ్రువ పాత్రలో నటించారు విక్రమ్. 2016లో ఈ సినిమాకు సంబంధించిన వర్క్స్ మొదలయ్యాయి. ఈ మూవీ మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వస్తుందనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. కానీ ఇప్పటి వరకు తొలిపార్టు కూడా రిలీజ్ కాలేదు. మొదటి భాగం షూటింగ్ పూర్తి కావడంతో ప్రస్తుతం నేపథ్య సంగీతం పనులు స్టార్ట్ అయ్యాయి. ఈ విషయాన్ని చిత్ర సంగీత దర్శకుడు హారీష్ జైరాజ్ తెలిపారు. 'త్వరలో థియేటర్స్‌లో కలుద్దాం' అన్నారాయన. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడ్డ 'ధ్రువనక్షత్రం' చిత్రం ఈ ఏడాది రిలీజ్ అవుతుందని కోలీవుడ్ టాక్.

వేసవిలో బిచ్చగాడు


● విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోనీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'బిచ్చగాడు 2'. కావ్య థాపర్ హీరోయిన్. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్‌పై ఫాతిమా విజయ్ ఆంటోనీ నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ మూవీ రూపొందింది. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ మిల్టన్ ఓం ప్రకాష్, రచన, సంగీతం, ఎడిటింగ్, దర్శకత్వం: విజయ్ ఆంటోనీ.

క్రైమ్ కామెడీ


● శ్వేత అవస్థి

నరేష్ అగస్త్య, శ్వేత అవస్థి జంటగా వీరభద్రమ్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దిల్ వాలా'. డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్‌పై నబీ షేక్, తూము నర్సింహా పటేల్ నిర్మిస్తున్న ఈ సినిమా టాకీ పార్ట్ పూర్తయింది. ''క్రైమ్ కామెడీ జోనర్‌లో రూపొందుతోన్న చిత్రమిది. బ్యాలెన్స్ ఉన్న రెండు పాటలను బ్యాంకాక్‌లో చిత్రీకరిస్తాం. ఏప్రిల్‌లో రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు వీరభద్రమ్ చౌదరి. వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్, ప్రగ్యా నైనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిత్, సంగీతం: అనూప్ రూబెన్స్.

మ్యాచింగ్.. మ్యాచింగ్


● పూజ, ఈశ్వర్, నైనా

ఈశ్వర్, నైనా సర్వార్ జంటగా రాజేష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాస రావు, విష్ణువర్ధన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదలకానుంది. రోషన్ సాలూరి, గౌర హరి సంగీతం అందించారు. ఈ మూవీలోని 'మ్యాచింగ్.. మ్యాచింగ్..' అనే ప్రత్యేక పాటను 'సెలబ్రిటీ క్రికెట్ లీగ్' బాలీవుడ్ టీమ్ అధ్యక్షుడు షకీల్ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : పాండు అలిజాల, కెమెరా: అరుణ్ ప్రసాద్.

సినిమాలపై ఇష్టంతో...

ప్రముఖ వ్యాపారవేత్త బి.శ్రీ రంగం శ్రీనివాస్ 'అమేజింగ్ స్క్రీన్ రీల్స్' (ఏఎస్‌ఆర్) పేరుతో ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి వస్తున్నారు. తాజాగా 'ఏఎస్‌ఆర్' లోగోని డైరెక్టర్ సముద్ర, నిర్మాత శోభారాణి లాంచ్ చేశారు. శ్రీరంగం శ్రీనివాస్ మాట్లాడుతూ–''సినిమాలపై ఉన్న ఇష్టంతో పాటు ఇండస్ట్రీలో కొత్త వాళ్లకి అవకాశాలు ఇచ్చి, సపోర్ట్‌గా నిలవాలని ఏఎస్‌ఆర్ సంస్థను స్థాపించాం'' అన్నారు. నిర్మాత లగడపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


● లోగో రిలీజ్ చేస్తున్న సముద్ర

సాక్షి బిజినెస్
మంగళవారం
28-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
176	73
59,288	17,392

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	11,485	△	91
డోజోన్స్	32,970	△	93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,935	△	56
డాక్స్	15,381	△	172
షాంఘై	3,258	▽	9
నికాయ్	27,423	▽	30

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	55,666
బంగారం (22 క్యారట్)	55,443
వెండి (కిలో)	63,466

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.12	83.79
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	97.42	100.70
€	యూరో	ఒకటికి	85.93	89.01
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	59.86	61.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	54.56	56.91
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	60.44	62.38
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.09	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.66	23.45
¥	చైనా యువాన్	పదింటికి	11.80	12.87

ఈ ఏడాది మధ్యలో టారిఫ్‌ల పెంపు

ఎయిర్‌టెల్ చీఫ్ మిట్టల్ వెల్లడి



బార్సెలోనా: ఈమధ్యే పలు దఫాలుగా ప్లాన్ల టారిఫ్‌లను పెంచిన టెలికం సంస్థ భారతి ఎయిర్‌టెల్ మరో విడత వడ్డింపునకు సిద్ధమవుతోంది. పెట్టుబడులపై రాబడులు అత్యంత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో టారిఫ్‌లను పెంచే అవకాశం ఉందని కంపెనీ చైర్మన్ సునీల్ మిట్టల్ తెలిపారు. దీనివల్ల అట్టడుగున ఉన్నవారిపై పడే ప్రభావంపై స్పందిస్తూ.. ప్రజలు మిగతా వాటిపై చేసే ఖర్చులతో పోలిస్తే పెంపు చాలా స్వల్పమే ఉంటుందని పేర్కొన్నారు. 'ఒక్కటి తప్ప.. అన్నీ పెరిగాయి. జీతాలు .. అద్దెలు పెరిగాయి. ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ప్రజలు 30 జీబీ డేటాను దాదాపు ఏమీ కట్టకుండానే వినియోగిస్తున్నారు. దేశంలో మరో వొడాఫోన్ తరహా పరిస్థితి తలెత్తకూడదు. మనకు ఒక భారీ టెలికం సంస్థ అవసరం' అని మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొన్న సందర్భంగా మిట్టల్ చెప్పారు.

కోటి మందికి ఎయిర్‌టెల్ 5జీ

టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ కోటి మంది 5జీ చందాదార్లను సొంతం చేసుకుంది. 2024 మార్చి నాటికి దేశంలోని ప్రతి పట్టణం, ప్రధాన గ్రామీణ ప్రాంతాల్లో 5జీ సేవలను చేర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు సోమవారం ప్రకటించింది. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో అడుగుపెట్టినట్టు తెలిపింది. ప్రపంచ స్థాయి 5జీ ప్లస్ అనుభూతిని అందించడానికి సరైన మార్గంలో ఉన్నట్టు విశ్వసిస్తున్నామని సంస్థ సీటీవో రణ్‌దీప్ సెఖోన్ తెలిపారు. 2022 నవంబర్‌లో 10 లక్షల మంది కస్టమర్లు కంపెనీ 5జీ వేదికపైకి వచ్చారు. వాణిజ్య పరంగా సేవలు ప్రారంభించిన 30 రోజుల్లోనే ఈ ఘనతను సాధించామని ఎయిర్‌టెల్ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్లను 5జీ ఎక్స్‌పీరియెన్స్ జోన్స్‌గా తీర్చిదిద్దామని కంపెనీ వివరించింది.

ఇన్ఫీ నుంచి ప్రైవేట్ '5జీ సర్వీసులు'



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తాజాగా తమ క్లయింట్ల కోసం ప్రైవేట్ 5జీ–యాజ్–ఎ–సర్వీస్‌ను ప్రారంభించింది. దీనితో కంపెనీలకు అధిక బ్యాండ్‌విడ్త్, తక్కువ లేటెన్సీ, విశ్వసనీయ వైర్‌లెస్ కనెక్టివిటీ లభించగలదని సంస్థ తెలిపింది. డేటా ప్రాసెసింగ్‌కు పట్టే వ్యవధిని కుదించడం ద్వారా నెట్‌వర్క్‌లో జాప్యాన్ని తగ్గించగలిగే మల్టీ–యాక్సెస్ ఎడ్జ్ కంప్యూటింగ్ సాంకేతికతను ఇందులో వినియోగిస్తున్నట్లు ఇన్ఫీ తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ చేతికి మేన్ ఫార్మా పోర్ట్‌ఫోలియో

105 మిలియన్ డాలర్ల డీల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆస్ట్రేలియన్ సంస్థ మేన్ ఫార్మా గ్రూప్‌నకు చెందిన అమెరికన్ ప్రిస్క్రిప్షన్ ఔషధాల పోర్ట్‌ఫోలియోను దేశీ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్ఎల్) కొనుగోలు చేయనుంది. ఇందుకోసం 105 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 860 కోట్లు) వెచ్చించనుంది. దీనికి సంబంధించి మేన్ ఫార్మాతో తమ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఎస్ఏ ఒప్పందం కుదుర్చుకున్నట్లు డీఆర్ఎల్ తెలిపింది. ఒప్పందం ప్రకారం 90 మిలియన్ డాలర్లను ముందుగా నగదు రూపంలో చెల్లించనుండగా, నిర్దిష్ట అంశాలకు లోబడి 15 మిలియన్ డాలర్ల వరకూ చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ పోర్ట్‌ఫోలియోలో 45 ఉత్పత్తులు, అభివృద్ధి దశలో ఉన్న నాలుగు ప్రొడక్టులతో పాటు మహిళల ఆరోగ్యానికి సంబంధించి పలు జనరిక్ ఔషధాలు ఉన్నట్లు డీఆర్ఎల్ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ తెలిపారు. గతేడాది జూన్ 30తో ముగిసిన సంవత్సర కాలానికి ఈ పోర్ట్‌ఫోలియో ఔషధాల విక్రయాలు 111 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వివరించారు.



అమెరికాలో వ్యాపారానికి ఊతం..

అమెరికాలోని తమ రిటైల్ ప్రిస్క్రిప్షన్ ఔషధాల వ్యాపారానికి ఈ పోర్ట్‌ఫోలియో మరింతగా ఊతమివ్వగలదని ఇజ్రేలీ తెలిపారు. అలాగే, పేషంట్లకు చౌకగా ఔషధాలను మరింతగా అందుబాటులోకి తేవాలన్న తమ లక్ష్యానికి కూడా తోడ్పాటునివ్వగలదని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల విభాగంలో గణనీయంగా వాటాను పెంచుకోవడానికి దోహదపడగలదని వివరించారు.

సోమవారం బీఎస్ఈలో డాక్టర్ రెడ్డీస్ షేరు 2% మేర క్షీణించి రూ. 4,415 వద్ద ముగిసింది.

ఏపీలో విష్ణు కెమికల్స్ పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ విష్ణు కెమికల్స్ కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. వచ్చే అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లో స్పెషాలిటీ కెమికల్స్ ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనకు బోర్డు సోమవారం ఆమోదముద్ర వేసినట్లు తెలిపింది. విష్ణు కెమికల్స్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా 57 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఆటోమొబైల్, ఫార్మా, ఉక్కు తదితర పరిశ్రమలకు ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.



ఏడో రోజూ నష్టాలే

- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- నెల కనిష్టానికి సెన్సెక్స్
- నాలుగు నెలల కనిష్టానికి నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావంతో స్టాక్ సూచీలు ఏడోరోజూ నష్టాలను చవిచూశాయి. ఐటీ, మెటల్, ఆటో షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 176 పాయింట్లు పతనమై 59,288 వద్ద, నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 17,392 వద్ద స్థిరపడ్డాయి. సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో సెన్సెక్స్ 526 పాయింట్లు క్షీణించి 59,464 వద్ద, నిఫ్టీ 166 పాయింట్లు పతనమై 17,299 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే మిడ్ సెషన్ తర్వాత యూరప్ మార్కెట్లలో సానుకూల ర్యాలీతో పాటు ప్రైవేట్ బ్యాంక్, రియల్టీ, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీల నష్టాలు కొంతమేర తగ్గాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.28%, మిడ్‌క్యాప్ సూచీ 0.69 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2022 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2232 కోట్ల షేర్లను కొన్నారు. వడ్డీరేట్ల పెంపు భయాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ పది పైసలు నష్టపోయి 82.85 స్థాయి వద్ద స్థిరపడింది.

■ గడిచిన ఏడు రోజుల్లో సెన్సెక్స్ 2,031 పాయింట్లు(3.5%) నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.10.37 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.257 లక్షల కోట్లకు దిగివచ్చింది.

దేశీ మార్కెట్‌పై గ్లోబల్ దిగ్గజాల కన్ను

- కన్జూమర్ ప్రొడక్టుల విక్రయాలపై భారీ ఆశలు
- జాబితాలో పెప్సీకో, కోకకోలా, మాండెలెజ్
- యూనిలీవర్, లారియల్ కొత్త వ్యూహాలు

ముంబై: కన్జూమర్ ప్రొడక్టుల గ్లోబల్ దిగ్గజాలు దేశీ వినియోగ మార్కెట్‌పై సానుకూలంగా స్పందిస్తున్నాయి. ప్రధానంగా పెప్సీకో, కోకకోలా, మాండెలెజ్ యూనిలీవర్, లారియల్ దేశీయంగా పటిష్ట అమ్మకాలు సాధించాలని ప్రణాళికలు వేస్తున్నాయి. ఇందుకు దేశీ ఆర్థిక వృద్ధి పరిస్థితులు సహకరించనున్నట్లు పేర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ పరిస్థితులకుతోడు, స్థూల ఆర్థిక వాతావరణం అనిశ్చింతగా ఉన్నప్పటికీ ఇండియా గ్రోత్ స్టోరీ పలు అవకాశాలను కల్పించనున్నట్లు అంచనా వేస్తున్నాయి. గత కేలండర్ ఏడాది(2022)లో పటిష్ట అమ్మకాలు సాధించడంతో ఈ ఏడాది(2023)లోనూ మరింత మెరుగైన పనితీరును సాధించాలని ఆశిస్తున్నాయి. 2022 ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తూ కన్జూమర్ ప్రొడక్ట్ దిగ్గజాలు పలు అంచనాలను ప్రకటించాయి.

మార్కెట్‌ను మించుతూ

సౌందర్య కేంద్రంగా ఆవిర్భవించే బాటలో భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నట్లు కాస్మెటిక్ ప్రొడక్టుల దిగ్గజం లారియల్ పేర్కొంది. గతేడాది పటిష్ట అమ్మకాలు సాధించామని, మార్కెట్‌ను మించి రెండు రెట్లు వృద్ధిని అందుకున్నట్లు తెలియజేసింది. ఇండియా తమకు అత్యంత ప్రాధాన్యత గల మార్కెట్ అని పేర్కొంటూ భారీ లక్ష్యాలతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించింది. గణాంకాల ప్రకారం చూస్తే 2030కల్లా ఇండియా ప్రపంచ జనాభాలో 20 శాతం వాటా, నైపుణ్యంగల సిబ్బందిలో 30 శాతం వాటాను ఆక్రమించుకోనున్నట్లు అభిప్రాయపడింది. వెరసి కంపెనీ వృద్ధికి దేశీ మార్కెట్ కీలకంగా నిలవనున్నట్లు తెలియజేసింది.



పానీయాలకు భళా

2022కు పానీయాల అమ్మకాల్లో ఇండియా మార్కెట్ అత్యుత్తమంగా నిలిచినట్లు కోకకోలా చైర్మన్, సీఈవో జేమ్స్ క్విన్సీ పేర్కొన్నారు. పానీయాల విభాగంలో ఇండియా మార్కెట్ అత్యంత భారీగా విస్తరించే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు. దీంతో పలు అవకాశాలకు తెరలేవనున్నట్లు తెలియజేశారు. బెవరేజెస్ వినియోగంలో దీర్ఘకాలిక మార్కెట్‌గా నిలవనున్నదని, ఇకపై మరింత వృద్ధికి వీలున్నదని అంచనా వేశారు. వినియోగ రంగంలో 2022లో దేశీయంగా విస్తారమైన వృద్ధి నమోదైనట్లు యూనిలీవర్ పేర్కొంది. పోటీతత్వం, విభిన్న బ్రాండ్లు, ధరల పోర్ట్‌ఫోలియో ద్వారా వినియోగదారులను ఆకట్టుకున్నట్లు వివరించింది. గ్రామీణ ప్రాంతాలకుమించి పట్టణాలలో విక్రయాలు ఊపందుకున్నట్లు కంపెనీ సీఈవో అలెన్ జోప్ వెల్లడించారు. ఇకపైన సైతం మార్కెట్‌ను మించిన వృద్ధిని అందుకోగలమని భావిస్తున్నట్లు తెలియజేశారు.

రెండంకెల వృద్ధి

2022లో దేశీయంగా రెండంకెల వృద్ధిని అందుకున్నట్లు ఎఫ్ఎంసీజీ దిగ్గజం మాండెలెజ్ తెలియజేసింది. ప్రధానంగా చాకొలెట్లు, బిస్కట్లతోకూడిన పోర్ట్‌ఫోలియో జోరు చూపినట్లు పేర్కొంది. గతేడాది ఇండియా, బ్రెజిల్ మార్కెట్లలో అత్యధిక స్థాయిలో అమ్మకాలు సాధించినట్లు వెల్లడించింది. ఇక బెవరేజెస్ దిగ్గజం పెప్సీకో సైతం దేశీయ మార్కెట్లో గతేడాది అత్యంత పటిష్ట వృద్ధిని సాధించినట్లు తెలియజేసింది. పానీయాలతోపాటు.. స్నాక్స్ అమ్మకాల ద్వారా మార్కెట్ వాటాను పెంచుకున్నట్లు వెల్లడించింది.

డివ్‌జీ టార్క్ ఇష్యూ @ రూ. 560-590

మార్చి 1–3 మధ్య పబ్లిక్ ఇష్యూ

న్యూఢిల్లీ: ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ డివ్‌జీ టార్క్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూ మార్చి 1న ప్రారంభంకానుంది. 3న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 560–590గా నిర్ణయించింది. తద్వారా రూ. 412 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ నేడు(28న) ప్రారంభంకానుంది. ఐపీవోలో భాగంగా రూ. 180 కోట్ల ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 39.34 లక్షల షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు, వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను పెట్టుబడి వ్యయాలు, తయారీ సౌకర్యాల పరికరాల కొనుగోలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 25 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. కంపెనీ ప్రధానంగా సిస్టమ్ లెవెల్ ట్రాన్స్‌ఫర్ కేస్, టార్క్ కప్లర్, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్లు అందిస్తోంది. క్లయింట్ల జాబితాలో ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ ఆటో పార్ట్స్ తదితరాలున్నాయి. మార్చి 14న కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ అయ్యే వీలుంది.

రూ. 2,500 కోట్లతో శ్యామ్ స్టీల్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టీఎంటీ ఉక్కు కడ్డీల తయారీ సంస్థ శ్యామ్ స్టీల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తమ రిటైల్ కార్యకలాపాలను మరింతగా విస్తరించనుంది. వచ్చే అయిదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 500 పైచిలుకు డీలర్ డిస్ట్రిబ్యూటర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించుకున్నట్లు కంపెనీ డైరెక్టర్ లలిత్ బెరివాలా తెలిపారు. అలాగే నటుడు విజయ్ దేవరకొండను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు పేర్కొన్నారు. ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు రూ. 2,500 కోట్ల మేర ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లోని ప్లాంటుపై రూ. 1,000 కోట్లు, మరో కొత్త ప్లాంటుపై రూ. 1,500 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు బెరివాలా చెప్పారు. ప్రస్తుత సామర్థ్యం వార్షికంగా 0.7 మిలియన్ టన్నులుగా ఉండగా, దీన్ని 1 మిలియన్ టన్నులకు పెంచుకుంటున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 4,500 కోట్ల టర్నోవరు నమోదు కాగా వచ్చే మూడేళ్ల వ్యవధిలో దీన్ని రూ. 9,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సీఐపీఈటీ అడ్మిషన్ టెస్ట్–2023

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీఐపీఈటీ) 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత

» డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ అండ్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ): పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: రెండేళ్లు.
» డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ): పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: మూడేళ్లు.
» పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ కాడ్/కామ్: డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: 1.5 ఏళ్లు.
» పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్: మూడేళ్ల సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు వ్యవధి: రెండేళ్లు.
» ఎంపిక విధానం: కంప్యూటర్ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 28.05.2023.
» సీపెట్ పరీక్ష తేది: 11.06.2023.
» వెబ్‌సైట్: www.cipet.gov.in

యూపీఎస్సీలో 43 పోస్టులు

ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కేంద్ర విభాగాలు/ శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 43.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ డైరెక్టర్–క్యాపిటల్ మార్కెట్(సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్)–01, అసిస్టెంట్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్–కన్నడ(సెంట్రల్ సెక్రటేరియట్ లైబ్రరీ)–01, స్పెషలిస్ట్ గ్రేడ్3–రేడియో–డయాగ్నసిస్(హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)–14, స్పెషలిస్ట్ గ్రేడ్3–ఒబ్‌స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ(హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)–12, స్పెషలిస్ట్ గ్రేడ్3–ట్యూబర్క్యులోసిస్(హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్)–03, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ–ఎలక్ట్రికల్(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ)–03, డిప్యూటీ ఓర్ డ్రెస్సింగ్ ఆఫీసర్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)–05, మినరల్ ఆఫీసర్–ఇంటెలిజెన్స్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)–04.
» అర్హత: సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ, ఎంబీఏ, బీఎల్ఐఎస్సీ, ఎంబీబీఎస్, డీఎం, ఎంఎస్, ఎంసీహెచ్, డిప్లొమా, బీఈ, బీటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.03.2023.
» వెబ్‌సైట్: www.upsc.gov.in

ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్.. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» కోర్సుల వివరాలు: ఫుల్ టైం పీహెచ్‌డీ(అండర్ విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ)–02 సీట్లు.
» విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» అర్హత: 55శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్(ఈసీఈ/సీఎస్ఈ) ఉత్తీర్ణులై ఉండాలి.
» ఫెలోషిప్: నెలకు రూ.38,750(మొదటి, రెండో సంవత్సరం), రూ.43,750 (మూడు, నాలుగు, ఐదో సంవత్సరం)తోపాటు రెంట్ రీయింబర్స్‌మెంట్, రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ అందుతుంది.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.03.2023.
» వెబ్‌సైట్: online.uceou.edu.

పీవీ ఎన్‌ఆర్‌వీయూ, రాజేంద్రనగర్‌లో ఎంవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం.. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» మాస్టర్ ఆఫ్ వెటర్నరీ కోర్సులు: 40 సీట్లు(రాష్ట్ర కోటా కింద 30, ఇన్–సర్వీస్ అభ్యర్థులకు 10 సీట్లు కేటాయించారు).
» విభాగాలు: వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ.
» అర్హత: సంబంధిత విభాగంలో బీవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.07.2022 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఐసీఏఆర్–ఏఐఈఈఏ(పీజీ)–2022 ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.03.2023.
» కౌన్సెలింగ్ తేది: 16.03.2023.
» మొదటి సెమిస్టర్ రిజిస్ట్రేషన్ తేది: 23.03.2023.
» వెబ్‌సైట్: tsvu.nic.in

మేనేజ్‌మెంట్ పీజీకి మరో మార్గం.. సీమ్యాట్!

కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా సీమ్యాట్! దేశవ్యాప్తంగా ఉన్న.. ఏఐసీటీఈ అనుబంధ కళాశాలలు, ఇతర ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంబీఏ, పీజీడీఎం సహా.. పీజీ స్థాయిలో పలు మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది!! ఎన్‌టీఏ.. తాజాగా సీమ్యాట్–2023 దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. సీమ్యాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్...

» వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్స్‌కు సీమ్యాట్ స్కోర్ ప్రామాణికం
» ఎంబీఏ, మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం
» సీమ్యాట్‌తోపాటు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు
» సీమ్యాట్–2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం



మేనేజ్‌మెంట్‌లో పీజీ లేదా ఎంబీఏ ప్రోగ్రామ్‌ల నగానే.. ఎక్కువ మంది విద్యార్థులు క్యాట్, ఐసెట్‌లపైనే గురిపెడతారు. వీటిలో ర్యాంకు రాకపోతే నిరాశకు గురవుతారు.అలాంటి వారికి చక్కటి ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.. సీమ్యాట్. క్యాట్, ఐసెట్ సన్నద్ధతతో సీమ్యాట్‌లో సులువుగా విజయం సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్‌లు

సీమ్యాట్ స్కోర్‌తో.. ప్రస్తుతం దేశంలో వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏ తదితర పీజీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరే అవకాశముంది. ఏఐసీటీఈ అనుబంధ కళాశాలల్లో సీమ్యాట్ స్కోర్‌తో ఎంబీఏలో చేరొచ్చు. అదే విధంగా.. డి.వై పాటిల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(ఐపీఈ), ఐఐఆర్ఎం, కె.జె.సోమయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, గ్జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీస్–రాంచీ తదితర ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా సీమ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణ, కర్ణాటక తదితర రాష్ట్రాలు సీమ్యాట్‌ను అధికారిక పరీక్షగా ప్రకటించాయి. దీంతో క్యాట్, ఎక్స్‌ఏటీలలో మంచి ర్యాంకు దక్కని విద్యార్థులకు సీమ్యాట్ చక్కని ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.

అర్హత

సీమ్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

అయిదు విభాగాలు.. 400 మార్కులు

- జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే సీమ్యాట్ పరీక్షను మొత్తం అయిదు విభాగాల్లో 400 మార్కులకు నిర్వహిస్తారు.
- క్వాంటిటేటివ్ టెక్నిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాజికల్ రీజనింగ్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు –80 మార్కులు; జనరల్ అవేర్‌నెస్ 20ప్రశ్నలు–80 మార్కులు; ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 20ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది.
- పరీక్షకు కేటాయించిన సమయం 3 గంటలు.
- ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి.
- ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు.
- నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

మలి దశలో జీడీ, పీఐలు

సీమ్యాట్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్‌లు మలిదశలో.. గ్రూప్ డిస్కషన్(జీడీ), పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ) నిర్వహిస్తున్నాయి. వీటిల్లో చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, సీమ్యాట్ స్కోర్‌కు వెయిటేజీ కల్పించి ప్రవేశాలు ఖరారు చేస్తున్నాయి. గ్రూప్ డిస్కషన్‌లో.. కరెంట్ అఫైర్స్, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ నైపుణ్యాలను పరిశీలిస్తున్నారు. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు నేరుగా సీమ్యాట్ స్కోర్ ఆధారంగా కనీస కటాఫ్‌ను నిర్దేశించి.. ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందించి సీట్లు భర్తీ చేస్తున్నాయి.

మెరుగైన స్కోర్‌కు మార్గాలివే

క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్

గణిత, డేటా విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి స్కోర్ సాధించాలంటే.. అర్థమెటిక్–రేషియో, మిక్చర్స్, వర్క్, యావరేజ్, పర్సంటేజెస్, టైమ్ అండ్ స్పీడ్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, బేసిక్ స్టాటిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా నెంబర్ ప్రాపర్టీస్, ప్రాబబిలిటీ, కౌంటింగ్ ప్రిన్సిపల్స్, జామెట్రీ, డెరివేటివ్స్ (మ్యాగ్జిమా–మినిమా) వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి టేబుల్స్,పై ఛార్ట్స్, బార్ డయాగ్రమ్స్ అండ్ గ్రాఫ్స్, ఛార్ట్‌లను పరిశీలించడం, వాటిలోని గణాంకాలను విశ్లేషించడం వంటి నైపుణ్యాలు సొంతం చేసుకునేలా ప్రిపరేషన్ సాగించాలి.

లాజికల్ రీజనింగ్

అభ్యర్థుల్లోని తార్కిక విశ్లేషణను గుర్తించే విభాగం ఇది. ఇందులో లాజికల్ రీజనింగ్‌లోని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు ప్రిపరేషన్‌లో లీనియర్, సీటింగ్, సీక్వెన్సింగ్ అండ్ అరేంజింగ్ విత్ కండిషన్స్ టు కోడింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. స్టేట్‌మెంట్స్–కంక్లూజన్, లాజికల్ పజిల్, న్యూమరికల్ పజిల్, వెన్ డయాగ్రమ్, ట్రూ–ఫాల్స్ స్టేట్‌మెంట్స్, విజువల్ రీజనింగ్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టితో ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం క్యాట్, ఎక్స్‌ఏటీ తదితర పరీక్షల పూర్వ ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్

ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో యూసేజ్ ఆఫ్ ఆర్టికల్స్, యూసేజ్ ఆఫ్ నౌన్స్ అండ్ ప్రొనౌన్స్, ఆడ్జెక్టివ్స్, ఆడ్‌వెర్బ్స్, ప్రిపోజిషన్స్–రెగ్యులర్, ఫాలోవుడ్, సింటాక్స్, సబ్జెక్ట్–వెర్బ్ అరేంజ్‌మెంట్, సింపుల్, కంటిన్యూయస్, పర్ఫెక్ట్ టెన్సెస్ అండ్ కండిషనల్ అన్‌రియల్ పాస్ట్, జంబల్డ్ పారాగ్రాఫ్స్ వంటి అంశాలపై పట్టు సాధించడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకునే వీలుంది. అదే విధంగా రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజెస్ కూడా ఈ విభాగంలో ఉంటాయి.

500 నుంచి 600 పదాలతో పాసేజ్‌లు ఇస్తారు. తర్వాత పాసేజ్‌కు సంబంధించిన ఇంటర్‌ఫియరెన్స్ డ్రాన్, సెంట్రల్ ఐడియా, ఫ్రేజెస్, ఇడియమ్స్ తదితరాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఈ విభాగంలో మంచి స్కోర్ సాధించేందుకు ప్రామాణిక ఇంగ్లిష్ దినపత్రికలను రోజూ చదువుతూ.. వొకాబ్యులరీ పెంచుకోవాలి. సెంటెన్స్ ఫార్మేషన్‌పై పట్టుసాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలపై అవగాహనను పరీక్షించే విభాగం ఇది. దీనికోసం స్టాండర్డ్ జీకే బుక్స్, న్యూస్ పేపర్లు, వీక్లీలు, వెబ్‌సైట్స్, పిరియాడికల్స్‌ను అనుసరించాలి. వీటితోపాటు బిజినెస్ న్యూస్, జాతీయ, అంతర్జాతీయ అంశాలు; వార్తల్లో వ్యక్తులు; భారత రాజ్యాంగం; వివిధ దేశాలు –కరెన్సీలు; భారతదేశం –రాష్ట్రాలు; అంతర్జాతీయ సంస్థలు; ద్రవ్య, కోశ గణాంకాలు, ఐటీ వల చోటు చేసుకుంటున్న సమకాలీన పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశాలు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కీలకమని భావించి గతేడాది ఈ విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌నకు సంబంధించిన టెక్నికల్ టెర్మినాలజీ(సీడ్ ఫండింగ్, క్రౌడ్ ఫండింగ్, ఏంజెల్ ఇన్వెస్టర్స్ తదితర)గురించి తెలుసుకోవాలి.స్టార్టప్ ఇండియా,మేకిన్ ఇండియా వంటి పథకాల లక్ష్యాలపై అవగాహన పెంచుకోవాలి.

250కి పైగా స్కోర్ లక్ష్యంగా

సీమ్యాట్ ద్వారా టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు.. 250 నుంచి 350 మార్కులు సాధించేలా కృషి చేయాలి. గత రెండేళ్ల ఫైనల్ మెరిట్ లిస్ట్‌లను పరిగణనలోకి తీసుకుంటే.. 300కు పైగా స్కోర్ సాధించిన అభ్యర్థులు వేయి మందికి పైగా ఉండగా, 250 నుంచి 300 మధ్యలో స్కోర్ సాధించిన అభ్యర్థుల సంఖ్య దాదాపు 10 వేలుగా ఉంది. కాబట్టి అభ్యర్థులు ఈ శ్రేణిలో స్కోర్ సాధించేలా కృషి చేస్తే టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం ఖరారు చేసుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 6, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: మార్చి 7 – 9, 2023
- సీమ్యాట్ పరీక్ష తేదీ: మే నెలలో నిర్వహించే అవకాశం ఉంది.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- పూర్తివివరాలకు వెబ్‌సైట్: cmat.nta.nic.in

శరవేగంగా ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణం

- విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముమ్మరంగా పనులు
- రూ.460 కోట్లతో 3.50లక్షల.చ.అ. విస్తీర్ణంతో టెర్మినల్
- అత్యాధునిక వసతులు, విపత్తులను తట్టుకునే సామర్థ్యంతో నిర్మాణం
- ఈ ఏడాది చివరికి అందుబాటులోకి తేవాలని లక్ష్యం


నిర్మాణంలో ఉన్న నూతన టెర్మినల్ భవనం

వేగంగా పనులు

ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరగా టెర్మినల్‌ను పూర్తిచేసి ప్రయాణికులకు వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే స్వదేశీ, విదేశీ ప్రయాణికులు ఒకచోట నుంచే రాకపోకలు సాగించవచ్చు.

ఎం.లక్ష్మీకాంతరెడ్డి,
విజయవాడ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్


నిర్మాణంలో ఉన్న నాలుగు వరుసల రహదారి

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.460 కోట్ల వ్యయంతో 3.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ టెర్మినల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే 45 శాతం నిర్మాణం పూర్తి కాగా, ఈ ఏడాది చివరి నాటికి టెర్మినల్‌ను సిద్ధంచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనులను రాత్రింబవళ్లు చేస్తున్నారు. ఇప్పటివరకు విమానాశ్రయంలో స్వదేశీ, విదేశీ ప్రయాణికుల కోసం వేర్వేరు టెర్మినల్స్‌ను వినియోగిస్తున్నారు. విభజన హామీల్లో భాగంగా శాశ్వత ప్రాతిపదికన దేశీయ, అంతర్జాతీయ ప్రయాణసేవలను ఒకే వేదికగా నిర్వహించేందుకు ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణం చేపట్టారు. మొత్తం రూ.611 కోట్లతో టెర్మినల్‌తోపాటు అప్రాన్ విస్తరణ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ భవనం, ఏరో బ్రిడ్జిల నిర్మాణాలను ఏకకాలంలో చేపట్టారు. ఇప్పటికే అప్రాన్ విస్తరణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఇవీ ఈ టెర్మినల్ ప్రత్యేకతలు...

- విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రానున్న 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఈ టెర్మినల్ నిర్మాణాన్ని 2020లో ప్రారంభించారు. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు టెర్మినల్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది.
- ఇటీవల కాంట్రాక్ట్ సంస్థ పనుల్లో వేగం పెంచింది. రెండు ఫ్లోర్ల టెర్మినల్ భవనానికి సంబంధించి కాంక్రీట్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇకపై పూర్తిగా స్టీలు, గ్లాస్ స్ట్రక్చర్‌తో టెర్మినల్ నిర్మాణం చేపట్టనున్నారు.
- ఎలాంటి ప్రకృతి విపత్తులు వచ్చినా తట్టుకునేలా అధునాతన పరిజ్ఞానంతో ఈ టెర్మినల్ నిర్మిస్తున్నారు.
- ఈ టెర్మినల్ భవనం పూర్తయితే ఒకేసారి 800 మంది దేశీయ ప్రయాణికులు, 400 మంది అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చు.
- నూతన టెర్మినల్‌లో అంతర్జాతీయ స్థాయిలో బ్యాగేజీ హ్యాండ్లింగ్ వ్యవస్థ, 24 చెక్ ఇన్ కౌంటర్లు, 14 ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు, మరో 4 కస్టమ్స్ కౌంటర్లు, అరైవల్, డిపార్చర్ బ్లాకుల్లో బ్యాగేజీ కన్వేయర్లు వంటి అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.
- టెర్మినల్‌ను అనుసంధానిస్తూ ఆరు ఏరో బ్రిడ్జిలను నిర్మించనున్నారు. దీనివల్ల టెర్మినల్ నుంచి ఏరో బ్రిడ్జిల మీదుగా ప్రయాణికులు నడుచుకుంటూ నేరుగా విమానం వద్దకు రాకపోకలు సాగించవచ్చు.
- నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ కోసం ప్రత్యేకంగా నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. ఇది టెర్మినల్ నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఎదురుగా జాతీయ రహదారితో కలవనుంది.
- ప్రయాణికులు నేరుగా టెర్మినల్ వద్దకు వెళ్లే విధంగా ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లై ఓవర్ తరహాలో వంతెన నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణాలను పూర్తి చేశారు.
- టెర్మినల్ ఎదురుగా 1,000 కార్లు, మరో 200 ట్యాక్సీల సామర్థ్యంతో కూడిన పార్కింగ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఆధార్ ముఖ గుర్తింపుతోనూ
పింఛన్ పంపిణీ

- వేలిముద్రలు పడని అవ్వాతాతల కోసం అదనపు సౌకర్యం
- మార్చి 1 నుంచే అమల్లోకి..
- పింఛన్ల పంపిణీ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని వలంటీర్లకు ఇప్పటికే ఆదేశాలు
- ఇప్పటివరకు ఉన్న అన్ని విధానాలు కూడా కొనసాగింపు



సాక్షి, అమరావతి: పింఛన్ల పంపిణీ సమయంలో వేలిముద్రల సమస్య తలెత్తే అవ్వాతాతలకు అదనపు సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. పింఛన్లు పంపిణీ చేసేటప్పుడు అవ్వాతాతల వేలిముద్రలు వలంటీర్ల వద్ద ఉన్న యాప్‌లో సరిపోలని పరిస్థితి ఎదురైతే.. ఆధార్ అనుసంధానంతో కూడిన లబ్ధిదారుని ముఖాన్ని అదే యాప్‌లో సరిపోల్చుకొని పింఛన్ డబ్బులు పంపిణీ చేయనున్నారు. మార్చి 1 నుంచి ఈ అదనపు సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఇందుకోసం తమ ఫోన్లలోని యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని వలంటీర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే పింఛన్ల పంపిణీకి ఇప్పటికే అమలులో ఉన్న అన్ని విధానాలు ఇకపైనా అందుబాటులో ఉంటాయని.. బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రల సమస్యలున్న వారి కోసమే ఈ ఆధార్ ముఖ గుర్తింపు సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 63 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానంలో పింఛన్లు పంపిణీ చేస్తోంది. అందులో దాదాపు 2 లక్షల మంది అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీ సమయంలో వేలిముద్రల సమస్య వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వీరందరికీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో కూడిన ఆర్‌బీఐఎస్ విధానంలో మరొక ప్రైవేటు యాప్ ద్వారా ముఖం సరిపోల్చుకొని పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు. ఈ ప్రక్రియలో ఆధార్‌తో ఎలాంటి సంబంధం ఉండదు. సిబ్బంది ముందుగా వేలిముద్రలు పడని లబ్ధిదారుని ఫొటోను ఆ ప్రైవేటు యాప్‌లో నమోదు చేస్తారు. ఆ ప్రైవేటు యాప్ వలంటీర్ల పింఛన్ల పంపిణీ యాప్‌లో ఒక భాగంగా అనుసంధానమై ఉంటుంది. ఆ ప్రైవేట్ యాప్‌లో ముందే అప్‌లోడ్ చేసిన లబ్ధిదారుని ఫొటోతో.. వలంటీర్ తీసిన ఫొటో సరిపోతే.. అతనికి పింఛను డబ్బులు పంపిణీ చేసేందుకు యాప్ ఒకే చెబుతోంది. అయితే కొన్నిసార్లు ఇందులో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అవ్వాతాతల సౌలభ్యం కోసం ఆధార్ ముఖ గుర్తింపు విధానం వినియోగానికి ప్రభుత్వం అనుమతి కోరగా.. యూఐడీఏఐ ఇటీవల అనుమతి ఇచ్చింది. దీంతో మార్చి 1 నుంచి వేలిముద్రల సమస్య ఉన్నవారికి ఆధార్ ముఖ గుర్తింపుతో కూడా పింఛన్ అందజేయనున్నారు.

అధిక పెన్షన్‌కు ఆప్షన్ ఇలా!

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగి భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) పరిధిలో అధిక పెన్షన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు మొదలైంది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అధిక పెన్షన్‌పై ఈపీఎఫ్‌ఓ మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హత ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు.. అధిక పెన్షన్‌కు ఆప్షన్ ఇవ్వడంతోపాటు దరఖాస్తు నింపాలి. ఇందుకు ఈపీఎఫ్‌ఓ మెంబర్ పోర్టల్‌లో లింకును అందుబాటులోకి తెచ్చింది. 2014 సెప్టెంబర్ 1 తర్వాత పదవీ విరమణ పొందిన వారు, ప్రస్తుతం సర్వీసులో ఉండి అధిక పెన్షన్‌కు అర్హత ఉన్న వారు తమ వివరాలను నమోదు చేసుకోవడంతోపాటు జాయింట్ ఆప్షన్ ఇవ్వాలి. వీరు మే నెల 3 వరకు ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు గడువు విధించింది. అయితే 2014 సెప్టెంబర్ 1 కంటే ముందే పదవీ విరమణ పొంది అధిక పెన్షన్‌కు అర్హతలుండి ఆప్షన్ ఇచ్చి ఈపీఎఫ్‌ఓ ద్వారా తిరస్కరణకు గురైన వారు మాత్రం మార్చి 3లోపు జాయింట్ ఆప్షన్‌తోపాటు వివరాలు సమర్పించాలి. కాగా, అర్హులు ఎవరైనా జాయింట్ ఆప్షన్‌ను ఇవ్వకుంటే భవిష్యత్తులో అవకాశం ఉండదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

సర్వర్ సతాయింపు

ఈపీఎఫ్‌ఓ మెంబర్ పోర్టల్‌లో అధిక పెన్షన్ లింకును ఎక్కువ మంది ఓపెన్ చేస్తున్నారు. దీంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగింది. సాధారణ సమయంలోనే అత్యంత నెమ్మదిగా ఉండే ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్... తాజాగా అధిక పెన్షన్‌కు సంబంధించిన ఒత్తిడి పెరగడంతో స్తంభించిపోతోంది. వెబ్‌సైట్‌లో పేజీ తెరిచి ఆప్షన్ నమోదు లింకు, దరఖాస్తు లింకును క్లిక్‌చేస్తోంటే చాలామందికి ఎర్రర్ మెసేజ్ వస్తోంది. దీంతో అటు ఉద్యోగులు, ఇటు యాజమాన్యాలు గందరగోళానికి గురవుతున్నాయి. 2014 సెప్టెంబర్ 1 కంటే ముందే పదవీ విరమణ పొంది అధిక పెన్షన్‌కు అర్హతలున్న వారికి ఈ సాంకేతిక సమస్య గుబులు పుట్టిస్తోంది.

'బచావత్' ప్రకారమే శ్రీశైలం, సాగర్ నిర్వహణ

- సాగు, తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యం
- శ్రీశైలంలో జూలై 1 నుంచి అక్టోబర్ 31 వరకూ కనీస నీటిమట్టం 854 అడుగులకు పైగా ఉండాల్సిందేనని స్పష్టీకరణ
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అమల్లోకి వచ్చే వరకు ఇదే రూల్ కర్వ్ అమలు
- ఆర్‌ఎంసీ నివేదికపై సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకోనున్న కృష్ణా బోర్డు

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ రూల్ కర్వ్స్ (నిర్వహణ నియమావళి) ముసాయిదాను బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల మేరకే రూపొందించామని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మరోసారి కృష్ణా బోర్డుకు స్పష్టం చేసింది. శ్రీశైలంలో 75 శాతం లభ్యత ఆధారంగా 811 టీఎంసీలను ఏపీ, తెలంగాణ ఉపయోగించుకున్న తర్వాతే విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు వాడుకోవాలని పునరుద్ఘాటించింది. సాగు, తాగునీటి అవసరాలకే శ్రీశైలంలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని తేల్చిచెప్పింది. ఆ అవసరాల కోసం దిగువకు నీటిని వదిలేటప్పుడే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని స్పష్టం చేసింది. జూలై 1 నుంచి అక్టోబర్ 31 వరకూ శ్రీశైలంలో కనీస నీటిమట్టం 854 అడుగులకు ఎగువన ఉండాలని తేల్చిచెప్పింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వచ్చే వరకూ ఇదే రూల్ కర్వ్స్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8న జలాశయాల నిర్వహణ కమిటీ (ఆర్‌ఎంసీ) ఇచ్చిన నివేదికపై సర్వసభ్య సమావేశంలో చర్చించి.. అమలుపై నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ నిర్ణయించారు.

అంగీకరించి ఆనక అడ్డం తిరిగిన తెలంగాణ

కేంద్ర జల్‌శక్తి శాఖ 2021 జూలై 15న జారీ చేసిన నోటిఫికేషన్ అమల్లో భాగంగా శ్రీశైలం, సాగర్ రూల్ కర్వ్స్‌పై ముసాయిదా నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని కృష్ణా బోర్డు కోరింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ఆధారంగా రూల్ కర్వ్స్ ముసాయిదాను 2022 ఫిబ్రవరి 2న కృష్ణా బోర్డుకు సీడబ్ల్యూసీ అందజేసింది. ఈ ముసాయిదాపై రెండు రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకుని, ఖరారు చేసేందుకు 2022 మే 10న ఆర్‌ఎంసీని కృష్ణా బోర్డు ఏర్పాటు చేసింది. ఆరుసార్లు సమావేశమైన ఆర్‌ఎంసీ.. సీడబ్ల్యూసీ రూపొందించిన రూల్ కర్వ్స్‌ను ఆమోదించింది. దీనిపై కృష్ణా బోర్డు, ఏపీ అధికారులు సంతకాలు చేశారు. తొలుత రూల్ కర్వ్స్‌ను ఆమోదించినట్టు ప్రకటించిన తెలంగాణ అధికారులు.. ఆ తర్వాత దానిపై సంతకం చేయకుండా అడ్డం తిరిగారు.



బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చే వరకూ రూల్ కర్వ్స్‌కు అంగీకరించబోమని తెలంగాణ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే సీడబ్ల్యూసీని మరోసారి కృష్ణా బోర్డు సంప్రదించింది.

సర్వసభ్య సమావేశంపైనే దృష్టంతా..

ఎప్పటికప్పుడు వాయిదా పడుతున్న సర్వసభ్య సమావేశాన్ని మార్చి రెండో వారంలో నిర్వహించాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. రెండు రాష్ట్రాలతో చర్చించి తేదీని ఖరారు చేయనుంది. ఆర్‌ఎంసీ నివేదిక అమలే ప్రధాన అజెండాగా ఈ సమావేశం ఉండనుంది. శ్రీశైలం, సాగర్ రూల్ కర్వ్స్ అమలు చేసి.. వాటిని అధీనంలోకి తీసుకోవడం ద్వారా జల వివాదాలకు చెక్ పెట్టాలని కృష్ణా బోర్డు భావిస్తోంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.